దశలలో మాలాలనపాలన పోషణచెయ్యలేకపోయారు. మాకుకూడ మీప్రేమనుపొందే అదృష్టం లేకపోయినది. సకల పురుషార్థాలనూ సాధించడానికి ఉపయోగపడే శరీరాన్ని ఇచ్చిన తలిదండ్రుల ఋణాన్ని నూరేండ్లకైనా తీర్చుకొనలేముకదా! శక్తిసామార్థ్యాలు ఉండికూడ తలిదండ్రులకు తన దేహముతోను, ధనముతోనూ సేవచేయని కుమారుడు దుష్టుడూ, నికృష్టుడు అనిపించుకొంటాడు, వాడు అధోలోకాలకుపోతాడు. యమునిచే శిక్షింపబడుతాడు. తలిదండ్రులను, వృద్ధులను, పుత్రులను, గురువులను, బ్రాహ్మణులను, సాధువులను, భార్యలను, శరణార్థులను, సామర్థ్యముండి కూడ కాపాడనివాడు జీవన్మృతునితో సమానుడు. మాకారణంగా కంసుడు మిమ్మల్ని చెరసాలలో బంధించి, బాధలకుగురి చేస్తుంటే, మేము ఏమీ చెయ్యలేక ఊరుకొన్నందుకు మమ్మల్ని క్షమించండి". అని, మాయామానుషవిగ్రహుడైన శ్రీకృష్ణుడు చెప్పగా దేవకీవసుదేవులు మిక్కిలి మోహముజెంది, పుత్రులను కౌగిలించుకొని, ఒడిలో కూర్చుండబెట్టుకొని, కన్నీళ్లతో వారి శిరస్సులను తడిపారు. తరువాత మాతామహుడైన ఉగ్రసేనుని కలుసుకొని, శ్రీకృష్ణుడు ఇలాగ చెప్పాడు:

"మహానుభావా! యయాతిశాపం వలన యాదవులు రాజపీఠాన్ని అధిష్ఠించలేరు. కాబట్టి ఈ రాజ్యానికి నీవే అధిపతిగానుండు. మేము నిన్ను సేవిస్తాము. ఇతర రాజులేకాక దేవతలుకూడ నీకు కప్పము కడతారు."అని చెప్పి ఉగ్రసేనునికి రాజ్యాభిషేకము చేయించాడు. కంసునివలన భయముచే ఇతర దేశాలకు పారిపోయిన యదు, వృష్ణి, అంధక, మధు, దాశార్హ, కుకరాది వంశజులను మరల రప్పించి, ధనమిచ్చి వసతులు కల్పించి, ఆనందంగా నుండే ఏర్పాటు చేయించాడు శ్రీకృష్ణుడు.

తరువాత అన్నతోవెళ్లి నందునకు వీడ్కోలు చెప్పవలసియున్నది. ఇది శ్రీకృష్ణునికి కూడ అతి సున్నితమైన సన్నివేశము. పుట్టినదాదిగా అతడు యశోదానందుల యొక్క సాటిలేని వాత్సల్యప్రేమలను చూరగొన్నాడు. వారు ఏ ఇతర తలిదండ్రులూ ఇవ్వలేనంత నిస్స్వార్థప్రేమను కురిపించిన ప్రేమమూర్తులు. కృష్ణునితోడిదే తమ ప్రపంచముగా జీవించిన పుణ్యమూర్తులు వారు. అటువంటి భక్తులనుండి దూరముకావడం భగవంతునకు కూడ కష్టమేనేమో! నందునితో కృష్ణుడిలా అన్నాడు:

శా॥ తండ్రింజూడము తల్లిఁజూడము యశోదాదేవియున్ నీవు మా
తండ్రిందల్లియు నంచు నుండుదుము సద్ధర్మంబులం దొల్లి యే
తండ్రుల్ బిడ్డల నిట్లు పెంచిరి? భవత్సౌజన్య భావంబులన్
తండ్రీ! యింతటి వారమైతిమిగదా తత్తద్వయో లీలలన్ **1400**

"తండ్రీ! మేము తల్లిని చూడలేదు, తండ్రిని చూడలేదు, యశోదమ్మ, నీవు మాత్రమే మా తల్లీతండ్రీ అంటూ ఇన్నాళ్లు ఉన్నాము. ఈవిధంగా సద్ధర్మాలతో, (ఉత్తమ సంస్కారాలతో) ఇదివరకు ఏ తలిదండ్రులు (మీరుతప్ప) బిడ్డలను పెంచారు? నీయొక్క సజ్జనత్వంవలననేకదా, తండ్రీ! వయస్సునకుతగ్గ లీలలతో మేము ఇంతవారముకాగలిగాము! ఇక్కడి బంధువులను కొన్నాళ్లు సంతోషపెట్టి, మేము గోకులంవస్తామని అమ్మకు, అందరికీ, చెప్పు. మీరంతా మాకిచ్చిన ప్రేమాదరాభిమానాలను మేమెక్కడున్నా మరువలేము" అని చెప్పి, ఆదరంతో కౌగలించుకొని పాదనమస్కారంచేశాడు ఇతర గోపకులకు, మిత్రులకు వీడ్కోలు చెప్పి, అందరికీ వస్త్రాలు, ఆభరణాలు, కానుకలు ఇచ్చి సాగనంపాడు. నందుని మనస్థితి ఊహాతీతము. వర్ణనాతీతము. పన్నెండేళ్లుగా పెంచిన ప్రేమపెల్లుబుకగా, వలవలాఏడుస్తూ, అతడు విలవిలలాడిపోయాడు. విడువలేక ముందుకువెళ్తున్నా, వెనక్కేచూసుకొంటూ, గోవిందుని రూపాన్ని గుండెలో దాచుకొని, నెమ్మదిగా సాగిపోయాడు మహాత్ముడైన నందుడు.

విద్యాభ్యాసము, గురుదక్షిణ

వసుదేవుడు గర్గాదిపురోహితులచే యథావిధిగా తనయులకు ఉపనయనసంస్కారం చేయించాడు. బ్రహ్మచర్యదీక్షనుపూని గురుకులవాసంచేసి, గురువువద్ద శిక్షణపొంది, విద్యనభ్యసించాలనేది వైదిక సంప్రదాయము. తాము సర్వజ్ఞులే అయినప్పటికీ ప్రజలకు ఆదర్శంచూపాలని రామకృష్ణులు సంప్రదాయం ప్రకారం ఆచార్యుని అన్వేషిస్తూ బయలుదేరారు. కాశీపట్టణము చేరుకొని అవంతీపురవాస్తవ్యుడైన సాందీపనిఅనే గురువువద్ద విద్యాభ్యాసానికి చేరారు. ఆయన బలరామకృష్ణులకు వేదవేదాంగ - ఉపనిషత్తులూ, ధనుర్వేదము, తంత్రము, మనుధర్మాది శాస్త్రాలు, న్యాయ, తర్క, రాజనీతి మొదలైన శాస్త్రాలు బోధించాడు. శిష్యులు అరవైనాలుగు విద్యలను అరవైనాలుగు దినాలలో, శ్రవణమాత్రాన నేర్చుకొన్నారు. తాము గురువులకే గురువులైనప్పటికీ, సాందీపని గురువును అసలైన శిష్యులవలె సేవించారు. ఇంతటి ప్రతిభావంతులైన శిష్యులను సాందీపనిగురువు చూచియుండలేదు. ఇంతశీఘ్రముగా సకలవిద్యలలో నిష్ణాతులైన ఈ శిష్యులు సామాన్యులుకారని గురువు గ్రహించాడు. విద్యాభ్యాసము ముగిసినది. సంప్రదాయము ప్రకారము గురుదక్షిణ ఇవ్వవలసియున్నది. గురువుగారి అభీష్టాన్ని తెలుసుకొనదలచి అడిగారు. గురువు ఒక అపూర్వమైన గురుదక్షిణను కోరినాడు. "నాయనలారా! మీరు అసమాన శక్తి సామర్థ్యాలు కలవారనీ, దేనినైనా సాధించగలరనీ గ్రహించాను. మాకుమారుడు ప్రభాసతీర్థానికి వెళ్లి, స్నానంచెయ్యడానికి సముద్రంలోదిగి తిరిగిరాలేదు. అతనిని మీరు తీసుకొని వచ్చి, శోకముతో కృశించిపోతున్న గురుపత్నిని రక్షించండి. ఇదే నా కోరిక. సర్వసమర్థులైన మీకు ఈకోరికను తీర్చడం అసంభవం కాదని నేను భావిస్తున్నాను." అని చెప్పగా వారు గురువునకు నమస్కరించి, రథమెక్కి సముద్రుని వద్దకు పయనమై వెళ్లారు. సముద్రాన్ని సమీపించి, ఇలా అన్నారు: "ఓసాగర శ్రేష్ఠమా! నీ గర్భాన దాచిపెట్టిన మా గురుపుత్రుని వెంటనేతెచ్చి ఇవ్వకపోతే, మాబాణాలతో నిన్ను శుష్కింపజేస్తాము." అనగా, సాగరుడిలాగ బదులుచెప్పాడు: "యాదవేశ్వరులారా! మీగురుపుత్రుడు నావద్దలేడు. నమ్మండి. ఆ అందాలబాలుడు స్నానానికి దిగగానే, ఒక పెద్దతరంగం అతనినిలోనికి లాక్కొనిపోగా, పంచజనుడనే అసురుడు వానిని మ్రింగివేశాడు." అనిచెప్పి, ఆ రాక్షసుని ఉనికిని తెలియజేశాడు సాగరుడు. అప్పుడు శ్రీకృష్ణుడు తన శంఖం పూరించగా, ఆశంఖారవాన్నివిని పంచజనుడు కంపించిపోయాడు. శ్రీకృష్ణుడు సాగరగర్భంలో ప్రవేశించి, పంచజనుని చంపి, పొట్టచీల్చిచూడగా గురుపుత్రుడు అక్కడలేడు, కాని ఒకశంఖమున్నది. అదే పాంచజన్యశంఖము. దానిని తీసికొని పైకివచ్చి, బలభద్రునితోగూడి యముని పట్టణమైన సంయమని వెళ్లాడు. అక్కడ శంఖాన్ని పూరించగా, యముడు బైటకువచ్చి, బలరామకృష్ణులను చూచాడు. వారు, నారాయణావతార పురుషులని గుర్తించి, నమస్కరించి, ఏమిఆజ్ఞ అని అడిగాడు. శ్రీకృష్ణుడిలా అన్నాడు: "ఓధర్మప్రభూ! మాగురుపుత్రుడు నీవద్దనే ఉండవచ్చు. అతనిలోనేదో దోషముండటంచేత దండించడానికి ఇక్కడికి రప్పించియుండవచ్చు. అయినా అతడు మాకు పూర్వరూపములో కావలసియున్నది." అనిచెప్పగా స్వయంగానారాయణుడే కోరినందున ఆజీవియొక్క దోషాలన్నీ తొలగిపోయినట్టే అనిభావించి, యముడు ఆబాలునితెచ్చి ఒప్పజెప్పాడు.

రామకృష్ణులు బాలకుని తీసుకొనివెళ్లి గురుదంపతులకు సమర్పించి, ఇంకేమికావాలని అడిగారు. గురుదంపతులు అమితానందభరితులైనారు. గురువు వారితో ఇలా అన్నాడు: "కుమారులారా! ప్రపంచ చరిత్రలో ఇటువంటి గురుదక్షిణ ఇవ్వడం జరగలేదు. యమునివద్దకు వెళ్లిన జీవిని తిరిగి తీసుకురావడం ఎవ్వరికినీ సాధ్యపడని పని. ఇటువంటి గురుదక్షిణను ఇచ్చిన మీకీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఓమహానుభావులారా! మీరు సామాన్య మానవులుకారు. మీకు గురువునైనందుకు నేను చాలాధన్యుడనైనాను." అని, సాందీపనిగురువు, శిష్యులైన బలరామకృష్ణులకు నమస్కరించాడు.

రామకృష్ణులు మధురానగరంచేరి, శంఖాలు ఊదగా, పోయిన ధనము లభించినంతగా మధురావాసులంతా సంతసించారు. కాలము గడచిపోతున్నది. తానులేని గోకులము, యశోదానందులకే కాకుండా, గోప, గోపీ, గోప బాల, గోవత్స, గోవులకు కూడా నిరుత్సాహపూరితంగా నుంటుందని శ్రీకృష్ణుడు ఊహించాడు. తాను వారిని విడిచి వచ్చిన తరువాత మళ్లీవెళ్లలేదు సరికదా, ఏవిధమైన సందేశాన్నికూడ పంపించలేదు. గోకులవాసులందరూ, తనగురించి తపించిపోతుంటారని తెలిసిన ఆదయామయుడు తన ప్రతినిధిగా ఎవరినైనా గోకులానికి పంపించ సంకల్పించాడు.

గోకులంలో ఉద్ధవుడు

వృష్ణి వంశీయులలో శ్రేష్ఠుడు ఉద్ధవుడు, చాలాబుద్ధిమంతుడు. దేవగురువైన బృహస్పతియొక్క శిష్యుడు. శ్రీకృష్ణుని ప్రేమించే ఉత్తమ భక్తుడు. ఒకనాడు శ్రీకృష్ణుడు ఉద్ధవుని చేతిని పట్టుకొని ఇలా అన్నాడు: "మిత్రమా, ఉద్ధవా! నీవు నాగురించి ఒక పని చేయవలసియున్నది. నేను గోకులంవిడిచి వచ్చినప్పటి నుంచీ 'మళ్లీ నేను ఎప్పుడుతిరిగి వస్తానో' అని రేయింబవళ్లు, నారాక గురించిఎదురుచూస్తూ ఆర్తిజెందియున్న అమాయకపు గోపికలకు నాయొక్క సందేశాన్ని అందించాలి. నాగురించి ఆప్తబంధువులనూ, సర్వస్వాన్నీ త్యజించి, నాయందే మనస్సునిలిపి, అనుక్షణమూనన్నే స్మరిస్తుండే అనన్యభక్తులు వారు. నీవుపోయి నాగురించి వారికి తెలిపి, వారిమనస్సులకు కొంతప్రశాంతతను కలుగజెయ్యాలి. లౌకిక బంధాలను విడిచి, నాగురించే చింతించే ప్రపన్నులకు నేను వశుడనై నాకరుణాదృష్టులను వారిపైసారించి పోషిస్తాను. ఆశ్రితరక్షణమే నాసహజ స్వభావముకదా! నా సందేశాన్ని గోపికలకు తెలియజేయడానికి నీవే సమర్థుడువు." అని శ్రీకృష్ణుడు చెప్పగా ఉద్ధవుడు సంతోషముతో అంగీకరించాడు.

ఉద్ధవుడు శ్రీకృష్ణునిచిన్ననాటి ఆటస్థలాలను, పవిత్రమైన బృందావన, యమునాతీరాలను, అతని స్నేహితులను, గోపికలను, నందయశోదలను, దర్శించాలనే ఉత్సాహంతో వడివడిగా రథాన్ని నడుపుకొంటూ గోధూళి సమయానికి గోకులంచేరుకొన్నాడు. గృహాలన్నీ సంధ్యాదీపాలతో చక్కగా అలంకరించుకొని శ్రీకృష్ణలీలామృతగానాలాపనలు చేస్తుండే గోపికలతోను, పాలుపిదికే స్వరాలతోను, కడురమ్యముగా కనిపించినవి. ఉద్ధవుడు నందగృహానికి చేరుకొన్నాడు. నందుడు ఎదురుగావెళ్లి కౌగిలించుకొని కృష్ణుడే వచ్చినంతగా సంతోషించి, లోనికి తీసుకొనివెళ్లాడు. కుశలప్రశ్నలు, ప్రియాలాపాలు అయిన తరువాత మృష్టాన్న భోజనాదులు ముగిసిన తరువాత, సుఖాసీనులై ఇలాగ ముచ్చటించుకొన్నారు: నందుడు అడుగుతున్నాడు: "నాయనా, ఉద్ధవా! నామిత్రుడు, వసుదేవుడు క్షేమంగానున్నాడా? కంసునిభయముతీరి ఇప్పుడు పుత్రులతో సుఖముగానున్నాడుకదా? తక్కిన బంధువులందరూ కుశలమేనా? మాచిన్ని కృష్ణయ్య, ఇక్కడనుండి విడిచిపెట్టివెళ్లిన పిమ్మట తల్లినీ తండ్రినీ తలచుకొంటున్నాడా? ఈ బృందావనము, యమున, మిత్రులు, గోవులు, గోపికలు, అతనిస్మృతిలోనున్నారా? కృష్ణుడులేని ఈ స్థలమంతా ఒక శూన్యమండలమైపోయినది. బాలకులు గోవులను మేపడానికి శ్రద్ధచూపడంలేదు. గోపికల ఉత్సాహంనశించి, నిర్జీవులుగా కనిపిస్తున్నారు. గోవులు కృష్ణుని వేణునాదం గురించి చెవులు నిక్కబెడతాయిగాని వినలేవు. కృష్ణపాదస్పర్శతగలక పచ్చిక బయళ్లుకూడ శుష్కించిపోయినట్లున్నవి. ఉద్ధవా! ఆకృష్ణస్వామి గోకులవాసులను ఎన్ని ప్రమాదాలనుండి రక్షించాడోచెప్పలేము. నాయనా! మాకృష్ణయ్య ఇక్కడికి ఎప్పుడు వస్తాడో చెప్పాడా! ఆ మురళీ మోహనుని ముద్దుల ముఖారవిందాన్ని తిలకించే భాగ్యము మాకు ఈ జన్మలో మళ్లీ లభిస్తుందా?"అని పల్కుచుండగా అతనిగొంతు బొంగురుపోయినది. కన్నీరు కట్టలు తెంచుకొని ప్రవహించగా బావురుమన్నాడు నందుడు. లోపల తలుపువద్దనే వింటూ కూర్చొనియున్న యశోదామాత: హాకృష్ణా, కన్నయ్యా, తండ్రీ - అని ఆర్తనాదంచేసి, ప్రేమనిహ్వాలయై పరవశించిపోయినది. కన్నులనుంచినీరు, చన్నులనుండి పాలు ప్రవహించాయి. కృష్ణ వియోగతాపముతో కృశించిపోయిన ఆ

తలిదండ్రులయొక్క మానసికస్థితిని చూచి, ఉద్ధవుడు అనునయంగా, ఇలా అన్నాడు: "కృష్ణుడు తలిదండ్రులైన మిమ్మల్నీ, మీయొక్క ప్రేమ, వాత్సల్యాలను ఎన్నటికీ మరచిపోలేడు. ఈ బృందావనము యమున, గోకులవాసులతో అతనికి ఏర్పడిన పన్నెండేళ్ల అనుబంధము, అతనికి చిరస్మరణీయములు. అతడు మీతోనే మీమనస్సులలోనే సదా ఉంటాడు. మీకు సకలసౌఖ్యాలను చేకూర్చుతాడు.

మ॥ బలుడుం గృష్ణుడుమర్త్యులే? వసుమతీభారంబు వారింప వా
రలరూపంబుల పుట్టినాడుహరి నిర్వాణ ప్రభుండెవ్వ డు
జ్జ్వలుడై ప్రాణవియోగ కాలమున తత్పర్వేశుచింతించువా
డలఘు శ్రేయము పొందు బ్రహ్మమయుడై యర్కాభుడై నిత్యుడై 1445

బలరామకృష్ణులు సామాన్య మానవులనుకొంటున్నారా? కాదు, భూభారాన్ని నివారించడానికి మోక్షప్రదుడైన శ్రీహరియే వీళ్లరూపాల్లో జన్మించాడు. ఎవడు ప్రాణప్రయాణ సమయమప్పుడు ఆ సర్వేశ్వరుని గురించి చింతిస్తాడో, అతడు అమితమైన శ్రేయస్సును పొంది, నిత్యుడై, తేజస్వియై బ్రహ్మమయుడవుతాడు. అటువంటి నారాయణుడు, సర్వాంతరాత్ముడు, కారణజన్ముడై మానవాకారంలో పుట్టినందున మీరంతా మీ మనస్సులను అతనియందుంచి కొలిచినారు. మీరు పరమధన్యులు. కట్టెలలో నిక్షిప్తమైయున్న నిప్పువలె అతడు ఎల్లప్పుడూ ప్రాణులందు ప్రకాశిస్తుంటాడు. అతనికి తల్లి తండ్రి బంధువు భార్య సఖుడు ఇష్టుడు అనిష్టుడు, శత్రువు అంటూ ఎవ్వరూలేరు. జనన మరణాలులేవు. కర్మలు లేవు. కర్మబంధాలు లేవు. అతడు సజ్జనులను రక్షించడానికి, గుణరూపాలులేని పరమేశ్వరుడు వచ్చిన, అతడు రూపాలను ధరించి, గుణాలను వహించి, సృష్టి స్థితి లయాలనే లీలలు సాగిస్తుంటాడు." అని చెప్పాడు. వారు ముగ్గురూ శ్రీకృష్ణుని లీలావిలాసవైభవాల గురించి ఆ రాత్రంతా ముచ్చటించుకొంటూ గడిపివేశారు.

ఉద్ధవుడు ఉదయాన్నే స్నానాదికములను, నిత్యఅనుష్ఠానాలను ముగించుకొని, ఒక ఏకాంతస్థలంలో కూర్చున్నాడు. దూరంనుండి గోపవనితలు అతనిని చూచి, కృష్ణుడే వచ్చియుంటాడనుకొని, పరుగు పరుగునవచ్చి, అతని చుట్టూమూగిపోయారు. అక్కడ కృష్ణుని బదులుగా ఉద్ధవుని చూచి, సిగ్గుపడి తలలు వంచుకొని, చిరునవ్వులతో ఇలా అన్నారు: "మహాశయా! నీవు కృష్ణుని కుశల వార్తలను నందయశోదలకు తెలియజెప్పడానికి వచ్చిన ఆ నల్లనయ్య మిత్రుడవని ఊహించుకొన్నాము, నయమే! తలిదండ్రులనైనా మరచిపోకుండా ఉన్నాడు నీమిత్రుడు. అవునులే! తలిదండ్రులు తప్పిస్తే అతనికి ఇంకెవ్వరున్నారులే ఇక్కడ? ఎవ్వరైనా అవసరం ఉన్నంతవరకే స్నేహాలుచేస్తారుకదా! అవసరంతీరగనే అక్కరచేయరు."అని, నిష్ఠురోక్తులాడారు. వారిలో ఒకామె చాలాచురుకైనది. ఒక తుమ్మెద అక్కడకు ఝంకారంచేస్తూ వచ్చినది. దానిని చూడగనే ఆమెకు కవిత్వం పుట్టుకొనివచ్చినది. ఆ తుమ్మెదను తనప్రియునివద్దనుండి వచ్చిన దూతగా కల్పించుకొని, తనప్రియుడు తనవద్దకు, దూత ద్వారా సందేశంపంపి, వేడుకొనుమని పంపించినట్లు ఊహించుకొని, ఉద్ధవునికి అర్థమగునట్లుగా, ఇలా అన్నది:

"ఓ మధుపమా! ధూర్తుడైన నీ మిత్రుడు నిన్నిక్కడికి పంపించాడని మాకుతెలుసు. నీవు మా పాదాలను తాకవద్దు. నీకు మధురానగరిలోని అందగత్తెలు, నీమిత్రునికి అలంకరించే పుష్పమాలలోని మకరందమే రుచిగా నుంటుంది. ఇక్కడేమున్నదని? ఒక పువ్వులోని తేనెను పీల్చివేసి వేరొక పువ్వును పట్టుకొనే నీవంటివాడే నీమిత్రుడు. పాపం! అతనిని నమ్మికొని, ఆ లక్ష్మీదేవియే మోసపోయినది. ఓ భృంగరాజా! నీ మిత్రుని చరిత్రను, నీవు మావద్ద ఎంతపొగిడినా, మేము నమ్మితాం అనుకొంటున్నావా? అతనిని గురించి మాకు బాగా తెలుసులే! నీవుపోయి, ఆ మధురానగరి మగువల వద్ద వినిపించు. సంతోషించి, వారు నిన్ను సత్కరిస్తారు. ఓ మధుపమా! నీకు మాత్రము

తెలియదా! ఆ మనోహరుని మందహాసానికి కరిగిపోనికాంత, ఈ ముల్లోకాల్లోనూ ఒక్కతైనా ఉన్నదా? ఆ గొప్పఇల్లాలు కమలాదేవియే అతనిపాదసేవ చెయ్యకుండా ఒక్కక్షణమైనా ఉండలేదే! మరి, మాలాంటి వాళ్లం బింకముగా ఎలాగ ఉండగలం? పోనీ, నీవైనాచెప్పు, ఇదేమైనా బాగున్నదా! మా భర్తలను, బంధువులను, సర్వమూ త్యాగంచేసి, నీమిత్రునికే, మా మనస్సులను అర్పించివేసిన మమ్మలను ఇలాగ పరిత్యజించి పారిపోవడం ఏమైనా న్యాయమేనా? ఇదిగో విను, నీమిత్రుని నమ్మి మాలాగ మోసపోయిన వారెందరో ఉన్నారు సుమా! ఆమాయావికి కూడ బాగాతెలుసు, మా యొక్క బలహీనత - మానవులేకాదు, పశు పక్ష్యాదులు కూడా, అతని వేణునాదం విన్నా, అతని దివ్యనామాన్ని చెవులారా ఒక్కసారి వినినా చాలు, అయిన వాళ్లనూ, ఇల్లూ సంసారం, సంపదా అన్నిటినీ విడిచి, అతని వెంట పడతారని అతనికి తెలుసు. ఓభ్రమరమా! అవునులే మాదే పారపాటు! మధురానగరిలో బంగారు రేకులతో తాపబడిన భవనాలు, సామంతరాజులు కొలుస్తుండే రాజరికమూ, సుగంధశృంగారాలతో వెలిసే ఉద్యానవనాలు, సకల విద్యాసంస్కార శోభితలైన సుందరీమణులూ, సర్వసుఖాలు ఉంటాయి. వాటన్నిటినీ విడిచి, ఇక్కడేమున్నదని ఇక్కడికి వస్తాడు? ప్రభువులెప్పుడూ నూతనప్రియులే కదా!" అని ఈ విధంగా తమయొక్క అనన్యప్రేమను, విరహాన్నీ, వ్యథనూ, వెలిబుచ్చుతున్న అమాయకగోపికల నిర్మల, నిష్కపట, ప్రేమను గ్రహించి, ఉద్ధవుడు ఆశ్చర్యపోయాడు. వారిప్రేమాతిశయానికి మురిసి పోతూ ఇలా అన్నాడు: "ఓ పుణ్యవతులారా! శ్రీకృష్ణునిపై మీకున్న నిర్మల నిరతిశయప్రేమ చరితార్థమైనట్టిది. జపతపాది అనేకమైన సాధనలుచేసిన యోగి పుంగవులుకూడ పొందలేనట్టిది మీ ధ్యాననిష్ఠ. శ్రీకృష్ణుడు మీతో చెప్పుమన్న మాటలను చెపుతానువినండి: ఇవి ఆ ప్రభువు చెప్పిన మాటలుగా తెలుసుకోండి:

"ఓ రమణులారా! ఎడబాటువలన కలిగిన వియోగ బాధనుమీరంతా అనుభవిస్తున్నారని నాకు తెలుసు. వ్యక్తియొక్క బాహ్యస్వరూపంపైన అనురాగంపెంచుకొంటే ఇలాంటి బాధలు తప్పవు. సమస్త కార్యాలకూ కారణమునేనే అయియుండి, అన్నింటి యందునేనే వ్యాపించియున్నందున మీకూనాకూ ఎడబాటులేదు. అంతరంగంలో నాతో నిత్య సాయుజ్యాన్ని అనుభవిస్తున్నమిమ్ము, బాహ్యవియోగము బాధించరాదు. దూరముగా నున్నప్పుడే ప్రేమ, ధ్యాస పెరుగుతాయి. నన్నే మీరు ఎల్లప్పుడూ స్మరిస్తుండాలని నేను మీకు ఈ ఎడబాటును కలిగించాను. నిరంతర ధ్యానంచే మీరుననున్ను పొందగలరు" అని మనప్రభువైన శ్రీకృష్ణుడు మీతో చెప్పుమన్నాడు. గోపికలు ఉదాత్తమైన కృష్ణప్రేమ తత్త్వాన్ని కొద్దిగా గ్రహించినవారై ఊరటజెందారు. "మహాశయా ఉద్ధవా! కృష్ణుడు ఇక్కడికి ఎప్పుడైనా వస్తాడా? మా పరితాపం తీర్చుతాడా! ఆమధురానగరకాంతలు అతనిని రానిస్తారా? మాకూ అతనికీ మధ్యనున్న రహస్యాలను నీతో చెపుతుంటాడా! మేము కాళిందీ నదిలో స్నానంచేస్తుంటే, మా వస్త్రాలను అపహరించినట్లు చెప్పాడా? మాతోరాసక్రీడలు ఆడినట్లుచెప్పాడా? ఓపుణ్యాత్ముడా! మాప్రభువునకు మామాటలుగా ఇలాచెప్పు:

"ప్రాణేశ్వరా! నిన్ను విడిచి ఇకమీదట మా శరీరాలు ఈ భూమిపై నుండలేవు. మా మనోధైర్యాలూ, మనస్సులూ, ప్రాణాలూ ఒక్కొక్కటిగా మమ్మల్ని విడిచిపెట్టేస్తాయి. మాప్రాణాలుపోయిన తరువాత నీవువచ్చి ఏమిలాభము? జీవరక్షకుడవైననిన్ను, మా జీవాలనుహరించినవాడవని అందరూ నిందించరా? స్త్రీలు పురుషులను ప్రేమించడం దోషమా? లక్ష్మీదేవి నిన్ను ప్రేమించలేదా? నీవులేని దుఃఖంలో మునిగియున్న గోకులాన్ని ఉద్ధరించుప్రభో!" అని మా మాటలుగా చెప్పు", అనిన గోపికలతో ఉద్ధవుడిలా అన్నాడు: "సుందరీమణులారా! శ్రీకృష్ణుడు ఎప్పటికీ మీవాడే. మథురలో అతనికి స్త్రీలెవ్వరితోనూ సాంగత్యంలేదు. అక్కడ అతడు చక్కబెట్టవలసిన రాచకార్యాలు అనేకమున్నవి. వీలైనంత త్వరలో ఇక్కడికి వస్తాడు." అనిచెప్పి, శ్రీకృష్ణగాథలనూ, మధురలో అతడు గావించిన గొప్పకార్యాలనూ వారికి వినిపిస్తూ అక్కడ కొద్దిరోజులుండి, ఉద్ధవుడు మధురకు మరలి వచ్చాడు.

గోకులంలోని విషయాలన్నీ శ్రీకృష్ణునకు వివరించి, నందాదులిచ్చిన కానుకలను బలరామకృష్ణులకు, వసుదేవ ఉగ్రసేనులకు సమర్పించాడు.

కుబ్జ :- త్రివక్రయైనకుబ్జ శ్రీకృష్ణుని అనుగ్రహంచేత సర్వాంగసుందరియై అప్సరసలాగ తయారయినది. కృష్ణుడు ఎప్పుడూ వస్తాడా అని గృహాన్ని శోభాయమానంగా అలంకరించి, నిరీక్షిస్తుండేది. ఒకనాడు కృష్ణుడు, ఉద్ధవునితోసహా ఆమె ఇంటికి వెళ్లాడు. ఆనందసంభ్రమాలతో, ఆమె ఉబ్బితబ్బిబ్బు అయిపోయినది. ఉచితాసనాలిచ్చి పూజించి సత్కరించినది. ఇంట్లో గుబాళిస్తున్న సుగంధాలు ఉన్మత్తం కలిగిస్తుండగా ఆమె కామపరవశ అయినది. చిరకాల కామవాంఛ విజృంభించినది. శ్రీకృష్ణుని పడక గదిలోనికి తీసుకొనివెళ్లి పాన్పుపై కూర్చుండబెట్టి హావభావాలు ప్రదర్శించగా, ఆంతర్యాన్ని గ్రహించిన స్వామి ఆమె మనోవాంఛను తీర్చాడు. హృదయపూర్వకంగా భక్తులు కోరిన కోరికలను అనుగ్రహించే స్వామినుండి కుబ్జ కామతృప్తినే కోరుకొని, సాయుజ్యానందాన్ని అనుభవించినది.

మథురా విజయము - అక్రూరుడు

మాట ఇచ్చిన ప్రకారం శ్రీకృష్ణుడు ఉద్ధవబలరాములను తోడ్కొని, అక్రూరుని ఇంటికి వెళ్లాడు. అక్రూరుడు ఎదురేగి ఆహ్వానించి కౌగలించుకొని, ఆసనాలిచ్చి సత్కరించాడు. శ్రీకృష్ణబలరాముల పాదాలను కడిగి, ఆజలాన్ని శిరస్సుపై జల్లుకొన్నాడు. శ్రీకృష్ణుని పాదాలను తన ఒడిలోపెట్టుకొని తుడిచాడు. ఇలా అన్నాడు: "పరమ పురుషులారా! మీరు కారణజన్ములు. మీశౌర్యబలంచేత కంసుడు, వాని అనుచరులూ నశించి, యాదవకులము ఉద్ధరింపబడినది. ఓ కృష్ణా! వాసుదేవా! నీవెవరివో నాకుతెలుసు. నీపాదస్పర్శచే మాగృహము పావనమైనది. నాజన్మ ధన్యమైనది. స్వామీ! నాకు గృహ విత్త దారా సుతులయందు మోహము కలుగకుండా అనుగ్రహించు" అని, వేడుకొన్న ఆక్రూరునితో స్వామి ఇలా అన్నాడు: "మహాశయా! నీవు సజ్జనుడవు. మాకు బంధుడవుకూడాను. మానవులు విగ్రహారాధనలు, తీర్థస్నానాలూ కోరికలు తీరడానికి చేస్తుంటారు. కాని నీవంటి ఉత్తమభక్తుల సేవా సాంగత్యాల వలన శీఘ్రంగా చిత్తశుద్ధిని పొంది ఆశయ సిద్ధిని పొందగలరు. మహాత్మా! నీవలన ఒక కార్యము జరగవలసియున్నది. అదిఏమిటంటే - మామేనత్త అయిన కుంతీదేవి తనభర్త అయిన పాండురాజు గతించిన తరువాత పుత్రులతో ధృతరాష్ట్రుని పోషణలో హస్తినాపురంలోనుంటున్నది. మితిమీరిన పుత్రవ్యామోహంతో ధృతరాష్ట్రుడు వారిపట్ల సమబుద్ధితో మెలగటంలేదు. అందుచేత నీవు హస్తినాపురం వెళ్లి, రెండు పక్షాలవారూ మనకు ఆప్తులేగనుక, ఉభయులూ సంతోషించేటట్టుగా ఏదైనా మార్గము చూడాలి." అని చెప్పి ఉద్ధవ బలరాములతో నిష్క్రమించాడు.

శ్రీకృష్ణుని కోరిక ప్రకారము అక్రూరుడు హస్తినాపురంవెళ్లి, కుంతీదేవిని, పాండవులను, భీష్మద్రోణ విదుర ధృతరాష్ట్రకృప అశ్వత్థామకర్ణ దుర్యోధనాదులను, ఇతర బంధువులను కలుసుకొన్నాడు. అందరూ అతనిని సగౌరవంగా ఆదరించారు. అక్కడ కొన్నివారాలుండి అందరి ప్రవర్తనలూ, పరిస్థితులూ అర్థంచేసుకొన్నాడు. ఒకనాడు విదురుడు అక్కడ ఉండగా, కుంతీదేవి ఆక్రూరునితో ఇలా అన్నది: "అన్నా అక్రూరా! మధురలో నాతలిదండ్రులూ, తమ్ముళ్లూ, అందరూ క్షేమంగానున్నారా? మందభాగ్యులమైన మాగురించి ఎప్పుడైనా తలుస్తున్నారా? నాతోచెప్పుమని ఏమైన చెప్పారా? మేమిక్కడ దుష్టులైన కౌరవుల మధ్య తోడేళ్ల గుంపులోనున్న జింకలలాగ భయంతో బ్రతుకుతున్నాము. పరమ దుర్మార్గుడైన దుర్యోధనుడు నాపుత్రులను చంపించడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. వానికి అదే వ్యాపకము. బలరామ కృష్ణులకు మాగురించి ఏమైనా తెలుసా? శ్రీకృష్ణుడు కంసాదులనుచంపి యాదవులను రక్షించిన దేవుడు. మా కష్టాలను ఎప్పుడు తీర్చుతాడోమరి! మాకు ఎప్పుడు న్యాయము జరుగుతుందో". అని కంటనీరుపెట్టుకొన్నది. శ్రీకృష్ణుని స్మరించి, మమ్మల్ని రక్షించు ప్రభూ! అని ప్రార్థించినది. ఆక్రూరుడు అక్కడినుండి సెలవుతీసుకొని, బంధుమిత్ర పరివారములతో సుఖంగా కాలంగడుపుతున్న ధృతరాష్ట్రుని వద్దకు వెళ్లాడు. ఇలా అన్నాడు "మహారాజా! నీతమ్ముడైన పాండురాజు గతించిన తరువాత నీవు ఈభూమిని ఏలుతున్నావు. ప్రజలను ధర్మబుద్ధితో, సమదృష్టితో పరిపాలించే రాజు యశస్సునూ, శ్రేయస్సునూ పొందుతాడు. అలాగ చెయ్యనినాడు దుర్గతి పాలవుతాడు. నీకు

తెలియని ధర్మాలు లేవుకదా! రాజా! నీతమ్ముని పుత్రులైన పాండవులు, తల్లితోసహా దిక్కులేనివారై బ్రతుకుతున్నారు. నీవు నీకుమారులయందూ, తమ్ముని కుమారులయందూ సమవర్తనుడవై, వారిని ఆదరించడం అందరికీ క్షేమకరంకదా! ఈలోకములో ఏ ఒక్కరి ఉనికీ శాశ్వతం కాదుకదా! పుత్రకళత్ర సంపదలపైన వ్యామోహము అంత శ్రేయస్కరం కాదు. బుద్ధిలేని తండ్రియొక్క ధనసంపదలను అతని పుత్రులే శత్రువులై హరిస్తారు. అందుచేత అధర్మార్జన వలన ఇహలోకంలో నిందింపబడడమే కాకుండా పరలోకంలో పాపఫలం అనుభవించాలి. ఈ శరీరము, పరివారము, ధనసంపద మొదలైనవన్నీ స్వప్నంలోని సుఖాలవంటివి. నీకు దృష్టిలోపం ఉన్నదిగాని బుద్ధిమాంద్యంలేదుకదా? నీబుద్ధి జ్ఞానాలను సద్వినియోగం చేసి, ఆ తండ్రిలేని పిల్లలకు చెందవలసిన భాగాన్ని వారికిచ్చివేసి, రాజుగా నీవు చెయ్యవలసిన ధర్మయుక్తమైన కర్తవ్యాన్ని నిర్వహించు." అనిచెప్పగా, ధృతరాష్ట్రుడు ఇలాబదులు చెప్పారు. "అక్రూరా! నీవు చెప్పినదంతా నిజమే కావచ్చు. నేను మంచి సలహాలను పాటించలేని అసహాయుడను. భగవదిచ్ఛ ఎలాగుంటే అలాగే జరుగుతుంది. ఎవరు తప్పించగలరు? భూభారాన్ని తగ్గించడానికి జన్మించిన శ్రీకృష్ణుడు తన దివ్యసంకల్పం ఎలాగుంటే అలాగే జరిపిస్తాడు: మనం చెయ్యగలిగినదేమీలేదు." అని చెప్పారు.

ధృతరాష్ట్రుని మనస్సును గ్రహించిన ఆక్రూరుడు మథురకు మరలివచ్చి, శ్రీకృష్ణబలరాములకు సర్వమూ నివేదించాడు.

మథురావిజయము - జరాసంధ కాలయవనులు

కంసుని భార్యలైన అస్తి, ప్రాప్తి అనేవారు జరాసంధుని పుత్రికలు. వారు తమకు కృష్ణుని వలననే వైధవ్యం సంభవించిందని మొరపెట్టుకొంటే జరాసంధుడు మండిపడి, రోషంతో ఇలాగ అన్నాడు."ఏమీ! ఈ గొల్లకుర్రడు కంసునే సంహరించాడా! నాప్రతాపం ఇప్పుడు చూస్తాడు. భూగర్భంలో దాక్కున్నా, సముద్ర మధ్యంలో దాక్కున్నా, ఆకాశంలోకి ఎగిరిపోయినా, హరిహరబ్రహ్మాదులెవరు అడ్డం వచ్చినా, ఈ యాదవవంశం యావత్తునూ నిర్మూలిస్తాను."అని ప్రతిజ్ఞచేశాడు. జరాసంధుడు మగధేశపురాజు. అతడు కంసునివలె రాక్షసాంశతో జన్మించినవాడు. మిక్కిలి బలశాలి, క్రూరుడు. అతడు యుద్ధసన్నద్ధుడై ఇరవైమూడు అక్షౌహిణుల సైన్యాన్ని సమీకరించి, మథురను ముట్టడించడానికి బయలుదేరాడు. నగరాన్ని చుట్టుముట్టాడు. శ్రీకృష్ణుడు ఇలాగ యోచించాడు. "ఈజరాసంధునిపట్ల సామ, దాన, భేద ఉపాయాలు పనిచెయ్యవు. దండోపాయమే సరియైనది. భూభారమును తగ్గించడమే ప్రస్తుత కర్తవ్యము. కనుక రాజును చంపకుండా సేనలను హతమార్చితే వాడు మళ్లీమళ్లీ సేనలను సేకరించి తెచ్చి, మా ఆయుధాలకు ఆహుతి చేస్తుంటాడు. చిట్టచివరకు వాని పనిపట్టవచ్చు." అని తలపోస్తుండగా దైవయోగమువలన దివినుండి రెండు దివ్యరథాలు దిగినవి. (ఇదే ఈశ్వరసంకల్పము). ఆ రథాలలో, సారథులుండిరి. నానాప్రకార ఆయుధాలు, వాటియందు కవచాలు, యుద్ధసామగ్రి ఉండెను. వాటినిచూచి బలరామునితో శ్రీకృష్ణుడిలా అన్నాడు. "అన్నా, బలరామా! చూచావా! నీయొక్క అవతార కార్యం ప్రారంభించడానికి, అన్నీసమకూడాయి. ఇకమనం సిద్ధపడాలి?" అని చెప్పి, అతిశూరులైన యాదవులను సమీకరించి, సేనలను ఏర్పాటుచేశాడు. దివ్యకవచాలను, దివ్యఆయుధాలను ధరించి, దివ్యరథారూఢులై బలరామకృష్ణులు బయలుదేరారు. శ్రీకృష్ణుడు పాంచజన్యశంఖాన్ని పూరించగా, మగధసైన్యంలోని సైనికులు, ఏనుగులు, గుర్రాలు, చెల్లాచెదురై వెనక్కి జరిగిపోయినవి. జరాసంధుడు రోషావేశపరుడై కృష్ణుని ఉద్దేశించి, ఇలా అరిచాడు. "ఓరీ, గొల్లకుర్రడా! అదిలించి రొప్పడానికి ఇవి ఆలమందలనుకొన్నావా? మత్తగజాలు. వీరంతా నీకబుర్లువింటూ కూర్చొనే గొల్లమూకలనుకొన్నావా! కాదు యమునికైనా భయపడని వీరాధివీరులు. ఇది బృందావనం కాదు రణరంగ వ్యూహము. గోపికలతో కుప్పిగంతులు వెయ్యడానికిది యమునా తీరముకాదు, కదనరంగము. అందుచేత నీకెందుకులేరా యుద్ధము? పోపోవెళ్లిపో! ఇదేమన్నా

ఆడుదాన్నీ, కొంగను, గాడిదను చంపడమా? పాములతో ఆడుకొనడమా? భీకరయుద్ధమురా ఇది. మగధాధీశుని శరజ్వాలలకు మాడిపోతావు. త్వరగా వెళ్లిపో." అని ఈ విధంగా వాగుతున్న జరాసంధునితో కృష్ణుడు ఇలా అన్నాడు. "ఓయీ మగధుడా! ఎందుకు వదరుతున్నావు? వీరులెప్పుడూ డాంబికాలు పలుకరు. చేసిచూపిస్తారు. నీవుప్రయోగించే ప్రళయాగ్నిలాంటి శరాలనుకూడ నేనుహరించి వేస్తాను. చివరకు విజయంనాదే అవుతుంది. నేను పశువుల కాపరినే కావచ్చు. గోపాలురకూ, భూపాలురకూ భేదమేమిటో ఇప్పుడే నీకు తెలుస్తుందిలే." అనేసరికి జరాసంధుడు క్రోధావిష్టుడై ఇలా అన్నాడు: "కృష్ణా! నీవు కుర్రవాడివి. రాజశేఖరుడైన మగధాధీశుడు గొల్లపిల్లలతో యుద్ధంచేశాడనిపించుకోవడం మాకు తలవంపులు. నువ్వు అవతలికిపో. మీఇద్దరిలో పెద్దవాడైన మీ అన్నబలరాముని యుద్ధంచేయుమను." అనిచెప్పిన జరాసంధునితో కృష్ణుడిలా అన్నాడు. "నిజమైన వీరులు తమశౌర్యాన్ని చూపుతారుగాని, నీలాగ ఆత్మస్తుతి చేసుకోరయ్యా మగధుడా." అనేసరికి పౌరుషం వచ్చేసి, యాదవసైన్యాన్ని ముట్టడింపుడని తనసేనలకు ఆజ్ఞాపించాడు. ప్రచండుడైన ఆ జరాసంధుడు. ఏనుగులఘీంకారాలు, గుర్రాల సకలింపులు, రథచక్రాల ధ్వనులు, ఆయుధాల మోతలు, రెండువైపులా చెలరేగాయి. ఘోరమైన యుద్ధము కొనసాగినది. యాదవసేన బాగాదెబ్బతిన్నది. పరిస్థితిని గమనించి, బలరామకృష్ణులు విజృంభించారు. శ్రీకృష్ణుడు పాంచజన్యశంఖాన్ని పూరించాడు. బాణాలవర్షాన్ని నిర్విరామంగా కురిపించాడు. శార్ఙ్గచాపం మెరుపు తీగవలె శత్రువులను ఛేదించినది. వలయాకారంగా ఎటుచూచినా శ్రీకృష్ణుని శరపరంపరలే. రథంతో రణభూమి అంతటా వీరవిహారం చేస్తున్నాడు. ఏనుగులు, గుర్రాలు, సైనికులు గుట్టలు గుట్టలుగా పీనుగులై పడియున్నవి. బలరాముడు తన రోకలివంటి ఆయుధాన్ని గిరగిరా త్రిప్పుతూ శత్రుభయంకరుడై విజృంభించాడు. తననాగలి ఆయుధంతో రణరంగాన్ని దున్నివేసినట్లు శత్రువులను పడగొట్టి నేలపాలుచేశాడు. శత్రుసేనలు బలభద్రుని చూడగానే పారిపోసాగినవి. ఈ విధంగా అన్నదమ్ములిద్దరూ యుద్ధభూమిని స్మశానభూమిగా మార్చివేశారు. బలరాముడు జరాసంధుని పట్టుకొన్నాడు. ఒక్కపిడికిలిపోటుతో వానిని హతమార్చే ప్రయత్నాన్ని చేసియు, శ్రీకృష్ణుడు వారించి, ముందుకార్యక్రమాన్ని గుర్తుచేయగా విడిచిపెట్టాడు. అప్పుడు శ్రీకృష్ణుడు జరాసంధునితో ఇలాఅన్నాడు: "ఓయీ మగధవీరుడా! నీవు భయపడకు. నిన్నిప్పుడు చంపివేయములే. నీవుపోయి సేనలను కూర్చుకొని, మళ్లీవచ్చి నీ కక్షతీర్చుకొనుము. అలాగచెయ్యలేకపోతే, నీదేహాన్ని విడిచిపెట్టు. అప్పుడు అందరూ మెచ్చుకొంటారు."అని పరిహాసోక్తులాడగా ఆ మగధరాజు అవమానంతోకుమిలిపోయి, కోపంతో కుతకుతలాడిపోయాడు. ఘోరతపస్సుచేసి అయినా వీళ్లను జయించాలి అని నిశ్చయించుకొని, రాజధానికి మరలిపోయాడు. మధురానగర ప్రజలందరూ బలరామకృష్ణుల ఘనవిజయానికి ఉత్సవాలు జరుపుకొన్నారు. జరాసంధుడు కృష్ణునిపై నానాటికీ ద్వేషాన్ని పెంచుకొంటూ, దుష్టరాజులందరినీ కూడగట్టుకొని, పదిహేడుసార్లు మథురపైదండెత్తి, సైన్యాలను పోగొట్టుకొని, పదిహేడుసార్లూ ఓడిపోయాడు. పద్దెనిమిదవసారియుద్ధ సన్నాహం ప్రారంభించాడు.

కాలయవనుడు అనబడేవాడు ఒకమ్లేచ్ఛప్రభువు. అతడు ఆనాటికి ప్రసిద్ధులైన కంస జరాసంధాదులందరికంటే మహాబలశాలి, ముష్కరుడు. ఒకనాడు నారదుడు అతనివద్దకువెళ్లి ఇలా కవ్వించాడు. "ఓ యవనశ్రేష్ఠుడా! నీవు ఈ రాజులందరి గర్వమణచిన వాడవట కదా! నీకుసాటి అయిన వారెవరా అనిచూస్తున్నావటకదా! మరి ఆమధురలోని యాదవులగురించి వినలేదా? వాళ్లలో ఒక యువకుడు మహాబలశాలి, పరాక్రమవంతుడు. ఏ ఆయుధాలు ధరించకుండా కంసుని చంపినవాడు. జరాసంధుని పదిహేడుసార్లు ఓడించినవాడు. అతనిని గురించి నీవు వినలేదా, లేక ధైర్యంచాలక ఊరుకొన్నావా?" అని అడిగేసరికి రోషంతో కాలయవనుడు ఇలా అన్నాడు: "ఏమేమీ నారదా! అలాంటి వీరుడొకడున్నాడా? అతడెక్కడుంటాడు? ఎలాంటివాడు? అతని మిత్రులెవరు? మా బాహుబలానికి తట్టుకొని ఎదుర్కొనగలడా?"అని అడుగగా నారదుడిలా చెప్పాడు: "యవనేశ్వరా! చెపుతానువిను. ఆయాదవశ్రేష్ఠుడు నీలమేఘశ్యాముడు, పూర్ణచంద్రబింబమువంటి మోముకలవాడు. పట్టుపీతాంబరము, కౌస్తుభమణి,

మకరకుండలాలను ధరించువాడు. ఇంతవాడంతవాడని చెప్పనలవికానివాడు, తాను ప్రకాశిస్తూ దిక్కులను ప్రకాశింపజేసేవాడు, అన్నిచోట్లా సంచరించగలవాడు, పట్టుకొనడం తెలిస్తేగాని పట్టుపడనివాడు..."అని ఇంకా చెపుతున్న నారదుని మాటలను వినిపించుకొనకుండా యవనుడిలా అంటాడు: "ఓయీ! నారదా! చాలుచాలు. ఇంతేనా! ఈయాదవుడేపాటివాడు? ప్రళయంకరుడైనా నాఎదుటపడితే, నాఅస్త్రాలకు ఆహుతిఅయి, భస్మము కావలసినదే! ఈయాదవుని నేను అంతము చేస్తానుచూడు."అని విర్రవీగుతూ నారదుని పంపించివేశాడు. మూడుకోట్లమ్లేచ్ఛ సైనికులతో మథురనుచుట్టుముట్టాడు.

శ్రీకృష్ణుడు బలరామునితో ఇలా అన్నాడు: "సోదరా! ఇప్పుడు యాదవులకు మహాఆపదరానున్నది. కాలయవనుడు చాలా పెద్దమ్లేచ్ఛసైన్యాన్నితెచ్చి మథురను చుట్టివేశాడు. నేడోరేపో జరాసంధుడుకూడ వచ్చిచేరుతాడు. మనము యవనునితో యుద్ధం చేస్తుంటే, జరాసంధుడు దొంగచాటుగా నగరంలో ప్రవేశించి, మనవాళ్లను చంపవచ్చు, లేదా, బందీలుగా కొనిపోవచ్చు. అందుచేత శత్రువులుచొరలేనట్టి సురక్షిత స్థలానికి మనవారందరినీ తరలించాలి. దీనికి నేనొక మార్గం ఆలోచించాను."అని చెప్పి, సాగరుని స్మరించి, సముద్రములో పన్నెండు యోజనాల విస్తీర్ణంగల స్థలాన్ని అడిగితీసుకొని, విశ్వకర్మను స్మరించి, అక్కడ ఒక మహానగరాన్ని, నిర్మింపుమన్నాడు. సర్వేశ్వరుని సంకల్పానికి అసంభవమైనదేమున్నది? విశ్వకర్మ తన నైపుణ్యాన్నంతా వినియోగించి, ఇంద్ర, వరుణ, కుబేరాది దేవతల నగరాలకుమించిన నగరాన్ని నిర్మించాడు. బంగారుగోపురాలతో భవనాలు, రాజబాటలు, ఉద్యానవనాలు, మొదలైన సకలవసతులతో విలసిల్లుతున్నది ఆ నగరము. ఇంద్రుడు సుధర్మ అనే సభాభవనాన్ని పారిజాతవృక్షాన్ని బహూకరించాడు. వరుణుడు తెల్లని గుర్రాలను, కుబేరుడు నిధులను, దిక్పాలకులు తమతమ ఐశ్వర్య విభూతులను అర్పించారు. వీటి ప్రభావముచేత అక్కడి ప్రజలకు ఆకలిదప్పులవలన శోకమోహాల వలన బాధలు ఉండవు. వారు తేజస్సుతోనుంటారు. ఆ నగరం పేరు ద్వారక. భగవంతుడు తన మాయాశక్తిచే మథురాపురవాసులందరినీ ద్వారకానగరికి రాత్రికిరాత్రి తరలించివేశాడు. అక్కడ వారి సంరక్షణ గురించి బలరాముని నియోగించాడు. ఈ మార్పు గురించి, కాలయవనునకుగాని, జరాసంధునకుగాని, మథురాపుర వాసులకుగాని ఏమీ తెలియదు. అంతా స్వప్నంలోలాగ జరిగిపోయినది.

కాలయవనుడు మథురాపురిపై దాడిచేసే విషయమునుగురించి పొద్దున్నే ఆలోచిస్తూ, తమ శిబిరాలనుదాటి, ఒక్కడే నిరాయుధుడై నడచుకొంటూ వెళ్తుంటే, అల్లంతదూరాన ఒక యువకుడు ఒంటరిగా, మెల్లమెల్లగా అడుగులు వేసుకొంటూ, మథురాపురి ద్వారము నుండి ఇటూఅటూ చూసికొంటూ వస్తుండడం కంటబడినది. యవనుడు ఆలోచించసాగాడు: "ఈ యువకుడెవడు? ఇలాగ ఒంటరిగా ఆయుధాలూ, వాహనము లేకుండా నగరం విడిచి ఎక్కడికి వెళ్తున్నాడు? గూఢచారియా? పలాయనుడా? రాయబారియా? యాచకుడా? తెలుసుకోవాలని యవనుడు వడివడిగా అడుగులువేశాడు. కొంచెందగ్గర పడగానే ఆ యువకుని ముఖంచూచి ఒక్క క్షణం నిశ్చేష్టుడై నిల్చుండిపోయాడు. ఏమీ? ఆ తేజస్సు, ఏమీ ఆ ఆకర్షణ? నీలమేఘచ్ఛాయ, సుందరవదనం, పీతాంబరం, మెడలో మణిహారము, అంతా నారదుడు చెప్పినట్లే కనిపిస్తున్నాడు. నిశ్చయంగా ఇతడే ఆ యాదవవీరుడై యుంటాడు." అనుకొన్నాడు. నాచేతికి చిక్కాడులే అనుకొని పట్టుకుందామని ముందుకు వెళ్లగా, అతడు తప్పించుకొని పరుగెత్తసాగాడు. యవనుడు వెంటబడ్తూ, పరుగెత్తలేక వెనకబడిపోతూ, ఇలాగకేకవేశాడు: "నిలునిలు, ఓయదువీరా! పారిపోకు. కంసచాణూరులను చంపినవీరుడవని తెలిసి, నీతో పోరాడుదామని నేనువస్తే, అయ్యో! నీవునా ప్రతాపం అయినా చూడకుండా, ఇలాగ పారిపోవడం బాగుందా? నీకు అపకీర్తికరంకాదా! అయినా, ఎక్కడికి పోగలవులే! నానుండి ఎలాగ తప్పించుకొనగలవు?" అంటూ బిగ్గరగా పరుగెడ్తూ వెంబడించాడు. కృష్ణుడు దొరికినట్టే దగ్గరపడి,

దొరక్కుండా పరుగెత్తేవాడు. నన్ను పట్టుకొనలేనివాడవు. నీవేంగెలువగలవు? అంటున్నట్లు నవ్వేవాడు. కొండలూ, అడవులూ, నదులూ అన్నీ దాటించి, చాలాదూరం తీసుకొనివచ్చేశాడు. యవనునికి విసుగెత్తి, వెనుకకు వెళ్లలేక, ముందుకిపోలేక ఏమిచెయ్యాలో తోచనిస్థితిలో ఉండగా కృష్ణుడు అదృశ్యమైనాడు. యవనుడు వెతకగా అక్కడొక చీకటిమయమైన పెద్దగుహ కనిపించినది. కృష్ణుడు ఆ గుహలోనే దాక్కొన్నాడనీ, ఇంకెక్కడికీ పోలేడనీ, తనకుచిక్కిపోతాడనీ, భావించి, యవనుడు అందులో ప్రవేశించాడు. కృష్ణుడు కనిపించలేదు. ఆ చీకటిలో తేరిపారిచూస్తే అక్కడొక వ్యక్తి ముసుగుతన్ని గురకపెడ్తూ నిద్రిస్తున్నట్టు కనిపించినది. అతడు కృష్ణుడే అనుకొని యవనుడిలా అన్నాడు: "ఏమిరా కుర్రకుంకా! నాతోయుద్ధం చేయడానికి భయపడి, పారిపోతూ, నన్నురాళ్లూ రప్పలపైనా ముళ్లమోదా పరుగెత్తించి తెచ్చి, ఇప్పుడీవేషంవేసి తప్పించుకోవాలనుకొంటున్నావా? లెమ్ములెమ్ము. నీవు ఎవ్వరికీ చిక్కవని నారదుడు చెప్పాడులే. ఇప్పుడు నాచేతచిక్కావు కదా! ఇక దీర్ఘనిద్దుర పోదువులే!" అంటూ వికారంగా నవ్వి, ఆనిద్రిస్తున్న వ్యక్తిని తన్నినాడు. అతడు మేల్కొని, నాలుగువైపులా చూచి, కాలయవనునిపై దృష్టి సారించగానే వాడు భస్మమైపోయాడు అనిచెప్పగా, ఆ నిద్రపోతున్న వ్యక్తిని గురించి, చెప్పుమని పరీక్షిత్తు కోరగా శ్రీశుకమహర్షి ఇలాచెప్పాడు:

ముచుకుందుడు:- ఇక్ష్వాకువంశములోని మాంధాతమహారాజాతనయుడు ముచుకుందుడు. అతడు సత్యధర్మపరుడు, మహానుభావుడు. తమ్ము రాక్షసులబారినుండి రక్షించవలసినదని ఇంద్రాదిదేవతలు అతనిని కోరగా అతడు భూలోకంవదలి, చాలాకాలము దేవతల రక్షణకార్యంలో నిమగ్నుడైయుండి, కుమారస్వామి దేవతలసేనాధిపతిగా రాగానే భూలోకానికి తిరిగివెళ్లడానికి దేవతల అనుజ్ఞనుపొందాడు. అతని నిస్స్వార్థసేవకు సంతసించిన దేవతలు అతనితో ఇలా అన్నారు: "ఓ రాజశ్రేష్ఠా! మానవ లోకములో శత్రువులే లేని నీవు నీయొక్క రాజ్యాన్ని, స్వజనులనూ వదలివచ్చి, చిరకాలంనుండి రేయింబవళ్లు మాయొక్క రక్షణ కార్యంలోనే నిమగ్నుడవైయుంటివి. అనివార్యమైన కాలప్రభావంచేత భూలోకంలో నీవారందరూ ఎప్పుడో మరణించారు. మోక్షాన్ని తప్ప నీవేదైనా వరంకోరుకొనుము ఇస్తాము. మోక్షాన్ని ఒక్క శ్రీహరియే ప్రసాదించగలడు." అనగా చాలాకాలంనుండి నిద్రయే తెలియని ఆ రాజుకు నిద్రముంచుకొనివస్తుండగా, బాగా అలసియుండటంచేత ఏమీ ఆలోచించలేక అతడు తనకు ఏవిధమైన అంతరాయమూలేని నిద్రను ప్రసాదించుమన్నాడు. వారు తథాస్తు అని, అతనికి ఈ గుహలో నిద్రపొమ్మని అతని నిద్రను భంగముచేసిన వ్యక్తి అతని దృష్టిపడగానే భస్మమైపోతాడు అని అన్నారు. ఆ విధంగా, ఈముచుకుందుడు, కృతయుగంలో నిద్రపోయి, త్రేతాయుగంగడిచి, ద్వాపరయుగాంతానికి కాలయవనుని వలన నిద్రాభంగమైలేచాడు. కాలయవనుడు భస్మముకాగానే శ్రీకృష్ణుడు ముచుకుందునకు దర్శనమిచ్చాడు. నిద్రనుంచి పూర్తిగామేల్కొన్న ముచుకుందుడు నీలమేఘశ్యామ శరీరమూ, పీతాంబరాలు, కౌస్తుభమణి, వైజయంతీమాల, చతుర్బాహువులు, శంఖచక్రగదాపద్మాలు, మకరకుండలాలు, ప్రసన్నవదనము, ముల్లోకాలనూ మోహింపజేసే మందహాసముతో భాసిల్లుతున్న దివ్యసుందరరూపాన్ని తిలకించాడు. సంభ్రమాశ్చర్యాలతో చలించిపోయాడు. చివరకు ఇలా అన్నాడు:

మ॥ శశివో? ఇంద్రుడవో? విభావసుడవో? చండప్రభారాశివో?
శశిచూడామణివో? పితామహుడవో? చక్రాంకహస్తుండవో?
దిశలున్? భూమియుర్వశమై? మిన్ను నిండెనిదె నీతేజంబుచూడంగదు
యెవ్వడవేలవచ్చి తిచటన్ వర్తించెదేకాకివై 1647

ఓ దేవా! నీవు చంద్రుడవో, ఇంద్రుడవో, అగ్నివో, సూర్యుడవో, చంద్రశేఖరుడవో, బ్రహ్మదేవుడవో, చక్రపాణివో తెలియటంలేదు. నీతేజస్సు చూడశక్యముకాకున్నది. దిక్కులు, భూమి, ఆకాశము, అంతా నీ దివ్యతేజస్సుతో

నిండిపోయినవి. నీవెవడవు? ఒంటరివాడవై ఇక్కడికి ఎందుకువచ్చావు? ఈ అడవి కఠిన శిలాకంటకమయము, క్రూరమృగాలకునిలయము నీపాదాలు చూస్తే పద్మదళాలలాగ కోమలంగా కనిపిస్తున్నవి. నీవు ఇక్కడికి ఎలాగ రాగలిగావు? అయ్యో! నీ పాదాలు కందిపోయినొప్పిపెడుతుంటాయి. నన్ను నీపాదశుశ్రూషచెయ్యనిస్తావా. నీవెవ్వరవో నాకు తెలియదు. ఇష్టమైతే చెప్పు. నేను ఇక్ష్వాకువంశములోని మాంధాతపుత్రుడను. నన్ను ముచుకుందుడంటారు. దేవతలసేవలో చాలాకాలము మేల్కొనియుండటంచేత అలసిపోయి, ఇక్కడ నిద్రలోమునిగి ఇంద్రియ వ్యాపారాలను మరచిపోయియున్నాను. నేను నిద్రిస్తుండగా ఎవ్వడో ఒక వ్యక్తి నన్ను అనేకమార్లు తన్ని నాకు నిద్రాభంగంచేశాడు. అతడు పాపాత్ముడైయుంటాడు. నేను చూస్తుండగనే భస్మమైనాడు. ఇప్పుడు నారాయణస్వరూపుడవైన నిన్నుచూచాను. నాకెంతో ఆనందం కలుగుతున్నది. నీ దివ్యతేజస్సును చూడలేకున్నాను. దయతో నిన్ను కన్నులపండువుగా చూడగలశక్తినిమ్ము" అనివేడుకొన్న ముచుకుందునితో గోవిందుడిలా అన్నాడు: "ఓ పుణ్యశీలుడా! నాజన్మలు, నామాలు, గుణాలు, కర్మలు, అసంఖ్యాకాలు. వాటిని గురించి నేనుకూడ వివరించలేను. భూభారం తగ్గించడానికి, ధర్మాన్ని స్థాపించడానికి, పూర్వము బ్రహ్మచేసిన ప్రార్థనను పురస్కరించుకొని నేను యాదవ వంశములో వసుదేవుని పుత్రునిగా అవతరించాను. నన్ను కృష్ణుడని, వాసుదేవుడనికూడ అంటారు. కంసనామంతో పుట్టినకాలనేమిని సంహరించాను. ఇతర లోకకంటకులను అంతముచేస్తాను. నీ దృష్టి తగిలి దగ్ధుడైనవాడు కాలయవనుడు. పూర్వము నీవు నన్ను బాగుగ ఆరాధించావు. కనుక నిన్ను అనుగ్రహించడానికి వచ్చాను. ఏవైనా వరాలు కోరుకొనుము. నా భక్తులకు శోకకారణ ముండరాదు" అని శ్రీహరి చెప్పగా ఆనందభరితుడైన ముచుకుందుడు పూర్వము గర్గమహర్షి చెప్పినట్లు ఇరవై ఎనిమిదవ మహాయుగంలో భూమిపై శ్రీమన్నారాయణుడు అవతరించినట్లు గ్రహించి, నందనందనునకు ఈ విధంగా స్తోత్రంచెయ్యనారంభించాడు.

"సర్వేశ్వరా! నీమాయచే మోహితులైన మనుజులు ఇల్లు, పరివారము సంపదా అనే ప్రలోభాల్లో చిక్కుకొని, బహుదుర్లభమైన మానవజన్మను దుర్వియోగపరచుకొంటున్నారు. శాశ్వతమైన నీ పదభక్తికి దూరమై క్షణిక సుఖాలను వెంబడిస్తూ, గడ్డిమేయాలనే ఆశతో గడ్డిమొలిచిన నూతిలో పడిపోయిన గోవువలె, సంసారకూపంలో కూరుకొనిపోతున్నారు. పరమేశ్వరా! నేనుకూడా రాజ్యభోగాలతోనూ - భార్యాబంధువర్గాలయందు వ్యామోహంతోనూ కాలం వ్యర్థపుచ్చానేగాని నిన్ను స్మరించవైతిని. కాని, నీయొక్క అపారమైన కరుణచేత నాకు దేవతల సేవచేసే భాగ్యము లభించడంచేత రాజ్యము, సంపదలు, భార్యలు, సర్వమూ, వాటంతట అవి తొలగిపోయినవి. ప్రభూ! నేనుమళ్లీ ఆ విషవలయంలో చిక్కుకొనకుండా కాపాడు. నిన్ను మరచిపోయిన విషయలాలసులను నీవు జననమరణసుడిగుండములలో పడవేస్తావు. సకలభోగాలతో పోషింపబడిన శరీరముకూడ చివరకు పురుగులపాలు, మట్టిపాలు కావలసినదేకదా? ఈశ్వరా! భోగాలను త్యజించి, మనస్సునిగ్రహించి తపస్సు చేసేయోగులు కూడ స్వర్గాన్ని, ఇంద్రపదవినీ, ఆపేక్షిస్తారేగాని, అమృతత్వాన్నికోరరు, ఎంతదౌర్భాగ్యము! ఈ స్వర్గమూ ఇంద్రపదవీ కూడా అశాశ్వతమేనని గుర్తించరుకదా! అచ్యుతా! నీ అనుగ్రహం కలిగినప్పుడే సంసారమందు అసంగముకలుగుతుంది. నిస్సంగముచే సజ్జనసాంగత్యము లభిస్తుంది. సత్సంగమువలన నీయందు భక్తిసిద్ధిస్తుంది. భక్తిద్వారానే ముక్తి లభిస్తుంది. కృష్ణా! నీకృపచేత నాకిప్పుడు లౌకిక బంధాలన్నీతొలగిపోయినవి. నీపాదసేవతప్ప నాకింకేమీవద్దు. ప్రభూ! శరణువేడుతున్నాను. పూర్వవాసనల ప్రభావంచేత ఆశామోహాలు వదలక ఇంద్రియములకు వశుడనైయున్న నాయందుకరుణజూపి నన్ను కాపాడుము". అనివేడుకొన్న ముచుకుందునితో, ముకుందుడు ఇలా అన్నాడు. "ఓమహనీయుడా! నీబుద్ధి ఉత్తమమైనది. పరోపకారంచేస్తూకూడ నీవు ఎలాంటి కోరికలకూలోనుగాలేదు. నీకునాయందు దృఢమైన భక్తిని అనుగ్రహిస్తున్నాను. నాయందు మనస్సునిలిపి, నీవు సకలకార్యాలనూ చేస్తున్నా, కర్మలచేబంధింపబడవు. నీవు రాజుగానున్నప్పుడు వేటలలో చేసిన జంతువధయొక్క పాపము ఇంకా మిగిలియున్నది.

దానిని తపస్సుచేసి తొలగించుకొంటే రాబోవుజన్మలో సద్బ్రాహ్మణుడవై పుట్టి సకల ప్రాణులయెడల కరుణ, మైత్రి ప్రేమలను పెంపొందించుకొని నన్ను పొందగలవు." అని స్వామి చెప్పగా ముచుకుందుడు స్వామికి ప్రణామాలు, ప్రదక్షిణలుచేసి వెళ్లిపోయాడు. గుహనుండి బైటకు వచ్చేసరికి చెట్లూ పశుపక్షులూ అతిచిన్నవిగాకనిపించాయి. ఇది యుగధర్మం అనుకొని, ఉత్తరదిశగా పయనించి, బదరికాశ్రమంచేరుకొని, నారాయణునికై తపస్సు ప్రారంభించాడు. శ్రీకృష్ణుడు మధురవచ్చి యవనసేనలను హతమార్చి, వారు విడిచిన ధనాన్ని సంగ్రహించాడు.

కాలయవనుడు మూడుకోట్ల సైన్యముతో వచ్చి మధురను ముట్టడించినట్లు తెలుసుకొని, ఇదే అదనుఅని జరాసంధుడు ఇరవైమూడు అక్షౌహిణుల సేనతో బయలుదేరాడు. తనను గత పదునేడుసార్లు ఓడించిన ఆ ఇద్దరు గొల్లపిల్లలపని ఈ సారితో ముగుస్తుందిలే అని ఉత్సాహంగా వస్తున్నాడు. కాని కాలయవనుడు భస్మమైపోయాడనిగాని, అతని సైన్యమంతా బలరామ కృష్ణులచేత హతమయినదని గాని జరాసంధునికి తెలియదు. యాదవుల ఆస్తులతోపాటు యుద్ధభూమిలో యవనులు విడిచిపెట్టిన ధనరాసులను, బండ్లలోపెట్టించి ద్వారకకు తరలించడానికి బలరామకృష్ణులు సిద్ధముగా నుండిరి. అంతలో జరాసంధుడు సేనలతోజోరుగా వస్తుండడంచూచి, బండ్లను పంపించివేసి, తామిద్దరూ ప్రాణభయంతో పారిపోతున్న వారివలె పరుగెత్తనారంభించారు. జరాసంధుడుచూచి విస్తుపోయాడు. తనంతటి వీరాధివీరునే పదునేడుసార్లు ఓడించిన ఈ అన్నదమ్ములు ఇప్పుడు రణభీరువుల్లాగ ఇలా పారిపోతున్నారెందుకో అని ఆశ్చర్యపోయాడు. కాలయవనుడేడి? వాని సేనావాహినులేవి? ఆ గుట్టలు గుట్టలుగా పడియున్నకళేబరాలెవరివి? ఏమీతెలియటంలేదు. ప్రస్తుతకర్తవ్యం ఈ కుర్రలిద్దరినీ పట్టుకొనడం అని భావించి, వారిని వెంబడించాడు. సేనలనుకూడ తనవెంటరమ్మన్నాడు. రామకృష్ణులు వడివడిగా అడవిమార్గాలలో అడ్డదారులలో పరుగెత్తసాగారు. కనిపిస్తున్నారుగాని పట్టుబడరు. జరాసంధుడు ఇలాకేకలు వేశాడు: "కుర్రలారా! మీరు యాదవుల్లో మహావీరులటకదా! ఇలాగ పారిపోతున్నారేమి? ఈ జరాసంధుని నుండి తప్పించుకొనగలరా? భూమిలో దాగినా, సాగరంలో చొచ్చినా, ఆకాశంలోనికెగిరినా మిమ్మల్ని పట్టుకొని హతమార్చుతాను. ఆగిపొండి, పరుగెత్తడం వృథా అవుతుంది." అని అట్టహాసంగా నవ్వాడు. వారుపోయిపోయి ఒక పెద్ద పర్వతశిఖరమెక్కారు. అక్కడ ఎల్లప్పుడూ వర్షాలు కురుస్తాయి. కనుక దానిని ప్రవర్షణగిరి అంటారు. అడవిదట్టంగానుంటుంది. జరాసంధుడు సేనలను పర్వతంచుట్టూ కాపలా ఉంచి కొందరిని కొండమీదవెదకడానికి పంపించి, తానుకూడ వెతికాడు. వాళ్లు ఎక్కడాకానరానందున పర్వతంచుట్టూ కట్టెలనుపేర్చి నిప్పంటించాడు. అరణ్యమంతా మంటలతోనిండి, కాలిపోయినది. "వీళ్లు ఎక్కడదాక్కొన్నా బూడిదఅయిపోయియుంటారు. ఈశుభవార్తనువిని నా పుత్రికలైన కంసపత్నులు సంతోషిస్తారు" అనుకొని సేనలను మరిలించుకొనివెళ్లిపోయాడు. రామకృష్ణులు నిప్పంటించడంలో నిమగ్నులైయున్న సైనికులను కనుమరుగుచేసి, కుప్పించి వెలుపలకుదుమికి, తప్పించుకొని పారిపోయారు. ద్వారకానగరమునకు చేరుకొన్నారు.

ద్వారకావిలాసము - రుక్మిణి

ఆనర్తదేశపురాజైన రైవతుడు బ్రహ్మదేవుని సలహా ప్రకారము తనకుమార్తె అయిన రేవతిని బలరామునకిచ్చి వివాహము చేశాడు.

విదర్భదేశపు రాజైన భీష్మకునకు ఐదుగురు పుత్రులు, ఒకపుత్రిక ఉండేవారు. పెద్దకుమారుని పేరు రుక్మి. కుమార్తె పేరు రుక్మిణి. చెల్లెలంటే అన్నలకు అత్యంతప్రేమ. రుక్మిణి తండ్రికీ, అన్నలకూ అతిప్రీతి పాత్రంగా పెరిగినది. చెలికత్తెలతో వయస్సునకు సరిపోయినట్లుగా ఆటలాడేది. రుక్మిణిని తండ్రి తనతోపాటు రాజ్యసభలలోను, పండితుల గోష్ఠులలోను, వేదాంతచర్చలలోను కూర్చుండబెట్టుకొనడంచేత ఆమెకు అన్ని విషయాలూ అవగతమయ్యేవి.

భీష్మకుని వద్దకు నారద మహర్షి తరచుగా వస్తుండేవాడు. శ్రీకృష్ణునియొక్క లీలాగుణ వైభవాలగురించి చెప్పడానికి నారదునకుగాని, వినడానికి భీష్మకునకుగాని విసుగూ విరామమూ ఉండేవికావు. నారదుని రాకకై రాజు ఎల్లప్పుడు ఎదురుచూస్తుండేవాడు. సర్వమూ పింటున్న రుక్మిణికి శ్రీకృష్ణునియందు మనస్సు లగ్నమయినది. రుక్మిణి యౌవనవతి అయి అసమానసౌందర్య లావణ్యతేజో రాశిగా వెలసినది. భీష్మకుడు ఆమెకు వివాహం చేయదలచుకొని, దేశదేశాల రాజకుమారుల గురించి తెలుసుకొని, చివరకు కృష్ణుడే ఆమెకు తగిన వరుడని నిశ్చయించుకొన్నాడు. రుక్మిణి కూడా కృష్ణునియందే ఆశలు పెంచుకొని అతడే తన భర్త కావాలని మనస్సులో నిశ్చయించుకొన్నది. శ్రీకృష్ణుడు కూడ నారదాదుల వలనవిని, రూప లావణ్య శుభలక్షణ సద్గుణ భూషణ అయిన రుక్మిణియే తన ధర్మపత్ని కాగలదని నిశ్చయించుకొన్నాడు.

ఒకనాడు భీష్మకుడు రుక్మిణివివాహవిషయాన్ని పెద్దకుమారుడైన రుక్మితో ప్రస్తావించి, కృష్ణుడే ఆమెకు తగిన వరుడు గనుక అతనికిచ్చి వివాహం చేద్దామన్నాడు. జరాసంధ, శిశుపాల, సాళ్వ, పౌండ్రకాది దుష్టులకు రుక్మి ప్రియమిత్రుడు. వారి ప్రభావము వలన బలరామకృష్ణులను తన శత్రువులనుగా భావించేవాడు. అందుచేత రుక్మిణిని కృష్ణుని కివ్వరాదనీ, తన మిత్రుడైన శిశుపాలునకే ఇవ్వాలనే పట్టుపట్టాడు. వృద్ధుడూ, సాత్త్వికుడూ, బలహీనుడూ అయిన భీష్మకుడు, మూర్ఖుడూ తామసికుడూ అయిన రుక్మియొక్కమొండి పట్టుదలకు తలఒగ్గి ఏమీచెయ్యలేక ఊరుకొన్నాడు. చెల్లెలి వివాహం శిశుపాలునితో చెయ్యడానికి నిశ్చయించి, రుక్మి వివాహప్రయత్నాలు ప్రారంభించాడు.

బుద్ధి తెలిసినప్పటినుండి రుక్మిణీకన్య కృష్ణుని తప్ప ఇంకెవ్వరినీ వివాహం చేసుకొనరాదనుకొన్నది. తన మనస్సును తెలుసుకొనకుండా తన అన్న ఈ విధంగా ప్రవర్తించడం అనుచితం అనుకొన్నది. "భగవంతుడైన కృష్ణునకు, తన ప్రేమ తెలియదా? తెలిస్తే ఇలాగా ఉపేక్షచేస్తాడా! ఏమో! అతని మనస్సు ఇంకెవ్వరిపైన ఉన్నదో! ఏమైనాసరే అతడు నన్ను స్వీకరించకపోతే దేహత్యాగమైనా చేస్తానుగాని, ఇంకొకరి చేతిని స్వీకరించను. నాయొక్క జీవన్మరణ సమస్యను తీర్చగలవాడు కృష్ణుడొక్కడే. రక్షించుమని శరణువేడిన వారిని భగవంతుడు ఆదుకొంటాడుకదా, మరి నన్ను కాపాడడా! ఇప్పుడేం చెయ్యాలి? సమయం మించిపోతున్నది. నా మనస్సును కృష్ణునికి తెలియజేయడం ఎలాగ? (అని తీవ్రంగాయోచించి, మెరుపులాంటి ఆలోచనరాగా) నా యొక్క సందేశాన్ని అతనికి పంపిస్తాను. అతడు తప్పకుండా నన్ను రక్షిస్తాడు." అని ఈ విధంగా యోచించి, తనకు చిన్నప్పటి నుండీ తెలిసియున్న అగ్నిద్యోతనుడనే సజ్జనుడైన బ్రాహ్మణుని రావించి, ఇలా చెప్పినది. "ఓ విప్రశ్రేష్ఠా! అహంకారగర్వాంధుడైన మా అన్న నన్ను శిశుపాలునకిచ్చి వివాహంచేయనున్నాడు. మాతండ్రి, అతని నెదిరించే శక్తిలేక నిస్సహాయుడై ఊరకున్నాడు. నీవువెంటనే ద్వారకవెళ్లి శ్రీకృష్ణునకు నాప్రేమను తెలియజేసి, అతనిని ఇక్కడికి పిలుచుకొనిరావాలి." అని మరికొన్ని మాటలు చెప్పి పంపినది. అగ్నిద్యోతనుడు వెంటనే బయలుదేరి, ద్వారకానగరమునకుచేరి, తనరాకనెరిగించి శ్రీకృష్ణభవనంలో ప్రవేశించాడు.

శ్రీకృష్ణుడు ఎదురుగావెళ్లి, ఆహ్వానించి, కాళ్లుకడిగి, భోజనంపెట్టించి కుశలమడిగాడు. ఇలా అన్నాడు: "విప్రోత్తమా! ఈ వయస్సులో నీవింత శ్రమతీసుకొని వచ్చావంటే ఏదో ముఖ్యమైన కార్యార్థమైయుంటుంది. నీవంటి సద్బ్రాహ్మణులు అందఱిహితము కోరేవారు. అల్పసంతుష్టులు. వారి సర్వవాంఛలూ సఫలమవుతాయి. తృప్తిలేనివాడు ఇంద్రునియంతటివాడైనా పతనమవుతాడు. నీకు నమస్కారము." అనగానే విప్రుడు, "శీఘ్రమే కల్యాణప్రాప్తిరస్తు" అని దీవించి, ఇలాచెప్పాడు:

"దేవా! నేను విదర్భదేశములోని కుండిన పురవాసిని, అగ్నిద్యోతనుడను. మారాజు భీష్మకుడు. ఆయనకొక పుత్రికారత్నమున్నది. ఆమె రుక్మిణి. ఆమె అతిలోకసుందరి, అసమాన సుగుణవతి. ఆమె నీయొక్క దివ్యలీలా

వైభవాలగురించి వినియున్నదై, నీపాదసేవచేయదలచి, నీకు ఇట్లు మనవి చేయుమన్నది. తనతండ్రియైన భీష్మకునకు ఇతరులకు ఆమెను నీకిచ్చి వివాహము జరిపించడం చాలా ఇష్టమే అయినను ఆమెయొక్క పెద్దన్న రుక్మి, అడ్డుతగిలి, ఆమెను శిశుపాలునకిచ్చి వివాహంచెయ్యడానికి అన్నిఏర్పాట్లు చేస్తున్నాడు. సమయంమించిపోతున్నదనే ఆర్తితో ఆరాకుమారి నన్ను ఈ సందేశాన్ని నీకు తెలుపుమని పంపించినది. ఆమె సందేశమిది:

సీ॥ ఏనీ గుణములు కర్ణేంద్రియంబులు సోక దేహతాపంబులు తీరిపోవు
ఏనీ శుభాకారమీక్షింప కన్నుల కఖిలార్థలాభంబు కలుగుచుండు
ఏనీచరణ సేవలే ప్రొద్దు చేసిన భువనోన్నతత్వంబు పొందగలుగు
ఏనీ లసన్నామమే ప్రొద్దు భక్తితో తడవిన బంధసంతతులువాయు
తే॥ అట్టినీయందు నా చిత్త మనవరతను నచ్చియున్నది నీయాన నానలేదు
కరుణజూడుము కంసారి! ఖలవిదారి! శ్రీయుతాకార! మానినీచిత్తచోర! 1701

ఓ కంసాంతకా! నీగుణగణాలు చెవులకు సోకగానే శరీరతాపాలన్నీ తీరిపోతాయి. మంగళకరమైన నీ శుభాకారాన్ని చూడగానే కన్నులకుపండుగగా ఉంటుంది. ఓ దుష్టసంహారీ! నీపాదసేవచేసినంతనే ఉత్తమలోకాలు లభిస్తాయి. లక్ష్మీకరమైన రూపముకలవాడా! నీ దివ్యనామాన్ని భక్తితో స్మరిస్తేచాలు, బంధాలన్నీవీడిపోతాయి. అటువంటి నీయందే నా చిత్తమెల్లప్పుడూ నిలిచియున్నది. ఇది నీసాక్షిగా నిజమునుమా! ఓ మానినీ మానసచోరా! నాపైకరుణజూపవా? ధన్యుడవూ, లోకమనోభిరాముడవూ, వంశ, విద్యా, రూప, యౌవన, సౌజన్య, సంపద, బల, దాన, శౌర్య, కరుణాసంశోభితుడవూ అయిన నిన్ను ఏ కన్యలు మాత్రము వరించకుండా ఉండగలరా? ఆనాడు ఆ లక్ష్మీదేవియే నిన్ను వరించలేదా? నేనొక్కతెనే నిన్ను ప్రేమించానా ఏమిటి? నీకుచెందవలసియున్న నన్ను నీచుడైన ఆచేదిరాజు శిశుపాలుడు హరించుకొనిపోడానికి సిద్ధముగానున్నాడు కదా! ప్రాణేశా!

మ॥ వ్రతముల్ దేవ గురు ద్విజన్మబుధసేవల్ దానధర్మాదులున్
గతజన్మంబుల నీశ్వరున్ హరి జగత్కల్యాణు(గాంక్షించి చే
పితినేనిన్ వసుదేవనందనుడు నా చిత్తేశుడౌగాక ని
ర్జితులై పోదురుగాక సంగరములో చేదీశముఖ్యాధముల్ 1706

ఓ పద్మనాభా! రేపే చతురంగబలాలతో వచ్చి శిశుపాల జరాసంధులను ఓడించి, రాక్షసవివాహ పద్ధతిని నన్ను తీసుకొనిపోవాలి. అంతఃపురంలో నున్న నన్ను కొనిపోవడం ఎలాగ అని అనుకొంటావేమో! ఏరభసాలేకుండా తీసుకొనివెళ్లే మార్గమొకటి ఉన్నది. మంగళగౌరిని కొలవడానికి పెండ్లికుమార్తెను, ఊరువెలుపలనున్న దుర్గామందిరానికి పంపించే ఆనవాయితీ ఉన్నది. నేను అక్కడికి రాగానే నిరాటంకంగా నీవు నన్ను కొనిపోవచ్చును. నీఅనుగ్రహానికి నేను అర్హురాలిని కాకపోతే, బ్రహ్మచర్యనిష్ఠవహించి, నూరుజన్మలకైనా నీవేనాపతివి కావాలని నిన్నే ధ్యానిస్తూ ఆత్మార్పణం చేసుకొంటాను.

సీ॥ ప్రాణేశ! నీమంజుభాషలు వినలేని, కర్ణరంధ్రంబుల కలిమియేల?
పురుషరత్నమ! నీవు భోగింపగాలేని, తనులతవలని సౌందర్యమేల?
భువనమోహన! నిన్నుపొడగానగాలేని, చక్షురింద్రియముల సత్త్వమేల?
దయిత! నీయధరామృతంబానగాలేని, జిహ్వాకు ఫలరస సిద్ధియేల?
ఆ॥ నీరజాతనయన! నీనవమాలికాగంధమబ్బలేని ఘ్రాణమేల?
ధన్యచరిత! నీకు దాస్యంబు చేయని జన్మమేల? యెన్నిజన్మములకు 1708

ప్రాణేశా! నీయొక్క మృదుమధుర భాషలు విననోచుకొనని కర్ణములుండీ ఎందుకు? నీవు అనుభవింపలేని సుకుమార శరీరముయొక్క సౌందర్యమెందుకు? భువనమోహనా! నిన్ను సందర్శించలేని కన్నులుండీ ఏమిప్రయోజనం? దేవా! నీ అధర సుధారసాన్ని ఆస్వాదించలేని నాలుక ఉండీ ఏమిలాభము? కమలాక్షా! నీవు ధరించే వనమాలయొక్క సువాసనను ఆఘ్రాణించలేని ముక్కు ఎందుకు? ధన్యచరితా! నీకు సేవలుచేయలేనప్పుడు ఎన్ని జన్మలెత్తినా వృథాయేకదా!" స్వామీ! ఇదే మా విదర్భరాజపుత్రికయైన రుక్మిణీకన్యయొక్క ఆంతరంగిక సందేశము. నీకు విన్నవించాను. ఆమె పుట్టినప్పటినుండీ ఎరిగియున్న బ్రాహ్మణుని గనుక నామాటగాకూడ మనవి చేస్తున్నాను. మాచిన్నారి రుక్మిణివంటి రూపవతి, సకల సద్గుణరాశియైన కన్య ఈ భూమండలంలో నెక్కడాలేదు. మహావిష్ణువునకు లక్ష్మీదేవిలాగ ఆమెనీకు అన్నివిధాలా సరిపోయిన సహధర్మచారిణి అవుతుంది. మీఇద్దరూ, పతీపత్నులుకావడానికే పుట్టారనడానికెలాంటి సందేహమూలేదు. నీవు వెంటనేవెళ్లి ఆమెను ఆదుష్టులనుండి రక్షించి, ఇక్కడికి తోడ్కొని రావలసిందని మనవి చేసుకొంటున్నాను." అన్నాడు.

(రుక్మిణీకన్య లక్ష్మీదేవి అంశంతో జన్మించినది. ఆమె ఏనాటికైనా నారాయణునే చేరవలసియున్నది. ఆమెకావిషయం తెలియకపోయినా, శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణుని అవతారపురుషుడని వినియున్నది. కనుక సహజంగా ఆకర్షింపబడి, అతనికి మానసికంగా అంకితమైపోయినది. ఇదిలౌకికంగా అనుకొనే సన్నివేశము. కాని ఈ సందేశాన్ని ఆధ్యాత్మిక దృష్టితో పరిశీలిస్తే ఇది పరమాత్మతో సాయుజ్యంకావడానికి తపనబడే జీవాత్మ సందేశము. భగవంతుని అనుగ్రహాన్ని అర్థించే భక్తుని ఆంతరంగిక ఆవేదనాసందేశమనికూడ అనవచ్చును ఇది సాగరంలో లీనముకావడానికి నది ప్రదర్శించే తహతహలాంటిది. మధ్యమధ్యను రుక్మిలాంటి అవరోధాలెదురైనా, వాటిని త్రోసివేసి నదివలె గమ్యాన్ని చేరాలి. రుక్మం అంటే బంగారము. అది లౌకిక సంపదలకు ప్రతీకము. రుక్మి వ్యక్తిగా మూర్తీభవించిన అహంకారము. అహంకారమమకారాలే రుక్మిరూపంలో పరమేశ్వర సాయుజ్యానికి అవరోధము. శిశుపాలుడు చేదిరాజకుమారుడు. చంచల మనస్సునకు ప్రతీకము, ఈ చైద్యుడు జీవుని మనోబుద్ధులతో తాదాత్మ్యపరచి, భ్రమలోముంచి పరమాత్మ సాయుజ్యం కాకుండా అడ్డుపడేది అహంకారము. అలాగే ఈ రుక్మి, రుక్మిణిని కృష్ణుని చెంతకు చేరనివ్వకుండా చైద్యునిపరంచేయడానికై అడ్డుకొంటున్నాడు. పరమాత్మ సర్వజ్ఞుడు. ఏనాటికైనా జీవి తన్నుచేరవలసినదే అని అతనికి తెలుసు. ఆ పరమాత్మయే జీవునికి తోడ్పడాలి, అడ్డంకులను తొలగించాలి. ఇదే భగవదనుగ్రహము. ఉత్తమభక్తుడు తన ఆరాధ్యదైవాన్నినినా మరిదేనినీ కోరడు. శ్రీకృష్ణుడే పరమపురుషుడని రుక్మిణి అతనినే ఆరాధిస్తున్నది. అన్యులకు ఆమె మనస్సులోస్థానం లేదు. రుక్మిణీ సందేశమంతా భక్తుడు భగవంతుని అనేకవిధాల స్తుతించడం ద్వారా, తనప్రేమను (భక్తిని) తెలిపి, ఆత్మార్పణంచేసుకొని, భగవంతుని ప్రసన్నునిగా చేసుకొని, భగవదనుగ్రహాన్ని ఆర్థించడమే. అనేకమంది భక్తులు భగవంతుని పురుషునిగాను, తాము స్త్రీ, (ప్రకృతిమాత)గాను భావించుకొని సేవించడాన్ని మధురభక్తి అంటారు. ఆ మధుర భక్తియొక్క ప్రకాశమే ఈ రుక్మిణీ సందేశము.

యజ్ఞయాగాదులలో కర్తసమర్పించే నైవేద్యాలనూ (ఆహుతులనూ), అభ్యర్థనలనూ అగ్నిదేవుడు యజ్ఞదేవతల వద్దకుకొనిపోయి సమర్పిస్తాడు. అలాగే దేవాదిదేవునకు తన అభ్యర్థనను సమర్పించడానికి రుక్మిణి అగ్నిద్యోతనుని ఎన్నుకొన్నట్టున్నది.)

బ్రాహ్మణుడు తెచ్చిన సందేశానికి శ్రీకృష్ణుడు సంతసించి, రుక్మిణియొక్క అభ్యర్థనను స్వీకరించాడు. సర్వసన్నాహాలతో నాలుగు గుర్రాల రథాన్ని దారుకుడు తోలుతుంటే, అగ్నిద్యోతనునితోసహా స్వామి కుండిన పురానికి బయలుదేరాడు. శ్రీకృష్ణునకు అండగా నుండాలని, బలరాముడు పెద్దసైన్యముతో, వెంటవెళ్లాడు. తెల్లవారేసరికి వారు విదర్భ రాజధానిని చేరుకొన్నారు.

శిశుపాలునితో వివాహంచెయ్యడానికి అన్ని ఏర్పాట్లూ జరుగుతున్నవి. నగరమంతా పతాకాలు, తోరణాలు, పువ్వులు, ముగ్గులు, పన్నీరుజల్లులతో అలంకరించారు. భీష్మకుడు యథావిధిగా పితృ, దేవతార్చనలు, వేదపఠనాలూ, మంగళాచరణాలు, బ్రాహ్మణ ఆశీర్వాదాలూ, హోమాలు, దానాలు అన్నీ జరిపిస్తున్నాడు. రుక్మిణీకన్యను సర్వాలంకార శోభితగా నలంకరించారు. ఆ మరునాడే పెండ్లిముహూర్తం.

శిశుపాలుడు అనేక రథాలు, గుర్రాలు, ఏనుగులు మొదలగు వాటితో, భటులతో బంధువర్గాలతో మహాటోపముగా తరలివచ్చాడు. రుక్మియొక్క ఆప్తమిత్రులైన జరాసంధ, సాళ్వ, దంతవక్త్ర, విదూరక, పౌండ్రకులు చతురంగ బలాలతో వచ్చారు.

ముహూర్తం దగ్గరపడుతున్నకొద్దీ రుక్మిణి మనస్సు ఆందోళన చెందుతున్నది. బ్రాహ్మణుడు ఇంకాతిరిగి రాకపోవడానికి కారణమేమో! ఆ ఇందీవరశ్యామునకు నా సందేశము అందినదా? ఈ భూసురుడు సకాలములో ద్వారక చేరుకొనగలిగాడా? నా కోరిక ఫలిస్తుందా? దైవనిర్ణయం ఎలాగున్నదో!

మ॥ ఘనుడా భూసురుడేగెనో? నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో?
విని కృష్ణుండిది తప్పుగాఁదలచెనో? విచ్చేసెనో? ఈశ్వరుం
డను కూలింప దలంచునో తలపడో? ఆర్యామహాదేవియున్
ననుఁ రక్షింపనెరుంగునో యెరుగదో నా భాగ్యమెట్లున్నదో? 1726

"ఆ భూసురోత్తముడు ద్వారక చేరుకొన్నాడో? లేక దారిలో ప్రయాణబడలికచేత ఎక్కడైనా చిక్కుకొన్నాడో? అతడు క్షేమంగా చేరుకొని, కృష్ణునకు నా సందేశాన్ని వినిపించియుంటాడు. దానిని విని నేను అలాగ సందేశంపంపించడం సంప్రదాయంకాదని తప్పుగా తలచాడో లేక కరుణామయుడు గనుక నా సంకటస్థితిని సరిగా అర్థంచేసుకొని, నన్ను రక్షించడానికి, బయలుదేరి వచ్చాడేమో! పరమేశ్వరుడు నా సంకల్పానికి అనుకూలిస్తాడోలేదో! గౌరీమహాదేవి నన్నుకాపాడదలచుకొంటున్నదో లేదో! ఇంతకూ నా అదృష్టం ఎలాగున్నదో, ఏమో?" అనుకొంటూ అనేకభయసందేహాల మధ్య చిక్కుకొని, ఆ కన్య తల్లికైనా చెప్పుకోదు, కన్నీరుతుడుచుకోదు, జుట్టు సవరించుకోదు, చిరునవ్వునవ్వదు, సఖులతో ముచ్చటించదు. అన్నము తినదు. చూపులను కృష్ణుడు రాబోవు మార్గముపైనిలిపి కూర్చునేది. అంతట శుభసూచికంగా తన ఎడమకన్ను, ఎడమభుజము అదిరాయి. అగ్నిద్యోతనుడు కనిపించాడు. ఆమె ప్రాణంలేచి వచ్చినది. బ్రాహ్మణుడు లోనికి వచ్చాడు. ఆమె దిగ్గున లేచి, ఎదురేగి, చిరునవ్వుతో ప్రశ్నార్థకంగా అతనివైపు చూచినది. అతని ముఖంలో ఆనందరేఖల్ని గమనించినది. అతడు చిరునవ్వుతో ఇలా చెప్పాడు: "రాకుమారీ!

ఉ॥ మెచ్చెభవద్గుణోన్నతికమేయధనావళులిచ్చె నాకు తా
వచ్చె సుదర్శనాయుధుడు వాడె సురాసురులెల్లనడ్డమై
వచ్చిననైన రాక్షసవివాహమునంగొనిపోవు నిన్ను నీ
సచ్చరితంబు భాగ్యమును సర్వమును నేడు ఫలించెకన్యకా! 1735

సుదర్శనాయుధుడు నీయొక్క ఉత్తమ గుణాలకు మెచ్చుకొన్నాడు. నేను తీసుకొనివెళ్లిన నీయొక్క సందేశానికి సంతోషించినవాడై, నాకు అనేక ధనరాసులనిచ్చాడు. అతడు వచ్చేశాడు. ఇక నీకు భయంలేదు. దేవదానవులేకమై వచ్చి అడ్డగించినా, అతడు నిన్ను రాక్షసవివాహ పద్ధతిలో తీసుకొనివెళ్లిపోతాడు. నీసచ్చరిత్రము, అదృష్టము అన్నీనేడు ఫలించాయి కదమ్మా!" అనినవిని, రుక్మిణి, మిక్కిలి సంతసించి ఇలా అన్నది!

మ॥ జలజాతేక్షణుఁదోడితెచ్చితివి నా సందేశముంజెప్పి నన్
నిలువంబెట్టితి నీకృపన్ బ్రతికితిన్ నీయట్టి పుణ్యాత్మకుల్
కలరే! దీనికి నీకుఁ బ్రత్యుపకృతిన్ కావింపగా నేర నం
జలి గావించెద భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ! 1735

"ఓ భూసురరత్నమా! నా సందేశాన్నెరిగించి, నళినదళేక్షుని తోడ్కొని వచ్చి నా ప్రాణాలను నిలబెట్టావు. నీయొక్క కృపచే నేను బ్రతికిపోయాను. నీవంటి పుణ్యాత్ములింకెవ్వరైనా ఉన్నారా? దీనికి నేను నీకు ఎలాంటి ప్రత్యుపకారము చెయ్యగలను? ఏమీచెయ్యలేని నిస్సహాయను. ఓసద్బంధుచింతామణీ! నీకు దోసిలొగ్గి నమస్కరిస్తాను." అని చెప్పి, నమస్కరించినది. అతడు నిష్క్రమించాడు.

తనకుమార్తె వివాహానికి బలరామకృష్ణులు అతిథులుగా వచ్చారనే సంతోషంతో భీష్మకుడు వారిని తగురీతిని సత్కరించి కానుకలిచ్చి వసతులేర్పరచినాడు. ఇతర అతిథులనూ రాజులను వారివారి స్థాయులకు అనుగుణంగా సత్కరించి గౌరవించాడు. శ్రీకృష్ణుడు వచ్చినట్లు తెలుసుకొన్న విదర్భవాసులు తండోపతండాలుగా వచ్చి, అతనిని దర్శించి, ఆ సుందర వదనారవిందశోభకు సమ్మోహితులై, తనివితీరని దృక్కులతో తిలకిస్తూ, తమలోతాము ఇలాగ ముచ్చటించుకొనసాగారు: "ఈ నవమన్మథుడే మన రుక్మిణీ రాకుమారికి తగినవరుడు. ఇతనికొరకే బ్రహ్మ ఆమెను సృష్టించాడేమో! అయినా ఈ రుక్మి ఎందుకు మధ్యలో అడ్డుతగిలి, ఇలాగ తారుమారు చేస్తున్నాడు? ఈ దుష్టుల పన్నాగాన్ని పడగొట్టి, కృష్ణుడే రుక్మిణిని పెండ్లాడితే ఎంత బాగుండును?" అని అనుకొన్నారు.

పెండ్లిరోజు ఉదయం రుక్మిణీ రాకుమారి, గౌరీపూజ చెయ్యడానికి దేవీమందిరానికి కాలినడకను బయలుదేరినది. ఆమె తనచుట్టూ ఆమె తల్లులు, చెలికత్తెలు, పుణ్యస్త్రీలు, బ్రాహ్మణముత్తైదువలూ, దాసదాసీజనులు, రక్షకభటులూ ఉండగా గజగమనంతో వెళ్లినది. వేదపండితులు మంత్రాలు చదివారు. పురోహితులు, ముత్తైదువలూ గౌరీపూజ చేయించారు. పార్వతీదేవిని స్తుతించారు. ఆమె పూజా విధిలో పరమశివునీ గౌరీమాతనూ భక్తితో పూజించినది. తన మనస్సులోనున్న కోర్కెను ఈ విధంగా మననం చేసుకొన్నది.

ఉ॥ నమ్మితి నామనంబున సనాతనులైన ఉమామహేశులన్
మిమ్ము పురాణదంపతుల మేలు భజింతుగదమ్మ మేటి పె
ద్దమ్మ, దయాంబురాశివి గదమ్మ, హరింబతిసేయుమమ్మ నిన్
నమ్మిన వారి కెన్నడును నాశములేదు గదమ్మ యీశ్వరీ! 1743

అని మొక్కుకొని, బ్రాహ్మణ దంపతులకు తాంబూలములు కానుకలిచ్చి వారి ఆశీస్సులను పొంది, గుడినుండి నెమ్మదిగ బైటకు వచ్చినది. అతిలోకసౌందర్యవతిగా ప్రసిద్ధిగాంచిన ఆ రాకుమారిని ఒక్కసారి అయినా కన్నుల పండువుగా చూడాలనే ఆశతో పెండ్లికి అతిథులుగా వచ్చిన రాజకుమారులందరూ ఆమె నడిచివెళ్లే మార్గాన చేరినారు. శ్రీకృష్ణుడు ఆ దారిలోనే ఎక్కడో ఉంటాడని ఆమెకు తెలుసు. నెమ్మదిగా రాజహంసలాగ నడుస్తూ, క్రీగంటి చూపులతో రెండువైపులా పరికించిచూస్తూ అడుగులు వేస్తున్నది. ఆమె అందాన్నీ, కదిలకలనూ సోయగాన్నీ తిలకిస్తున్న రాజకుమారులకు మతులు చలించాయి. గతులు తప్పాయి. చేతులలోని ఆయుధాలు జారిపడ్డాయి. ఈమెను పొందలేని జన్మనిరర్థకమనుకొన్నారు. శిశుపాలుడు ఎంతటి భాగ్యశాలి! అని ఈర్ష్యజెందారు. రుక్మిణి ముందుకు సాగిపోతున్నది. గాలికి చెదురుతున్న ముంగురులను సవరించుకొంటున్నట్లు నటిస్తూ అంతా కలయజూస్తున్నది. అల్లడుగో కనిపించాడు నీలమేఘశ్యాముడు. అచ్చంగా నారదుడు, అగ్నిద్యోతనుడు వర్ణించినట్లే ఉన్నాడు.

పీతాంబరధారియైన ఆ దివ్యమోహనాకారుడు రథముపై నిల్చున్నాడు. ఆమెవైపే చూస్తూ చిరునవ్వు చిందిస్తున్నాడు. చేతులుచాచి ఆహ్వానిస్తున్నాడు. సందేహంలేదు అతడే నాహృదయాధినాథుడైన శ్రీకృష్ణుడు. ఆమె హృదయస్పందన ఒక్కసారి ఆగిపోయినట్లయినది. మేను పులకించినది. సంతోషంకట్టలు తెంచుకొన్నది. మందగమనం వీడి, అడుగులు వడివడిగా వేసుకొంటూ రథాన్ని సమీపించినది. శ్రీకృష్ణుడు రథమునుంచి వంగి కుడిచేతిని చాచి, ఆమె కుడిచేతిని అందుకొని, మీదికిలాగి ఆమెను రథంలో కూర్చుండబెట్టుకొన్నాడు. ఏమి జరుగుతుందో, చూపరులు గ్రహించేలోగా మెరుపులాగ రథం దౌడు తీసినది. బలరాముడు సైన్యాన్ని తీసుకొని వెంటవెళ్లాడు. దిగ్భ్రమచెందిన రాజులు తేరుకొని, విషయాన్ని గ్రహించి, శౌర్యము తెచ్చుకొని అవమానంతో ఊడికిపోయారు. "క్షత్రియునకు చెందవలసిన రాజకుమారిని, ఒక గొల్లవాడు ఎత్తుకొనిపోతుంటే చూస్తూ చేతకానివారివలె ఇలాగ ఉండిపోవడం క్షత్రియులకు సిగ్గుచేటు" అనుకొంటూ అందరూ వెంబడించారు. వారిని బలరాముడు యాదవసైన్యంతో అడ్డుకొన్నాడు. శత్రువులు శరపరంపరలతో యాదవ సేనలను కప్పివేయడం చూచిన రుక్మిణి ఆందోళనచెందగా, శ్రీకృష్ణుడు ఆమెకు ధైర్యమిచ్చి ఇలా చెప్పాడు: "ఓ ఇందువదనా! చూస్తూ ఉండు, మనవీరులు శత్రువులను ఎలాగ చెండాడుతారో?" అన్నాడు. బలరాముడు శత్రుభయంకరుడై శత్రువుల చతురంగ బలాలను నేలపాలుచేశాడు. జరాసంధుడూ మొదలైన రాజులు ప్రాణభయంతో వెనుదిరిగి కుండినపురికి చేరుకొన్నారు. తనకు భార్యకావలసిన రుక్మిణిని కృష్ణుడు ఎత్తుకొనిపోయినందుకు అవమానంతోను, తీవ్రమైన సంతాపంతోనూ రోదిస్తున్న శిశుపాలునివద్దకుపోయి వారు ఊరడింపసాగారు: జరాసంధుడిలా అన్నాడు: "మిత్రమా! శాంతించు. కొంచెము ఓర్చుకో. విచారించకు. ఒకందుకు సంతోషించాలి మనం ఆ యాదవులచేత చిక్కి చావలేదుకదా, బ్రతికిఉంటే భార్యయే దొరక్కపోతుందా! ఇంతకన్న మంచిదే దొరుకుతుంది. ఒక్కటిమాత్రం నిజం. మనచేతిలో ఏమీలేదు. అంతా మనల్ని కీలుబొమ్మల్లాగ ఆడించే ఆ ఈశ్వరునిమాయ. నా విషయమేచూడు, నేను మధురపై పదునేడుసార్లు దండెత్తి విఫలుడనైనా పట్టువిడువకుండా పద్దెనిమిదవసారి దండెత్తితే యాదవులు పిరికి పందలై మధురనే విడిచి పారిపోలేదా? దేనికైనా కాలం కలిసిరావాలికదా! ఇప్పుడు మన అందరిసైన్యములూ ఎంతో పెద్దవే అయినా కొద్దిమంది మాత్రమే ఉన్న యాదవులు చిత్తుచెయ్యలేదా? కాలం అనుకూలించినప్పుడు మనం కష్ట తీర్చుకొందాం. చింతించకు." అని హితవుపలికాడు. అందరూ తమతమదేశాలకు మరలిపోయారు.

తీవ్రమైన అవమానంతో, రోషావిష్టుడైన రుక్మి ఒక అక్షౌహిణీ సైన్యాన్ని తీసుకొనివెళ్లి, శ్రీకృష్ణుని వెంబడించాడు. "కృష్ణుని చంపి, చెలెల్లిని తిరిగి తీసుకొని రాలేకపోతే నేను ఈ నగరంలో కాలుపెట్టను" అని ప్రతిజ్ఞచేసి వెళ్లాడు. సారథిని తొందరబెట్టి, కృష్ణుని రథాన్ని కలుసుకొనుమని చెప్పాడు. కృష్ణుడు అది గ్రహించి, తన రథాన్ని నెమ్మదిగ నడవనిచ్చాడు. "ఈగొల్లవానికి నా బాహుబలం సంగతి తెలియదు. నా చెల్లెలినే ఎత్తుకొపోవడానికి వీడికెంతసాహసం!" అనుకొంటూ ఇలాకేకలువేశాడు: "నిలునిలు, యాదవా! దొంగా! మాచెల్లెల్ని తీసుకొనివెళ్లడానికి నీవేపాటివాడవు? నీ వంశమేమిటి? నీప్రవర్తన ఏమిటి? అంతా మాయతోనే ఆడిస్తావు. నీనిజతత్త్వం ఎవ్వరికీ తెలియనివ్వని మాయగాడివి. మాచెల్లెల్ని విడువకపోతే నీ మదం అణచి, నేనే ఆమెను తీసుకొనిపోతాను." అని బాణాలు సంధించగా, నల్లనయ్య ముసిముసి నవ్వులు నవ్వుతూ వాటిని ముక్కలు చేశాడు. తన బాణాలతో రుక్మియొక్క గుర్రాలను సారథిని హతమార్చి, రుక్మిని గాయపరచాడు. రుక్మిరథందిగి కత్తిపట్టుకొని కృష్ణుని పైబడితే కృష్ణుడు ఆఖడ్గాన్ని ముక్కలుచేసి రుక్మిని చంపబోయాడు. అప్పుడు రుక్మిణి కృష్ణుని ఇలాగవేడుకొన్నది: "ప్రాణేశ్వరా! అహంకారంచే మాఅన్న నీపట్ల ఘోరమైనఅపచారమే చేశాడు. శిక్షార్హుడే, కాని స్వయంగాభగవానుడే మా అల్లుడైనాడని సంతోషిస్తున్న మా తలిదండ్రులను పుత్రశోకం నుండి రక్షించు. కరుణాసాగరుడవైన నీవు మాఅన్న అపరాధాలను మన్నించుమని

వేడుకొంటున్నాను" అని ప్రార్థించినది. కృష్ణుడు రుక్మిని చంపకుండా, బావమరిది కదాఅని, కొంచెం పరిహాసం చెయ్యదలచుకొని, తల, మీసము, గడ్డము, వికృతంగా గొరిగివదిలి పెట్టాడు. అప్పుడే రుక్మియొక్కసేనలను హతమార్చివచ్చిన బలరాముడు కృష్ణుడు చేసిన పనికి ఖిన్నుడై ఇలా అన్నాడు: "తమ్ముడా! ఇతనిని దూరంగా పొమ్మనకుండా ఇలాగ అవమానం చెయ్యడంనీకు తగదు. ఇతడిప్పుడు మన బంధువుకూడాను. అభిమానవంతునకు తలగొరగడం తలతీయడం కంటే దుర్భరంకదా!" అని రుక్మిణితో బలరాముడు ఇలా అంటాడు: "అమ్మా! మీ అన్న అవమానింపబడ్డాడని మా తమ్ముణ్ణి నిందించకు. దండనీతిని ప్రభువులు పాటించాలికదా! మీ అన్న, ఇప్పుడు బంధువైనాడు. కనుక మరణదండనకు బదులుగా స్వల్పమైన అహంకారదమనదండన విధించాడు కృష్ణుడు. ఇవి అన్నీ కర్మవశాన జరుగుతుంటాయి. దైవమాయచే దేహాభిమానమేర్పడి, శత్రుమిత్రులు, మానావమానాలు, స్వపరభేదాలు కల్పించుకొంటాడు మానవుడు. వాస్తవానికి ఆత్మఒక్కటే, దైవానికి అందరూ సమానులే. నీవు జ్ఞానవంతురాలవు గనుక అంతాఅర్థం చేసుకొనగలవు. దేనికీ నీవుశోకింపవలదు." అని బలరాముడు చేసిన జ్ఞానబోధకు రుక్మిణి ప్రసన్నురాలయినది.

ప్రతిజ్ఞ పూనిన రుక్మి, కుండిననగరం ప్రవేశించకుండా, నగరమునకు బయట నివసించసాగాడు. తరువాత అక్కడొక పట్టణం తయారయినది. బలరామకృష్ణులు రుక్మిణిని తోడ్కొని ద్వారకానగరిని చేరుకొన్నారు. రుక్మిణీ కృష్ణులవివాహం ద్వారకలో అత్యంత వైభవోపేతముగా జరిగినది. కృష్ణద్వేషులు తప్ప రాజులందరూ వచ్చారు. ద్వారక ప్రజలు నగరాన్ని వైకుంఠంలాగ అలంకరించారు. ఆదిలక్ష్మీమహావిష్ణువుల వివాహం జరిపించే భాగ్యముతమకే దక్కిందని ద్వారకవాసులు ఉప్పొంగిపోయారు. వధూవరుల సౌందర్యశోభను తిలకించి దేవతలతో సహా స్త్రీపురుషులందరూ సమ్మోహితులయ్యారు. సకలజనులూ ఆనందభరితులయ్యారు.

పరీక్షిన్మహారాజా! లక్ష్మీనారాయణులు, తమలీలా నాటకప్రదర్శనానికి, మళ్లీ భూలోకంలో ఆవిధంగా కలుసుకొన్నారు: అని శ్రీశుకుడు చెప్పాడు.

హరిః ఓంతత్ సత్

దశమస్కంధము పూర్వభాగము సమాప్తము

ఓం శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

***

॥ శ్రీహరిః ॥

శ్రీమద్భాగవత సంగ్రహము

దశమస్కంధము

ఉత్తరభాగము

ద్వారకావిలాసము - ప్రద్యుమ్నుడు

దేవతలరక్షణగురించి కుమారస్వామి పరమశివుని పుత్రుడై జన్మించవలసియున్నది. కాని సతీదేవి దేహత్యాగము తరువాత శివుడు ఏకాకియై తపోనిష్ఠుడైయుండెను. అతనినే పతిగా వరించి, అతనికి తెలియకుండా అతని పరిచర్యచేస్తున్న హిమగిరినందినియైన పార్వతియందు అతని మనస్సులగ్నమై వారు దంపతులైతేనే తప్ప దేవతల కోరిక ఫలించదు. కనుక దేవతలు మన్మథుని ఆశ్రయించి, శివునిపై తన కామాస్త్రాలను ప్రయోగింపుమంటారు. మన్మథుని చర్యలవలన ధ్యానవిక్షేపము కలిగిన శివునియొక్క మూడవనేత్రజ్వాలకు అతడు భస్మమైపోయాడు. అయితే మన్మథబాణ ప్రభావంచేత శివుని మనస్సు చలించి పార్వతియందు లగ్నముకాగా, ఆమెను వివాహం చేసుకొన్నాడు. మన్మథునిభార్యయైన రతీదేవి యొక్క మొరనాలకించిన శివుడు ఆమెను కనికరించి, మన్మథుడు అనంగుడై (అశరీరుడై) ఆమెతో సంచరించగలడని చెప్పాడు. కాని, "సౌందర్యానికే" ప్రతీకం అయిన మన్మథునకు రూపంలేకపోవడమేమిటని ఆమెకు సంతుష్టి కలుగలేదు. అప్పుడు శివుడు ద్వాపరయుగములో అవతరించనున్న నారాయణునకు మన్మథుడు, సుందరరూపములో పుత్రుడై జన్మిస్తాడనీ, అప్పుడామె అతనితో కలిసి జీవించవచ్చనీ చెపుతాడు.

రుక్మిణీకృష్ణులకు మన్మథుడు పుత్రుడై జన్మించి, ప్రద్యుమ్నుడని పిలువబడ్డాడు. ద్వారకప్రజలందరూ, అమితమైన ఆనందోత్సాహాలతో ఉత్సవం జరుపుకొన్నారు. శంబరాసురుడనే రాక్షసుడు తన మృత్యువు కృష్ణుని పుత్రునిచే సంభవిస్తుందని తెలుసుకొని, అందరూ వేడుకలలో నిమగ్నులైయున్న సమయంలో, ప్రద్యుమ్నుడు పుట్టిన ఏడవరోజునే ఆయనను ఎత్తుకొనిపోయాడు. బిడ్డడిని ఎలాగచంపాలి. ఎక్కడ చంపాలి, అని యోచించాడు. ముద్దులు గొలిపే ఆ ముగ్ధమోహనాకారుని చంపడానికి ఆ అసురునకు కూడ చేతులురాలేదు. చివరకు వానిని సముద్రంలో పారేస్తే, సముద్రుడే తన గర్భంలో కలుపుకొంటాడు అని నిశ్చయించి, ఆ బిడ్డను సముద్రంలో పారవేసి, తనమృత్యుభయం తొలగిపోయిందని సంతోషించాడు. సముద్రంలో పడిన బాలుని ఒక పెద్ద చేపమింగివేసినది. అతిపెద్దదైన ఆ చేపను జాలరులు పట్టుకొని, రాజైన శంబరుని వద్దకు తీసుకెళ్లగా నతడు సంతసించి జాలరులకు ధనమిచ్చి చేపను పాకశాలకు పంపించాడు. వంటవాళ్లు ఆచేపను కొయ్యగా, దానిపొట్టలో నున్న దివ్యసుందర బాలుని చూచి, ఆశ్చర్యపోయి ఆ బిడ్డను ఆ పాకశాలను నిర్వహిస్తున్న మాయావతి అనే ఆమెకు చూపించారు. ఆ బిడ్డను చూడగానే ఆమెకు వానిపై అకారణమైన మోహము పుట్టుకొనివచ్చినది. వానిని ప్రేమతో పెంచసాగినది. బాలుడు పెరిగి పెద్దవాడయ్యాడు. ఒకనాడు నారదుడు వచ్చి, ఆమె పెంచుతున్న బాలుడు పూర్వము మన్మథుడు అనీ, అతడు రుక్మిణీ కృష్ణుల పుత్రుడై పుట్టి, ప్రద్యుమ్నుడని పిలువబడ్డాడనీ, అతని చేత శంబరాసుడు చావవలసియున్నదనీ ఆ విషయం తెలుసుకొని, శంబరుడు ఏడురోజుల పురిటి బిడ్డను ఎత్తుకుపోయి సముద్రంలో పడవేస్తే, వాడు చేప కడుపులో పడి, శంబరుని వంటింటికే వచ్చిచేరాడనీ, అదృశ్యమైన బిడ్డను గురించి అలమటించి రుక్మిణీదేవి

కృశించిపోతున్నదనీ చెప్పినాడు. మళ్లీ మాయావతి అని పిలువబడే ఆమె నిజానికి మన్మథుని భార్య అయిన రతీదేవియనీ, మహాదేవుని మాట ప్రకారం తన పతిని కలుసుకోవచ్చునని భూలోకంలో సంచరిస్తూ శంబరునిచే చెరపట్టబడి అక్కడ ఉన్నదనీ త్వరలోనే శంబరాసురవధ జరిగిన పిమ్మట వారిద్దరూ ద్వారకకు వెళ్లిపోవచ్చుననీ చెప్పి నారదుడు నిష్క్రమించాడు. ప్రద్యుమ్నుడు నవయౌవనవంతుడైన సుందరరూపుడయ్యాడు. నారదమహర్షి చెప్పినతరువాత, ఆబాలుడు తనభర్తయే అని తెలుసుకొన్న మాయావతికి అతనిపై ప్రేమానురాగాలు కట్టలుతెంచుకొన్నవి. ఆమెయొక్క దృక్పథమే మారిపోయినది. ఆమెప్రవర్తనలోని మార్పును గమనించి, ఒకనాడు ప్రద్యుమ్నుడిలా అడిగాడు. "తల్లీ! కొద్దిరోజులుగా నీలో మాతృత్వం కనబడటంలేదు. పుత్రుడనైన నాపట్ల నీకు వాత్సల్యానికి బదులుగా కామతృష్ణయే కనిపిస్తున్నది. నాఊహయే నిజమైతే ఇది ధర్మవిరుద్ధము. ఘోరపాపము, నీమనస్సును సరిదిద్దుకో" అని మందలించాడు. అప్పుడామె నారదమహర్షి వలన తెలుసుకొన్న తమయొక్క పూర్వజన్మల వృత్తాంతాలనూ, వెంటనే శంబరాసురుని వధించవలసిన ఆవశ్యకతను, పుత్రవియోగ దు:ఖము నుండి రుక్మిణీదేవిని కాపాడవలసిన ఆవశ్యకతనూ వివరించిచెప్పి, మళ్లీ ఇలాగ అన్నది: "ఈ శంబరుడు గొప్ప మాయలమారి. మహాక్రూరుడు. దేవతలను కూడ జయించిన బలశాలి. వీనిని హతమార్చడం అంత సులువేమీకాదు. వీనిమాయలను అరికట్టగల మహామాయా విద్యను నీకు నేర్పుతాను" అని చెప్పి మాయావతి ఆ విద్యను ఉపదేశించినది.

యుద్ధానికి సర్వసన్నద్ధుడై వెళ్లిన ప్రద్యుమ్నకుమారుడు శంబరుని యుద్ధానికి కవ్వించి, ఇలా అన్నాడు: "ఓరీ! రాక్షసాధమా! నన్ను సముద్రములో పడవేసి, నీ చావును తప్పించుకొందామనుకొన్నావా? చావునెవ్వరైనా తప్పించుకొనగలరా! ఎలాగ తప్పించుకొనగలవో చూద్దాం బయటకు రా." అని కేకవేయగా శంబరుడు రోషముతో భయంకరంగా గర్జించి, గదనెత్తి ప్రద్యుమ్నుని తలకు గురిపెట్టి కొట్టాడు. ప్రద్యుమ్నుడు మెరుపుతీగలాగ తప్పించుకొని, తన గదతో అసురుని గదను ముక్కలుచేసి, వానిని మొత్తాడు. ఆదెబ్బలకు శంబరుడు భయపడిపోయి, మాయాప్రయోగంచేసి ఆకాశంనుండి బాణాల వర్షం కురిపించాడు. ప్రద్యుమ్నుడు సాత్వికమాయను ప్రయోగించి, శరవర్షాన్ని ఆపివేశాడు. ఆవిధంగా శంబరుడు ప్రయోగించిన మాయలన్నిటినీ త్రిప్పికొట్టేసరికి వాడు ఇక చేసేదేమీలేక ముష్టియుద్ధానికి దిగగా ప్రద్యుమ్నుడు వాని శిరస్సును ఖండించాడు. దేవతలు సంతసించి పుష్పవృష్టి కురిపించారు.

ప్రద్యుమ్నుని తీసుకొని, మాయావతి అయిన రతీదేవి ఆకాశమార్గాన ద్వారకా నగరంచేరి, రుక్మిణీ భవనంలో వెలసినది. ప్రద్యుమ్నుని చూచి, అక్కడి అంతఃపురాంగనలు, పరిచారికలు, అతడు శ్రీకృష్ణుడే అని భ్రమపడ్డారు. అయితే ఆ ప్రక్కనున్న స్త్రీ ఎవరు? అని తికమకచెందారు. ముమ్మూర్తులా శ్రీకృష్ణుని పోలిన ఆ యువకుడెవరు? ఆమె ఎవరు? అనే కుతూహలంతో స్త్రీలంతా వారి చుట్టూ మూగారు. ఏమిటీ సందోహం అని రుక్మిణీదేవికూడ? వచ్చిచూచినది. తన కన్నులను తానే నమ్మలేకపోయినది. ముమ్మూర్తులా తన భర్తలాగే కనిపిస్తున్న ఈ యువకుడెవ్వడు? అతనిని చూడగానే ఆమె కన్నులనుండి అశ్రువులు, చన్నులనుండి పాలుకార నారంభించాయి. ఆమె తన చెలికత్తెతో నిలా అన్నది: "చెలీ! ఈ సుకుమార సుందర యువకుడెవ్వడోకదా! ఎక్కడినుండి, ఎందుకు వచ్చాడో! ఇతనిని కన్న భాగ్యవతి ఎన్నినోములునోచి కన్నదో కదా? నాతొలిచూలి బాలుని నా ప్రక్కనుండి ఏపాపాత్ముడు దూరము చేశాడో? వాడు ఏ చల్లని తల్లి వద్ద పెరుగుతున్నాడో! ఈసరికి వాడుకూడ ఇంతవాడే అయియుంటాడు. ఇతడు నా పుత్రుడే అయియుండవచ్చునేమో! కాకపోతే ఇతనిలో నా పతిపోలికలెందుకు ఉంటాయి? ఇతనిని చూస్తుంటే ప్రేమ పొంగివస్తున్నది, హృదయం ఆనందంతో నిండిపోతున్నది. ఆనందాశ్రువులు కారుతున్నవి. పాలు పొంగారుతున్నవి." అని, ఆ తల్లి తల్లడిల్లిపోతున్నది. అంతఃపురంలో జరుగుతున్న సందడి గురించి తెలుసుకొని, శ్రీకృష్ణుడు దేవకీవసుదేవులను తోడ్కొని అక్కడికి వచ్చాడు. అన్నీ తెలిసియుండియు

ఏమీ తెలియనట్లు అంతా గమనిస్తున్నాడు. అందరిలో కుతూహలము పతాకస్థాయికి చేరుకొనే సరికి నారదమహర్షి ప్రత్యక్షమయ్యాడు. శంబరుడు పసికందును ఎత్తుకొపోయినప్పటినుండి, ప్రద్యుమ్ననిచే సంహరింపబడినంత వరకు జరిగిన వృత్తాంతమంతా వివరించి చెప్పాడు. మాయావతి ఎవరోకూడ చెప్పాడు.

మరణించిన బాలుడు బ్రతికివచ్చినంత ఆనందం కలిగినది అక్కడివారందరికీ. దేవకీవసుదేవులు, బలరామకృష్ణులు, రుక్మిణీసమేతలైన అంతఃపురకాంతలు అందరూ రతీప్రద్యుమ్నులను ప్రేమతో ఆశీర్వదించారు. రుక్మిణీదేవి కొడుకును కొగలించుకొని మృత్యుముఖంనుండి తప్పించుకొని, దుష్టరాక్షసుని సంహరించి, భార్యతోసహా వచ్చినందుకు ఆనందబాష్పాలురాల్చినది. నిత్యనూతనయౌవనవతియైన ఆదివ్యసుందరి తనకోడలు అయినందుకు ఆమెపరవశించిపోయి ఆలింగనం చేసుకొన్నది. ద్వారకానగరవాసులందరూ ప్రద్యుమ్నకుమారుని గాథను చెప్పుకొని ఆనందించేవారు. ఆ దివ్య దంపతులను చూచి సమ్మోహితులయ్యేవారు.

సత్యభామ, శమంతకమణి, జాంబవతి

ద్వారకానగరవాసియైన సత్రాజిత్తు గొప్ప సూర్యభక్తుడు. అతని భక్తికి మెచ్చి, సూర్యుడు అతనికి శ్యమంతకమణిని ఇచ్చాడు. దానిని ధరించి, సత్రాజిత్తు ద్వారకలో ప్రవేశిస్తుంటే, అక్కడి పామరులు శ్రీకృష్ణ దర్శనార్థం సాక్షాత్తు సూర్యుడే నడచి వస్తున్నాడని భావించి, కృష్ణుని వద్దకు వెళ్లి ఇలా అన్నారు: " నారాయణా! వాసుదేవా! గోవిందా! దామోదరా! యదునందనా! నీదర్శనానికి ఆ సూర్యభగవానుడే వస్తున్నాడు" అని ఉత్సాహంతో చెప్పారు. శ్రీకృష్ణుడు మందహాసంచేసి ఇలా అన్నాడు: "ఆ వస్తున్నది సూర్యుడు కాడు, అతడిచ్చిన శ్యమంతకమణిని ధరించిన సత్రాజిత్తు." అని చెప్పాడు. సత్రాజిత్తు ఆ మణికి పూజలు చేయించి, దానిని తన పూజగదిలో ప్రతిష్ఠింప జేశాడు. అది ఎక్కడ ఆరాధింపబడుతుందో, అక్కడ ఆ మణిప్రభావంచేత ప్రతిదినమూ ఎనిమిది బారువల బంగారము ఉద్భవిస్తుంది. అక్కడ అరిష్టాలు, అకాలమృత్యువు, రోగాలు, వంచన, దొంగతనము, దుర్భిక్షము సంభవించవు, కనుక ఆ మణి ఉగ్రసేనమహారాజు వద్దనుంటే లోకకల్యాణం జరిగి, ప్రజలందరూ సుఖిస్తారని, శ్రీకృష్ణుడు దానిని మహారాజునకిమ్మని సత్రాజిత్తుతో చెప్పాడు. సత్రాజిత్తు అలాగ చెయ్యడానికి నిరాకరించాడు.

ఒకనాడు సత్రాజిత్తుతమ్ముడైన ప్రసేనుడు శ్యమంతకమణిని కంఠాన ధరించి, వేటకై అడవికి వెళ్లాడు. అడవిలో నొక సింహము వానినీ, వాని గుర్రాన్నీ చంపి, ఆ మణినినోట కరుచుకొనిపోతుంటే, జాంబవంతుడనే మహాబలశాలియైన భల్లూకరాజు ఆ సింహాన్నిచంపి, మణిని తీసుకొనిపోయి, గుహలోనున్న తన బిడ్డకు ఆటవస్తువుగాజేశాడు.

మణిని ధరించి వేటకువెళ్లిన ప్రసేనుడు తిరిగిరానందున సత్రాజిత్తు ఆందోళనచెందాడు. మణిని సంగ్రహించాలని తన తమ్ముని ఎవ్వరో సంహరించియుంటారని తలపోశాడు. ఆ పనిని కృష్ణుడే చేయించి యుండవచ్చని అనుమానించి, తన ఊహను వ్యక్తపరచాడు. ఆ మాట అంతటావ్యాపించి శ్రీకృష్ణుని చెవిలోపడినది. ఈ అపనిందను తొలగించుకోవాలని కొందరు అనుచరులతో శ్రీకృష్ణుడు అడవికివెళ్లిఅంతా గాలించగా, ఒకచోట చచ్చిపడియున్న గుర్రాన్నీ, ఇంకకొంతదూరంలో ప్రసేనుని కళేబరాన్నీ, తరువాత చచ్చిన సింహాన్నీ, అక్కడినుండి ఎలుగుబంటి అడుగుల జాడలను పిదప ఒక కొండగుహనూ కనుగొన్నాడు. అనుచరులను గుహద్వారం వద్ద నుండుడని చెప్పి, తాను గాఢాంధకారంగా నున్న గుహలోనికి ప్రవేశించాడు. ఆ లోపల దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఒక బాలబాలికను చూచాడు. ఆమెకు ఎదురుగా వ్రేలాడగట్టబడిన ఆ దివ్యమణిని చూచాడు. శ్రీకృష్ణుడు ఆ మణిని తీసుకొనబోవగా ఆ బాలిక అరచినది. అదివిని లోపలినుండి జాంబవంతుడు వచ్చి కృష్ణుని ఎదిరించాడు. ఇద్దరికీ రాత్రింబవళ్లూ నిర్విరామంగా ఇరవై ఎనిమిదిరోజులు ఘోరయుద్ధం జరిగినది. కత్తులతోను, చెట్లతోనూ, పిడికిళ్లతోను కొట్టుకొన్నారు.

శ్రీకృష్ణుని పిడికిటిపోట్లకు జాంబవంతుని అవయవాలన్నీ హీనమైనవి. శక్తి సన్నగిల్లినది. ఓటమితెలియని జాంబవంతుడు ఓడిపోయాడు. తనతో ఇన్నిరోజులు పోట్లాడి, తననుఓడించినవాడు మానవమాత్రుడు కాడని గ్రహించాడు. నారాయణుడే ఈ రూపములో వచ్చినట్లు భావించాడు. తనకు పూర్వం ఇచ్చినమాట ప్రకారం తన ఆరాధ్యదైవమైన రఘురాముడే ఈ విధంగా దర్శనమిచ్చాడని భావించి, ఇలాగ స్తుతించాడు:

"దేవాధిదేవా! నీవు పురాణపురుషుడవు. పరమేశ్వరుడవు, మహావిష్ణుడవు అనితెలుసుకొన్నాను. సర్వభూతాలకూ నీవే ప్రాణమూ, ప్రతాపమూ, ధైర్యమూ, బలమున్నూ. ఈ విశ్వానికి సృష్టి స్థితి లయాలకు ఎవరుకారకులో, వారియొక్క సృష్టిస్థితి లయాలను నియమించు ఈశ్వరుడవు నీవు: సర్వాత్ముడవు. శ్రీరామచంద్రుడుగా నీబాణాగ్నిచే సముద్రాన్నే ఇంకింపజేయగలశక్తి నీది. సాగరుడు నీకు దారినిచ్చి, సేతువును కట్టనిచ్చాడు. నీవు రావణాది రాక్షసులను అంతంచేసి, సజ్జనుడైన విభీషణునకు లంకాధిపత్యమిచ్చావు. నా ప్రభువైన నిన్నెదిరించి, అపచారం చేశాను. నన్ను మన్నించుప్రభూ!" అని శ్రీకృష్ణుని పాదాలపైబడిన పరమభక్తుడైన జాంబవంతుని శరీరాన్నినిమిరి అతని బాధలను నివారించి, స్వామి, ఇలా అన్నాడు.

"జాంబవంతా! నీకు తెలిసిన త్రేతాయుగములోని రఘురాముడను నేనే, ద్వాపరయుగములోని వసుదేవ నందనుడనైన కృష్ణుడను నేను. మాలో భేదమేమీ లేదు. 'ఈ శమంతకమణిని నేనే అపహరించితిని' - అనే అపనిందను తొలగించుకోవాలని, దానిని వెతుక్కొంటూ నేనిక్కడికి వచ్చాను. సత్రాజిత్తునకు చెందిన ఈ మణిని అతనికిచ్చివేయాలి." అని చెప్పగా, జాంబవంతుడు సంతోషముతో శమంతకమణినీ, దానితోపాటు మరికొన్ని మణులను అర్పించి ఇలాగ విన్నవించుకొన్నాడు. "స్వామీ! ఈమె నా బిడ్డ జాంబవతీకన్య. ఈమెనుకూడానీకే సమర్పించితే, నా జన్మధన్యమవుతుంది. ఈమెను స్వీకరించి, నన్ను బంధవిముక్తుని చేయుమని ప్రార్థిస్తున్నాను." అని చెప్పగా స్వామి అందులకు అంగీకరించాడు. తరువాత జాంబవంతుడు ముక్తినిపొందాడు.

గుహద్వారమువద్ద కాచుకొనియున్న కృష్ణుని అనుచరులు పన్నెండుదినాలు శ్రీకృష్ణుని గురించిచూచి, చూచి, నిరాశజెంది, దుఃఖిస్తూ మరలిపోయారు. దేవకీవసుదేవులు, రుక్మిణి మొదలైన అంతఃపురవాసులు, ద్వారకప్రజలు, శ్రీకృష్ణుడు క్షేమంగా తిరిగిరావాలని దుర్గాదేవిని ప్రార్థించారు.

శ్రీకృష్ణుడు విజయంసాధించి, శమంతకమణితోపాటు బాలామణిని కూడా తీసుకొనివచ్చినందులకు ప్రజలు పండుగచేసుకొన్నారు. శ్రీకృష్ణుడు జాంబవతీ కన్యను వివాహం చేసుకొన్నాడు. ఉగ్రసేనుడు కొలువుతీర్చగా సత్రాజిత్తును రప్పించి, అందరి సమక్షంలో శ్రీకృష్ణుడు శమంతకమణిని సత్రాజిత్తునకు అప్పగించాడు. సత్రాజిత్తు సిగ్గుపడి, పశ్చాత్తాపంచెందాడు. తననుతాను దూషించుకొన్నాడు. తనపాప పరిహారం చేసుకోవడం ఎలాగ? అనీ, శ్రీకృష్ణుని సంతోషపెట్టి అతని అనుగ్రహం సంపాదించడం ఎలాగ అనీ, బాగుగా యోచించి, ఒక నిర్ణయానికి వచ్చాడు. తనపుత్రిక అయిన సత్యభామ జగత్ప్రసిద్ధిచెందిన సౌందర్యరాశి. ఆమెను వివాహమాడాలని ఎందరో యువకులు ఉవ్విళ్ళూరుతుండేవారు. అందరినీకాదని ఆమెను శ్రీకృష్ణునికే ఇవ్వ నిశ్చయించుకొన్నాడు. ఆమెతోపాటు శమంతకమణినికూడ కృష్ణునకే ఇవ్వదలచుకొన్నాడు. సత్యభామను స్వీకరించడానికి శ్రీకృష్ణుడు అంగీకరించాడు. వారిద్దరి వివాహం వైభవోపేతంగా జరిగింది. శ్రీకృష్ణుడు సత్రాజిత్తుతో ఇలా అన్నాడు:

"ఈ శమంతకమణిని సూర్యభగవానుడు నీకు ప్రసాదించాడు. కనుక ఇది నీవద్దనే ఉండనీ. మాకు మణులకు కొదువలేదు. నీవు సమర్పించిన ఈ భామామణి మాకుచాలు" అని శమంతకమణిని సత్రాజిత్తునకు తిరిగి ఇచ్చివేశాడు.

సత్రాజిత్తు తనకు సూర్యుడిచ్చిన శమంతకమణి వలన దేవుడిచ్చిన సుందరీమణి (సత్యభామ) వలన, కొందరికి శత్రువైనాడు. ద్వారకలోని కొందరు సత్యభామపై ఆశలుపెంచుకొని యుండిరి. సత్రాజిత్తు వారి ఆశలను మొదటిలోనే త్రుంచివేయలేదు. కనుక ఆమెను శ్రీకృష్ణునకిచ్చి వేయడంతో వాళ్లకు క్రోధము వచ్చేసినది. శమంతకమణి తెచ్చిన సౌభాగ్యముతో సత్రాజిత్తు అనేకుల అసూయకుగురి అయ్యాడు. ఇటువంటి శత్రువులలో శతధన్వుడు, కృతవర్మ ముఖ్యులు. శ్రీకృష్ణునిపై మొదట అపనింద మోపినందుకు అక్రూరునకు కూడ సత్రాజిత్తుపై క్రోధమున్నది. సత్యభామను తనకిస్తానని మొదటచెప్పి, తరువాత మనసు మార్చుకొని కృష్ణునకిచ్చినందుకు శతధన్వునకు సత్రాజిత్తుపై ఎక్కువ కక్ష ఏర్పడినది. దానికి కృతవర్మ, అక్రూరుడు అతనిని ప్రోత్సహించారు. అతడు సమయం గురించివేచి యున్నాడు.

కుంతీసమేతంగా పాండవులు లక్కఇంట్లో దగ్ధమయ్యారని తెలిసి, బలరామకృష్ణులు హస్తినాపురం వెళ్లారు. భీష్మ, ద్రోణ, కృప, విదుర, గాంధారిమున్నగువారిని కలుసుకొని, కొద్దిరోజులు గడిపి వెళ్దామనుకొన్నారు. వారు ద్వారకలో లేనప్పుడు, ఇదేమంచిఅదను అని శతధన్వుడు ఇంట్లో నిద్రిస్తున్న సత్రాజిత్తును చంపి, ఇంట్లోని స్త్రీలు ఎంత మొరపెట్టినా జాలిలేనివాడై శమంతకమణిని తీసుకొని పారిపోయాడు. తండ్రి మరణానికి మిక్కిలి శోకించి, సత్యభామ ఆ శరీరాన్ని మానెతొట్టెలో భద్రపరచిఉంచి, తాను స్వయంగా హస్తినాపురికి వెళ్లి శ్రీకృష్ణునితో అంతావివరించి చెప్పినది. బలరామకృష్ణులు సత్యభామనుతోడ్కొని ద్వారకకు తిరిగి వచ్చారు. హంతకుడైన శతధన్వుని సంహరించాలని నిశ్చయించుకొన్నారు. శతధన్వుడు ప్రాణభయంతో పోయి, తన్ను రక్షించుమని కృతవర్మను కోరాడు. "బలరామకృష్ణులను ఎదిరించిన వాడెవ్వడూ బ్రతికి బయటపడలేదు. కంసుని గతి ఏమయినది? జరాసంధుడు ఎన్నిసార్లు ఓడిపోలేదు? ఇక ఇతరుల విషయం వేరే చెప్పాలా?" అంటూ కృతవర్మ తప్పుకొన్నాడు. అప్పుడు శతధన్వుడు అక్రూరుని వద్దకుపోయి రక్షింపుమన్నాడు. "అయ్యో శతధన్వా! బలరామకృష్ణులతో వైరమా? వాళ్లెవరనుకొంటున్నావు? విష్ణుమూర్తి అంశంతో పుట్టినవారు. శ్రీకృష్ణుడైతే సాక్షాత్తు భగవంతుడే. అతడు సమస్త విశ్వానికీ సృష్టిస్థితిలయకర్త. అతనియొక్క మాయామోహంలో సమస్తసృష్టి మునిగియుంటుంది. దానిని తెలుసుకొనడం ఎవ్వరితరమూ కాదు. అతడు మాకు సదాపూజనీయుడే. అతనిని కలలోకూడ ఎదిరించడం జరుగదు." అని అక్రూరుడు చెప్పగా, ఇక గత్యంతరం లేక శతధన్వుడు, శమంతకమణిని భద్రంగా నుంచుమనిచెప్పి దానిని అక్రూరునికి అప్పజెప్పి గుర్రమెక్కి పారిపోయాడు. బలరామకృష్ణులు వానిని రథంలో వెంబడించారు. మిథిలానగర సమీపంలో శతధన్వుని గుర్రము ఇక పరుగెత్తలేక పడిపోయినది. అప్పుడు శతధన్వుడు అడ్డదారులలో పరుగెత్తనారంభించాడు. శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని ప్రయోగించగా వాడు హతుడైనాడు. కృష్ణుడు వెళ్లి వాని శరీరమంతా వెదికినా శ్యమంతకమణి కనపడలేదు. అప్పుడు బలరాముడు కృష్ణునితో ఇలా అన్నాడు: "కృష్ణా! ఈ శతధన్వుడు ద్వారకలోనే ఆ మణిని ఎవరివద్దనో దాచియుంటాడు. నీవు తిరిగివెళ్లి అక్కడే అన్వేషించు. మనం మిథిలవరకూ వచ్చినాము గనుక, నేను నా ప్రియమిత్రుడైన జనకుని వద్ద కొన్నాళ్లుండి వస్తాను." అని చెప్పి బలరాముడు మిథిలా నగరములో ప్రవేశించాడు. జనక మహారాజు బలరామునికి సకల సత్కారాలూ చేసి గౌరవించాడు. అతనిని చాలా రోజులు మిథిలలోనే ఉంచివేశాడు. ఆ కాలములోనే దుర్యోధనుడు మిథిలకువచ్చి బలరామునివద్ద గదాయుద్ధ కౌశలాన్ని బాగా నేర్చుకున్నాడు.

ద్వారకకు తిరిగివచ్చిన శ్రీకృష్ణుడు సత్రాజిత్తునకు అంత్యక్రియలు చేయించాడు. శతధన్వుడు శ్రీకృష్ణుని చేత సంహరింపబడినట్టు తెలుసుకొని, అతడు చేసిన నేరానికి తమప్రోత్సాహము కూడ ఉన్నది గనుక, కృతవర్మ అక్రూరులు భయపడి, చాలదూర ప్రదేశాలకు వెళ్లిపోయారు. అక్రూరుడు లేని కారణాన ద్వారకలో వర్షాలు

కురియడంలేదు. ప్రజలకు అనేకమైన మానసిక శారీరిక బాధలు కలుగనారంభించాయి. అక్కడి వృద్ధులు శ్రీకృష్ణునితో నిలా అన్నారు: "వాసుదేవా! పూర్వము కాశీరాజు తనరాజ్యములో వార్షాలు చాలాకాలం కురియకపోతే శ్వఫల్కుడనే మహనీయుని తీసుకొనివెళ్లి తనకుమార్తెయైన గాందినిని అతనికిచ్చి వివాహంచేసి సత్కరించగా వర్షాలు కురిసినవి. ఆ గాందినీశ్వఫల్కుల పుత్రుడే ఈ అక్రూరుడు. ఇతడు కూడ అలాంటి మాహాత్మ్యము కలవాడే గనుక, అక్రూరుని తిరిగి ద్వారకకు రప్పించడం క్షేమకరం." అని చెప్పగా అక్రూరుడు కాశీ రాజ్యంలో నున్నట్టు తెలుసుకొని, అక్కడికి దూతలను పంపించి అక్రూరుని రప్పించాడు శ్రీకృష్ణుడు.

శమంతకమణిని తీసుకొని దూరదేశాలకువెళ్లిపోయిన అక్రూరుడు, కాశీపట్టణంలో స్థిరపడి, ఆ మణి ప్రభావంవలన లభ్యమైన ధనముతో, లోకకల్యాణం గురించి యజ్ఞాలు చేయిస్తూ అన్నదానాలు చేయిస్తూ ఇతర ధర్మకార్యాలలో ఆ ధనాన్ని సద్వినియోగం చేసేవాడు. శ్రీకృష్ణునిచే ద్వారకకు మరలి రమ్మని ఆహ్వానంరాగానే, ద్వారక వెళ్లాడు. శ్రీకృష్ణుడు ఒక సభను ఏర్పాటుచేసి, అక్రూరుని ఆదరముతో నాహ్వానించి, ఇలా అన్నాడు: "అక్రూరా! సత్రాజిత్తును సంహరించి, శతధన్వుడు పారిపోతూ శ్యమంతకమణిని నీవద్ద విడిచి వెళ్లినాడని నాకుతెలుసు. భయముచే నీవుకూడ మణిని తీసుకొని ద్వారకనుండి వెళ్లిపోయినా, మణివలన వచ్చిన ధనముతో సత్కర్మలు చేస్తున్నావని నేను దానిని నీనుండి తీసుకొనలేదు. సత్రాజిత్తునకు పుత్రులు లేరుగనుక అతని ఆస్తి పుత్రికలకు చెందుతుంది. మనుమలు అతని శ్రాద్ధకర్మలు చెయ్యాలి, ఆ ఆస్తిని పొందాలి. నాకు ఆ మణితో ప్రమేయములేదు. దానిని నేనే దక్కించుకొన్నానేమో అనే అనుమానము ఎవ్వరికీ రాకుండునట్లుగా నీవు ఆ మణిని సభలోని వారందరికీ చూపించు." అని శ్రీకృష్ణుడు చెప్పగా అక్రూరుడు సిగ్గుతో కన్నీరుపెట్టుకొని, క్షమించుమని స్వామిపాదాలపైబడి, గుడ్డమూటనువిప్పి ఆ శమంతకమణిని స్వామికి సమర్పించుకొన్నాడు. స్వామి దానిని సభాసదులందరికీ చూపించి, అందరూ చూస్తుండగా, మళ్లీ అక్రూరునకే ఇచ్చివేసి ఇలా అన్నాడు:

"అక్రూరా! ఈ శమంతకమణిని నీవే ఉంచుకొని, దానివలన వచ్చిన ధనముతో, సత్రాజిత్తుకూడ సద్గతిని పొందునట్లుగా, సత్కర్మలుచేస్తూఉండు" అని చెప్పాడు. అక్రూరుడు భయముతీరి, ద్వారకలోనే ఉండిపోయాడు.

ఈ శమంతకోపాఖ్యానాన్ని చదివినవారికీ, విన్నవారికీ మంగళము, జయము కలిగి, పాపము, అపకీర్తి, తొలగిపోతాయి అని శ్రీశుకుడు పరీక్షిత్తుతో చెప్పాడు.

శ్రీకృష్ణుని ఇతర భార్యలు

ద్రోణాచార్యుని చంపగల పుత్రుడూ, అర్జునునికి భార్యకాగల పుత్రిక కావాలని పాంచాలరాజైన ద్రుపదుడు యజ్ఞము చేయించగా, ఆ యాగాగ్నినుండి ఒక బాలుడు, ఒక బాలిక ఉద్భవించారు. వారే ధృష్టద్యుమ్నుడు, కృష్ణ (ద్రౌపది). కాని పాండవులందరూ లక్క ఇంట్లో కాలిపోయి నశించారని విని, చాలా దుఃఖించి, ద్రుపదుడు ద్రౌపదీ స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడు. అర్జునునితో సమానమైన ధనుర్విద్యానిపుణుడే కావాలని, మత్స్యయంత్ర పరీక్షను పెట్టాడు. సాత్యకి, ప్రద్యుమ్నాదులతోగూడి శ్రీకృష్ణుడు ద్రుపదుని ఆహ్వానంపై అక్కడకు వెళ్లాడు. పాండవులు లక్క ఇంటి జ్వాలలకు ఆహుతి కాలేదని కృష్ణునకు తెలుసు. వారు ఎక్కడున్నా ఈ స్వయంవరం విషయం తెలిస్తే రాగలరని ఊహించాడు. బ్రాహ్మణుల వేషములో వచ్చిన ఐదుగురు యువకులూ పంచపాండవులే అని ఊహించాడు. మత్స్యయంత్రాన్ని అర్జునుడే కొట్టాలనే ఉద్దేశముతో ప్రద్యుమ్ననీ, సాత్యకినీ ఆ పరీక్షలో పాల్గొనవద్దని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ పరీక్షలో బ్రాహ్మణవేషంలోనున్న అర్జునుడే నెగ్గాడు. తానుకోరినట్లు నిజంగా అర్జునుడే నెగ్గినాడని తెలుసుకొన్న ద్రుపదుడు మిక్కిలి సంతసించాడు. బలరామకృష్ణులు మేనత్తఅయిన కుంతీమాతను,

పాండవసోదరులను చూడడానికి వారు ఉంటున్న ఇంటికి వెళ్లారు. అప్పుడే మొట్టమొదటిసారిగా వాళ్లు కలుసుకోవడం జరిగినది. కృష్ణునకు అర్జునునియందు బాగా ఇష్టం ఏర్పడినది. పాండవులు పడుతున్న కష్టాలనుచూచి, కృష్ణుడు వాళ్లకు సహాయపడాలని నిశ్చయించుకొన్నాడు. ఇప్పుడు శక్తిమంతుడైన ద్రుపదునితో బాంధవ్యం ఏర్పడినది గనుక పాండవులు హస్తినాపురం వెళ్లిపోయి, నిర్భయంగా బ్రతుకవచ్చునని కృష్ణుడు సూచించాడు.

కొంతకాలం తరువాత పాండవులు ఎలాగున్నారో చూచిరావాలని సంకల్పించి, శ్రీకృష్ణుడు, సాత్యకి మొదలైన యాదవులతో ఇంద్రప్రస్థనగరానికి వెళ్లాడు. చైతన్యం వచ్చిన ఇంద్రియాలలాగ పాండునందనులు శ్రీకృష్ణుని చూడగానే ఆనందభరితులై ఆలింగనం చేసుకొన్నారు. సర్వేశ్వరుని పాదస్పర్శతో వాళ్ల కష్టాలన్నీ కరిగిపోయాయి. శ్రీకృష్ణుడు ధర్మజునకు, భీమునికి పాదాభివందనాలు చేశాడు. అర్జునుని ఆలింగనం చేసుకొన్నాడు. తనకు నమస్కరించిన నకులసహదేవులను ప్రేమతో దీవించాడు. కొత్తపెండ్లికూతురైన ద్రౌపది సిగ్గుపడుతూ శ్రీకృష్ణునికి మ్రొక్కినది. సాత్యకి మొదలైన యాదవులను ధర్మజుడు మిక్కిలి గౌరవించి ఆదరించాడు. శ్రీకృష్ణుడు కుంతీదేవి వద్దకు వెళ్లి నమస్కరించి, ఇలా అడిగాడు: "అత్తా! నీకు కుశలమేనా! కొడుకులూ, కోడలూ నీహృదయానికి ఆనందం కలిగిస్తుంటే సుఖంగా జీవితం గడిచిపోతున్నది కదా!" అని పలుకరించగా, కుంతీదేవి దుష్ట దుర్యోధనాదుల వలన పడుతున్న కష్టాలు గుర్తురాగా కంటతడిపెట్టుకొని, గద్గద స్వరముతో నిలాగ చెప్పినది: "కృష్ణా! నీవుండగా ఎవ్వరైనా ఎలాంటి కష్టాలనైనా దాటివేయగలరు. నీవు బంధువులను మరచిపోకుండా ఆదరిస్తావు. నీవు పంపగా అక్రూరుడు వచ్చి, మాయొక్క యోగక్షేమాలను తెలుసుకొని వెళ్లినాడుకదా! నీ అండవల్లనే మేము జీవించి యున్నాము. మాకు నీవే దిక్కు. ఇదంతా నీ భాగ్యమే కదా! కృష్ణా!" అని చెప్పగా, యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు: "మహానుభావా! సనక సనందనాది మహర్షులే నిన్నుగాంచలేరు. అలాంటి మేటి ప్రభువైన నీవు మాకు బాంధవుడవు కావడం మాయొక్క పూర్వజన్మల సుకృతఫలమేకదా!" అని తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు. పాండవుల అభ్యర్థనను మన్నించి పరమపురుషుడు వాళ్లతో కొన్నాళ్లు ఉండదలచుకొన్నాడు.

ఒకనాడు కృష్ణార్జునులు వేటకై అడవికి వెళ్లి, యమునా నదిలో నీరు త్రాగి, ఇసుకతిన్నెపై కూర్చొనియుండగా, అక్కడ సంచరిస్తున్న ఒక దివ్యసుందరి కనిపించినది. ఆమె ఎవరో, ఎందుకు అలాగ సంచరిస్తుందో తెలుసుకొని రమ్మన్నాడు శ్రీకృష్ణుడు. అర్జునుడామెను సమీపించి, ఆమె వృత్తాంతమేమిటో తెలుపుమనగా ఆమె ఇలాగ చెప్పినది: "మహాశయా, నేను సూర్యతనూజనైన కాళిందిని. నేను విష్ణువునే వివాహం చేసుకొనదలచుకొన్నందున, నా తండ్రి ఈ నదిలో నొక భవనం నిర్మించి, అందులోనుంటూ తపస్సు చేసుకొనుమన్నాడు. ఒకనాడు విష్ణువుయొక్క అవతారపురుషుడైన కృష్ణుడు ఇక్కడికి రాగలడని చెప్పడంచేత నేను శ్రీకృష్ణుడే నాకు భర్త కావాలని తపస్సు చేస్తున్నాను" అని చెప్పినది. ఈ మాటలను అర్జునుడు శ్రీకృష్ణునకు నివేదించగా, అతడు సంతసించి, ఆమెతపస్సునకు మెచ్చి ఆమెను స్వీకరించి, రథముపై కూర్చుండబెట్టుకొని పాండవగృహానికి తీసుకొనివెళ్లాడు.

శ్రీకృష్ణుని కోరికపై విశ్వకర్మ పాండవులగురించి ఇంద్రప్రస్థపురిని నిర్మించాడు. అందులో పాండవులతో సహా శ్రీకృష్ణుడు కొన్నాళ్లున్నాడు.

ఒకనాడు అగ్నిదేవుడు కృష్ణార్జునుల వద్దకువచ్చి, తాను తలపెట్టిన ఖాండవవన దహనంలో ఇంద్రుడు అడ్డుపెట్టకుండా సహాయపడుడని కోరినాడు. ఇంద్రుని ఎదుర్కొవలసియున్నది గనుక అగ్నిదేవుడు వరుణుని అడిగి, నాలుగు శ్వేతాశ్వములతోనున్న రథాన్ని, కవచాన్ని, అక్షయతూణీరముతో గాండీవమనే శక్తిమంతమైన ధనుస్సును అర్జునునకు ఇచ్చాడు. శ్రీకృష్ణుడు సారథిగానుండగా అర్జునుడు అగ్నికి సహాయపడి, అతనిని తృప్తి పరచాడు. ఆ మంటలలో కాలిపోకుండా, మయుడనే రాక్షసులశిల్పి తన్ను కాపాడుమని అర్జునుని వేడుకొన్నాడు. అర్జునుడు

మయుని మంటలనుండి రక్షించగా, మయుడు కృతజ్ఞతతో పాండవుల గురించి ఇంద్రప్రస్థములో ఒక విచిత్రమైన సభాభవనాన్ని కట్టి ఇచ్చాడు. అదే మయసభ అని ప్రసిద్ధిగాంచినది. ఈ మయ సభలోనే దుర్యోధనుడు, నేల ఉన్నచోట నీరు ఉన్నట్లుగాను, నీరు ఉన్నచోట నేల ఉన్నట్లుగాను తికమకపడి, తాను అవమానింపబడినట్లు బాధపడ్డాడు.

శ్రీకృష్ణుడు పాండవులఅనుమతినిపొంది, సాత్యకిమొదలైన యాదవులతో కలిసి, ద్వారకకు మరలివచ్చాడు. ఒక శుభముహూర్తాన కాళిందిని వివాహమాడి అందరికీ ఆనందంకలుగజేశాడు.

శ్రీకృష్ణునకు రాజాధిదేవి అనే మేనత్త ఉన్నది. ఆమెకు విందుడూ, అనువిందుడూ అనే కుమారులు, మిత్రవింద అనే కుమార్తె ఉన్నారు. విందానువిందులు అవంతీ పరిపాలకులై, దుర్యోధనునకు విధేయులైయున్నారు. వారు చెల్లెలికి స్వయంవరంచాటించారు. కాని ఆమె మనస్సు కృష్ణునిపైననే లగ్నమైయున్నది. అన్నలు ఆమె అభీష్టానికి అడ్డుతగిలి, అతనితో వివాహం పనికిరాదన్నారు. శ్రీకృష్ణుడు ఆమె కోరికను తెలుసుకొని, స్వయంవరంలో రాజకుమారులను ఓడించి, మిత్రవిందను తీసుకొనిపోయి వివాహం చేసుకొన్నాడు.

కోసలదేశాధిపతి అయిన నగ్నజిత్తు ధర్మపరుడు, సద్గుణ సంపన్నుడు. అతనికి సత్య అనే కుమార్తె ఉన్నది. ఆమెను నాగ్నజితి అనికూడ అంటారు. ఆ రాజు వద్ద వాడియైన కొమ్ములున్న మదించిన ఏడు వృషభ రాజాలున్నవి. వాటిని ఒక్కసారిగా తన బాహుబలంతో బంధించివేయ గలిగిన వీరాధివీరునకే తన కుమార్తెనివ్వాలని ఆ రాజు నిశ్చయించాడు. ఎందరో రాజకుమారులు ప్రయత్నించి పరాజయం పొందారు. శ్రీకృష్ణుడు అనుచరులతోను, సైన్యముతోను వచ్చాడు. కోసలరాజు అందరినీ తగురీతిని ఆదరించాడు. నాగ్నజితి కృష్ణుని చూచి ఇతడే నాకు భర్త అగుగాక అని సంకల్పించుకొన్నది. రాజు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు: "జగన్నాథా! వాసుదేవా! నారాయణా! నీ రాకచే మా గృహము, రాజ్యము పావనమైనవి. ధర్మరక్షణకు అవతరించిన ఈశ్వరుడవు నీవు. నిన్ను ఏ విధంగా సేవించి సంతుష్టుని చెయ్యాలో ఆజ్ఞాపించు" అనగా కృష్ణుడు "రాజా! నీ పుత్రికను భార్యగా స్వీకరింపదలచి వచ్చితిని" అని చెప్పాడు. అప్పుడా రాజు ఇలా అన్నాడు: "ప్రభూ! ఈ విధంగా నీ అనుగ్రహంపొందడానికి మేమెంతటి సుకృతంచేసియుంటిమో కదా! నాకుమార్తెను వివాహమాడడానికి ఈ ముల్లోకాల్లోనూ నీకంటేఘనుడెవ్వడున్నాడు? ఆ లక్ష్మీదేవియే నీ వక్షస్థలంలో స్థానం సంపాదించి ధన్యురాలయినదికదా! నా పుత్రికకు అలాంటి సౌభాగ్యం కలుగుతుంటే, నా కింకేమికావాలి? కాని ఆమె వివాహంగురించి నాయొక్క ఏడువృషభాలనులొంగదీసి బంధించగల వీరుడే వరుడు అవుతాడనే ఒక నియమం పెట్టుకొన్నాను. ఆ ప్రయత్నంలో కొంతమంది ప్రాణాలు పోగొట్టుకొన్నారు కూడాను. నీ విషయంలో నేను ఆ నియమాన్ని ఉల్లంఘించితే లోకులు నన్ను నిందించడమే కాకుండా నీయొక్క సామర్థ్యాన్ని కూడ శంకిస్తారు. అనేకమైన అద్భుతకార్యాలుచేసియున్న నీకు ఈ వృషభాలను బంధించడం ఒక కార్యమా? కష్టమా?" అని సవినయంగా మనవిచేసుకొనగా, శ్రీకృష్ణుడు సరేనని ఆ ఆబోతులను చూచాడు. పైవస్త్రాన్ని నడుముకి బిగించాడు. ఒక్కడూ ఏడుగురు అయి, ఏడు ఆబోతులను ఒక్కొక్క గుద్దుతో లొంగదీసుకొని తాళ్లుకట్టి బాలుడు ఆట బొమ్మలను లాగుకొనివచ్చినట్లుగా వాటిని ఈడ్చుకొనిరాగా ప్రేక్షకులు సంతోషించి జయజయధ్వానాలు చేశారు. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. రాజు శ్రీకృష్ణునకు సత్యనిచ్చి వైభవోపేతముగా వివాహంచేశాడు. పెండ్లికూతురుతో వేలసంఖ్యలలో దాసీలను గోవులను గుర్రాలను ఏనుగులను, రథాలను, కానుకగా ఇచ్చి పంపించాడు. వృషభాలను కట్టలేక పరాజితులైన రాజకుమారులు నాగ్నజితిని తీసుకెళ్తున్న శ్రీకృష్ణుని దారిలో అడ్డగించి ఎదిరించారు. వారినందరినీ కృష్ణుని అనుసరిస్తున్న అర్జునుడు ఓడించాడు. శ్రీకృష్ణుడు నూతన వధువుతో ద్వారకచేరి, ప్రజలపూజలనందుకొని నిజధామంలో సుఖంగా ఉండసాగాడు.

శ్రీకృష్ణుని మేనత్తలలో నొకామె శ్రుతకీర్తి. ఆమె కేకయదేశపు రాజపత్ని. ఆమె కుమార్తెయగు భద్రనుకూడ శ్రీకృష్ణుడు వివాహమాడినాడు.

మద్రదేశపు రాకుమారి లక్షణ. ఆమె రుక్మిణివలెనే శ్రీకృష్ణుని యొక్క అద్భుత చరిత్రగురించి విని, అతనినే పతిగానెన్నుకొని యున్నది. కాని తండ్రియైన బృహత్సేనునకు కృష్ణుడంటే ఇష్టమే అయినప్పటికీ, ఇతర రాజులు శత్రువులై పోతారనే భయముచేత ఒక పరీక్షపెట్టాడు. అది మత్స్యయంత్రముకంటె కొంచెము జటిలమైన పరీక్ష. అర్జునుడు తప్ప కౌరవ పాండవులతో సహా అందరు రాజకుమారులూ ప్రయత్నించి విఫలులైనారు. శ్రీకృష్ణుడు విల్లెక్కుపెట్టి, సునాయాసముగ దానిని పడగొట్టగా, రాకుమారి లక్షణ వచ్చి వరమాలను ఆయన మెడలోవేసినది. ఆమెను కృష్ణుడు రథంలో తీసుకొనివెళ్లుతుంటే, ఇతర రాజపుత్రులు అడ్డగించి ఎదిరించగా కృష్ణుడు శార్ఙ్గ ధనుస్సును చేత పట్టే సరికి వారంతా పారిపోయారు. నూతన వధువుతో వచ్చిన శ్రీకృష్ణునికి ప్రజలు స్వాగతం చెప్పారు.

రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ అనే అష్టమహిషులతో స్వామి సుఖసంసారం సాగిస్తున్నాడు. తరువాత నరకాసురుని వధించి, అతనిచే బంధింపబడిన పదహారువేలమంది రాజకన్యలను విడుదలచేయించాడు. ఆ కన్యలందరూ తమ ఇళ్లకుపోలేము, నీవే మమ్ము ఆదుకోవాలి అని వేడుకొంటే ఆకరుణామయుడు వారందరినీ ద్వారకకు పంపించి, అక్కడ వివాహం చేసుకొన్నాడు.

నరకాసురుడు

నరకాసురుడు భూదేవి పుత్రుడు. అతడు మహాబలశాలి. బలగర్వమదాంధుడై అతడు దేవమాత అయిన అదితియొక్క కుండలాలను, వరుణుని యొక్క ఛత్రాన్ని లాక్కొన్నాడు. దేవతలకు చెందిన మణిపర్వతాన్ని తన వశము చేసుకొన్నాడు. దేవతలను అనేకవిధాల వేధించసాగాడు. ఒకనాడు శ్రీకృష్ణుడు సత్యభామ భవనంలోనుండగా ఇంద్రుడు ఆర్తుడైవచ్చి, దేవతలు నరకునివలన పడుతున్న కష్టాలను ఏకరువు పెట్టాడు. దయామయుడైన శ్రీకృష్ణుడు దేవతల బాధలను బాపడానికి నరకుని దండిస్తానని అభయమిచ్చాడు.

శ్రీకృష్ణుడు గరుడారూఢుడై నరకుని రాజధానియైన ప్రాగ్జ్యోతిషపురానికి బయలుదేరడానికి సిద్ధంగా నుండగా, తననుకూడ తీసుకొనివెళ్లుమని ప్రార్థేయపడుతూ సత్యభామ ఇలా అన్నది: "దేవా! నీవు రాక్షసుల మూకను చెండాడుతుంటే నీ ప్రాపీణ్యాన్ని తిలకించాలని నాకు మిక్కిలికోరికగా నున్నది. నీ ప్రతాపాన్నిచూచి, నేనిక్కడ నా సోదరీమణులందరికీ తెలియజెపుతాను. నా కోరికను మన్నించి నీతోపాటు తీసుకొనిపోవా?" అని వేడుకొన్నది. శ్రీకృష్ణుడు మందహాసంతో ఇలా అన్నాడు: "బాలా! కుసుమకోమలసుకుమారివైన నీవెక్కడ, ఆ భయంకర రణరంగమెక్కడ? అక్కడ వినిపించేవి తుమ్మెదల ఝంకారాలు కావు, ఏనుగులఘీంకారాలు. అక్కడున్నవి రాజహంసలతోనున్న సరోవరాలు కావు రాక్షసకృత్యాలు, రక్తపు మడుగులున్నా! అక్కడ కమలాలతో ఆడుకోరు కత్తులతో పాడుచుకొంటారు. అలాంటి చోటికి నీవు వచ్చి ఏమి ఆనందించగలవు? నీవు రావద్దు. నేనే వెళ్లి కార్యంముగించుకొని, త్వరగా వచ్చేస్తాను" అని చెప్పిన కృష్ణునితో ఆమె ఇలా అన్నది: "నాథా! కోటగోడలవంటి నీ బాహువులు నాకు రక్షణగా నుండగా, రాక్షసులే కాదు, ఇంకెవ్వరు ఎదురు వచ్చినా, నాకేం భయం? నేను నీతో వస్తాను. అనుగ్రహించు." అని బ్రతిమాలినది. శ్రీకృష్ణుడు ఆమె ధైర్యానికి సంతసించి, గరుడునిపై ఆమెనెక్కించుకొని ఆకాశమార్గాన ప్రాగ్జ్యోతిషపురానికి వెళ్లాడు. దుర్గాలు, జలదుర్గాలు, అగ్నిదుర్గాలు అనబడే అయిదు ఆవరణ దుర్గాలు అమర్చబడియున్నవి. వాటిని దాటి లోనికి ప్రవేశించడం సామాన్యులకు సాధ్యపడదు. ఇవి కాకుండ మురాసురుడనే ఐదుతలల భయంకరమైన రాక్షసుడు నగరంచుట్టూ పాశాలతో అల్లివేసి నగర రక్షణ చేస్తుంటాడు. శ్రీకృష్ణుడు

తన గదతో పర్వత వలయాన్ని ఛేదించాడు. తరువాత తన ధనుస్సుతో శస్త్రాలను వమ్ముచేసి, జలదుర్గాన్ని చక్రంతో శుష్కింపజేసి, అగ్నిదుర్గాన్ని ఆర్పివేసి, వాయుదుర్గాన్ని శాంతింపజేసి, పాశదుర్గాన్ని ఛేదించివేశాడు. పాంచజన్య శంఖాన్ని పూరించగా జలగర్భంలో గాఢసుషుప్తిలోనున్న మురాసురుడు తృళ్లిపడి లేచి నీటిపైకి వచ్చి చూచాడు. వీళ్లీలోపలకు ఎలాగ రాగలిగారని ఆశ్చర్యపోయాడు. ప్రచండాగ్ని జ్వాలలను క్రక్కుతూ, ప్రపంచాన్నే మ్రింగివేసేట్లు అయిదు నోళ్లనూ తెరిచి, భయంకరంగా అరుస్తూ మంటలు క్రక్కుతున్న శూలాన్ని గరుడుని పైకి విసిరాడు. శ్రీకృష్ణుడాశూలాన్ని ఒక్క బాణంవేసి ముక్కలు చేశాడు. అసురుడు తనగదను శ్రీకృష్ణునిపైకి విసరగా కృష్ణుడు తన గదతో దానిని ముక్కలుచేశాడు. అసురుడు తన మీదకు ఉరికి పడబోతుంటే శ్రీకృష్ణుడు వాని అయిదు తలలనూ చక్రాయుధంతో ఖండించగా, వాడు చచ్చి నీటిలో పడ్డాడు. మురాసురుని ఏడుగురు కొడుకులూ శ్రీకృష్ణునితో యుద్ధానికి వచ్చారు. అందరూ స్వామి బాణాలకు ఆహుతి అయిపోయారు. సాటిలేని శక్తిమంతులైన మురాసురుడు, వాని ఏడుగురు కొడుకులూ, సేనాధిపతి అయిన పీఠుడూ హతులైనారని తెలుసుకొని, ఈ శత్రువెవడోగాని సామాన్యుడుకాడని గ్రహించి, సర్వసేనతో సిద్ధపడి వచ్చాడు నరకుడు. గరుడునిపై కూర్చున్న శ్రీకృష్ణుని, సత్యభామనూ చూచి వాళ్లెవ్వరో తెలుసుకొన్నాడు. సత్యభామకు సంగ్రామరహస్యాలను నేర్పుతున్నాడు శ్రీకృష్ణుడు. యుద్ధసన్నద్ధుడై వచ్చిన నరకాసురుని చూచి, సత్యభామ ఉత్సాహంతో జుట్టుముడి వేసుకొన్నది. చీరచెంగు నడుమునకు బిగించినది. ఆభరణాలు అడ్డుతగలకుండా సర్దుకొన్నది. రాక్షసులు ఎందరు వచ్చినా ఎదుర్కొనడానికి సిద్ధపడినది. ఆమెయొక్క రణోత్సాహాన్ని చూచి, రమణుడు ముసిముసిగా నవ్వుకొంటూ మురిసిపోతూ ఇలా అన్నాడు: "సుందరీ! నీవెందుకు యుద్ధానికి సిద్ధపడుతున్నావు? నేను ఈ రాక్షసుల్ని రూపుమాపలేనా? సరేలే! ఇదిగో, ఈ విల్లునుపట్టుకో, విజయం నిదే అవుతుంది." అని తన ధనుస్సును ఆమెకిచ్చాడు. దానిని పట్టుకొనగానే, ఆమెకు అంతులేని శక్తి వచ్చేసినది. వింటినారిని బిగించి ధనుష్టంకారం చేసినది. ఆశబ్దం ఆకాశమంతా ప్రతిధ్వనించినది. రాక్షసస్త్రీలు తమ మంగళసూత్రాలను కళ్లకద్దుకొన్నారు. ఆమె బంగారు కంకణాల ఝణఝణలతో చెవికమ్మల మణుల తళతళలతో, ఆమె స్వేదబిందువులపై మెరిసే ఇంద్రధనుస్సులతో "చూచావా నాప్రతాపం" అన్నట్టుగా తన స్వామిపైపు సంధించే క్రీగంటి చూపుల బాణాల మెరుపులతో, శరపరంపరల గమనం చేసే ఝంకార ధ్వనులతో, అది రణరంగమా సౌందర్య శోభను ప్రదర్శించే నాట్యరంగమా అనిపించినది. శౌర్యమూ, శృంగారమూ, రౌద్రమూ, విస్మయమూ, విన్యాసమూ అన్నీకలిసి మూర్తీభవించినట్లుగా, సత్యభామ బాణాలను సంధించడం లాగడం, ప్రయోగించడం అంతా మెరుపుతీగల వేగముతో నిర్వహించి యుద్ధము చెయ్యసాగినది. ఒకవైపు చెండాడే బాణాలతో శత్రువును నొప్పిస్తూ, ఇంకొకవైపు శృంగారపు చూపుల బాణాలువేస్తూ తనస్వామిని మెప్పిస్తున్నది. ఆమెధాటికి తట్టుకొనలేని అసురసైన్యము వెనుకకు తగ్గినది, నిర్జీవమయినది. శ్రీకృష్ణుడు తన ప్రియురాలియందు విజృంభించిన వీరావేశాన్ని ఉపశమింప జేయునుద్దేశముతో ఇలాగ ప్రియాలాపనం చేశాడు: "సత్యా! నీధాటికి తట్టుకొనలేక రాక్షససైన్యము పారిపోయినది. విజయలక్ష్మి నిన్ను వరించినది. నీధైర్యసాహసాలకు మిక్కిలి సంతసించాను. నీవు కోరిన ఆభరణాలను ఇస్తాను." అని చెప్పి, ధనుస్సును ఆమెచేతినుండి తీసుకొన్నాడు. అప్పుడు నరకాసురుడు హేళనగా శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు: "కృష్ణా! పురుషుల ఎదుట ఒక స్త్రీ పౌరుషం ప్రదర్శించుతుంటే, ఊరికే కూర్చోవడం ఘనతకాదు. రాక్షసవీరులు స్త్రీలతో పోరాడడానికి ఇష్టపడరు." అనగా నందనందనుడు ఇలా అన్నాడు: "ఓ అసురుడా! తొందరపడకు. నీ శిరస్సు నా శరాలకు ఆహుతి అయ్యే సమయం వచ్చినదిలెమ్ము." అని బాణాలను సంధించాడు. ఐరావతంలాంటి నాలుగు దంతాల తెల్లని ఏనుగులను నరకాసురుడు పాలసముద్రంనుండి సంపాదించి, వందల సంఖ్యలో తెచ్చి ఉంచుకొన్నాడు. వాటిని యుద్ధభూమికి తీసుకొనివచ్చాడు. వాటిని గరుత్మంతుడు ముక్కుతోనూ, గోళ్లతోనూ ఖండఖండాలుగా పీకి బలమైన తనరెక్కలతో కొట్టికొట్టి చంపాడు. చచ్చినవి చావగా మిగిలియున్నవి పారిపోయాయి.

శ్రీకృష్ణుని బాణాలకు శత్రుసైన్యమంతా నశించగా, నరకాసురుడొక్కడే మిగిలియున్నాడు. వాడు శతఘ్ని అనే శక్తిమంతమైన శూలాన్ని శ్రీకృష్ణునిపై ప్రయోగించగా, కృష్ణుడు దానిని వమ్ము చేశాడు. అసురుడు, తనశక్తిమంతమైన త్రిశూలాన్ని కృష్ణునిపై విసిరేలోగా శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని ప్రయోగించి అసురుని అంతమొందించాడు.

నరకాసురుని తల్లియైన భూదేవి వాసుదేవుని వద్దకువచ్చి, నరకుడు అపహరించుకొనిపోయిన కుండలాలను, వరుణుని ఛత్రాన్నీ మణిమయమాలను కూడ ఆయనకు సమర్పించినది.

భూదేవి స్వామిని ఇలాగస్తుతించినది: "ఓ పరమేశ్వరా! అనంతలీలావిలాసా! మహానుభావా! సకలభూతస్వరూపా! పద్మనాభా! పద్మదళనేత్రా! పద్మమాలా విభూషితా! వాసుదేవా! నీకు వందనములు. నీవు ఆదిపురుషుడవు, పుట్టుకలేని వాడవు, అయిననూ భక్తులు కోరిన రూపాలను ధరిస్తావు: బ్రహ్మాదులనూ సమస్త విశ్వాన్నీ సృష్టించినవాడవు, పరమాత్మవు: నీకు వందనములు. ఓ భక్తమందారా! దీనజనరక్షకా! ఈ బాలుడు, నీ చక్రాయుధానికి బలి అయిన నరకుని కుమారుడు, భగదత్తుడు. తండ్రివంటివాడు కాడు. నిన్నాశ్రయించినవాడు, దిక్కులేనివాడు. వీనిని అనుగ్రహింపుము." అని వేడుకొన్నది. భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు భగదత్తునకు అభయమిచ్చి, సకల సంపదలూ అనుగ్రహించాడు.

తరువాత నరకాసురుని సౌధములో ప్రవేశించి, నరకునిచే బంధింపబడిన పదహారువేలమంది రాజకన్యలను చూచాడు. శ్రీకృష్ణుని దర్శించగనే వారిచీకటి బ్రతుకులకు దివ్యజ్యోతి లభించినంత ఆనందము కలిగినది. వారందరూ సమ్మోహితలై, ఈ దివ్యసుందరమూర్తి ఎవరోగాని, ఇతడే నాకు పతి అయ్యేటట్లు అనుగ్రహించుమని, ప్రతికన్యా తన ఇష్టదైవానికి మ్రొక్కుకొన్నది. నరకాసురుడు దుష్టుడైతే అయినాడుగాని, తమను ఇలాగబంధించి తేవడంచేతనేకదా తమకు ఈ పురుషోత్తముని యొక్క దర్శనం లభించిందని వారు తమ అదృష్టానికి సంతోషించారు. వారి అందరి హృదయాలూ ఆ చిత్తచోరుని చూడగనే పట్టరాని ప్రేమతో స్పందించాయి. అతడే తన రక్షకుడు, పతీ, గతీ, సర్వస్వమూ అని ప్రతికన్యా నిశ్చయించుకొన్నది. ఆ మానినీమానసచోరుడు, మందహాసంతో అంతాగ్రహించాడు. అందరికీ చక్కని వస్త్రాలు ఆభరణాలు, సుగంధద్రవ్యాలూ పంపించి అలంకరింపజేశాడు. ఈ కన్యలలో మానవరాజకన్యలే కాకుండా అందమైన సుర, అసుర, సిద్ధ కన్యలు కూడ ఉన్నారు. అసురునిచే అపహరింపబడియున్న ఈ కన్యలను తమతలిదండ్రులుకూడ స్వీకరించరు గనుక వారు అనాథలై రక్షణలేక నశిస్తారని, వారి మనోగతాన్ని ఎరిగిన సర్వజ్ఞుడైన స్వామి, వారియోగక్షేమాలను వహించదలచినవాడై అందరినీ ద్వారకకు పంపించాడు. వారితోపాటు, ఐరావతసంతతికి చెందిన అరవైనాలుగు, నాలుగుదంతాల తెల్ల ఏనుగులను, రథాలను గుర్రాలను, ధనరాసులను పంపించాడు.

తరువాత సత్యభామతో కలిసి, శ్రీకృష్ణుడు దేవలోకంవెళ్లి, దేవమాత అయిన అదితికి నరకుడపహరించిన మణికుండలాలను తెచ్చిఇచ్చాడు. ఇంద్రుడు, శచీదేవి శ్రీకృష్ణసత్యభామలను సత్కరించారు. సత్యభామా శ్రీకృష్ణులు నందనవనం సందర్శించారు. సత్యభామ కోరికపై శ్రీకృష్ణుడు పారిజాతంమొక్కను పెకలించి తీసుకొని, గరుడుని వీపుపైనుంచాడు. శ్రీకృష్ణుడు పారిజాతంమొక్కను తీసుకొనివెళ్తున్నట్టు తెలుసుకొని, ఇంద్రుడు దేవతలతో సహావచ్చి ఎదిరించాడు, అయినా ఓడిపోయాడు. నరకాసురుని బాధలనుండి రక్షింపుమని శ్రీకృష్ణుని పాదాలపైపడిన ఇంద్రుడు తనపనినెరవేరగానే, ఆ స్వామినే ఎదిరించడానికి వెనుదీయలేదు. అతనికి స్వామి అనుగ్రహంకంటే, కోరికలను తీర్చే ఆ పారిజాతమే గొప్పదిగా అనిపించినది. అతని స్వార్థానికీ అహంకారానికీ అవధులులేవు. పారిజాతవృక్షమును తీసుకొనివెళ్లి సత్యభామ ఉద్యానవనంలో నాటించాడు శ్రీకృష్ణుడు.

నందనందనుడు ద్వారకకు తరలింపబడిన పదహారువేలమంది కన్యలందరికీ సకలసౌకర్యాలతో వేరువేరు గృహాలనేర్పాటు చేశాడు. ఒక శుభముహూర్తాన పరమేశ్వరుడైన శ్రీకృష్ణుడు పదహారువేల కృష్ణస్వరూపాలు ధరించి, పదహారువేల కన్యలనూ వారివారి గృహాలలోనే ఒకే ముహూర్తంలో శాస్త్రోక్తంగా వివాహమాడాడు. అందరికీ ఒకేలాగున కనిపించి, ఒకేలాగ లాలించి, పాలించి, ప్రేమించి, ప్రతీ ఒక్కరికీ, "కృష్ణుడు కేవలం నావాడే" అనిపింపజేసి, అపూర్వమైన అద్భుతరీతిని అందరితో సంసారాలు సాగించాడు. ఆ సుందరీమణుల భాగ్యమే భాగ్యము కదా! వేలాది సంవత్సరాల తపస్సుచేసిన యోగులకుకూడా లభించని అపూర్వసౌభాగ్యము ఈ కాంతలకు లభించినది. సాక్షాత్తూ పరమేశ్వరునియొక్క దర్శన స్పర్శన సంభాషణమే కాకుండా నిరంతర పాదసేవా భాగ్యముకూడా వాళ్లకు దక్కినది. ఎందరు పరిచారకులున్నా తమస్వామికి తామే సకలసేవలూ స్వయంగా చేసేవారు. స్వామికూడ సామాన్య గృహస్థునివలె వారితో మెలగుతూ, వారికోర్కెలను తీర్చుతూ, మాయామమతలు చూపుతూ వినోదించేవాడు. విశ్వమంతటా నిండియున్న ఆ పరమేశ్వరునకు ఈ పదహారువేలమంది కాంతలతోనూ అన్నివేళలలోనూ కలిసియుండడం అబ్బురమేమీ కాదు.

శ్రీకృష్ణుని విరసోక్తులవినోదము

ఒకనాడు శ్రీకృష్ణునకు ఒకచిన్న చిలిపి ఆలోచన వచ్చినది. రుక్మిణీదేవితో కొన్నిచలోక్తులాడి, ఆమె ఉడికిపోతుంటే వినోదించాలనుకొన్నాడు. ఆమెయొక్క అంతఃపురంలో ఆయన పాన్పుపై కూర్చొనియుండగా, ఆమె వింజామరంతో విసురుతూ సేవచేస్తున్నది. సౌందర్యవతీ, సద్గుణవతీ, సౌభాగ్యవతీ, సౌమ్యవతీ, వివేకవతీ అయిన ఆమెనుచూచి, శ్రీకృష్ణుడు చిరునవ్వుతో చమత్కారంగా ఇలా అన్నాడు: "సుందరీ! కులములోనూ, బలములోనూ, భాగ్యములోనూ అన్నింటిలోనూ శిశుపాలాదులు ఎంతో ఘనులు, నీ అన్నగారూ తలిదండ్రులూ అలాంటి శిశుపాలునకు నిన్నిచ్చి వివాహం చేద్దామనుకొంటే, ఒప్పుకొనకుండా, సముద్రగర్భంలో తలదాచుకొంటున్న పిరికివాడినైన నన్నెందుకు వివాహమాడినావు? మేము ధనహీనులము, గుణహీనులము, లోకరీతికి భిన్నమైనవారము, మాచెలిమి ఎప్పుడూ పేదలూ, దీనులతోనే, మాకు సింహాసనాలు లేవు. బలవంతులూ, ధనవంతులూ మాతో స్నేహము చెయ్యరు. ఇలాంటి విడ్డూరపు వ్యక్తినైన నన్నెందుకు నీవు వరించావు? సమానమైన వియ్యము, సమానమైన నెయ్యము చెయ్యాలంటారు కదా! మరిమనకు అలాగ కుదరలేదే! నీవు చాలా పొరపాటే చేశావు. ఇప్పుడైనా దానిని సరిదిద్దుకొనవచ్చు. నీకు అన్నివిధాలా తగినవానిని ఇప్పుడు ఎన్నుకొని, వివాహంచేసుకొనుము." అని అంటున్న స్వామిమాటలు విని, సాధుశీల, సరళస్వభావ అయిన రుక్మిణీదేవియొక్క మనస్సు గతుక్కుమన్నది. తనప్రాణనాథుడు ఇంతవరకు ఇటువంటి అప్రియవాక్యాలు ఎన్నడూ పలుకలేదు. ఇప్పుడు ఇలాగ ఎందుకు అంటున్నాడు! తనయొక్క సేవాశుశ్రూషలలో ఏమైనా లోపము జరిగినదా? అని ఆలోచిస్తూ, ఆ మానవతి అంతులేని ఆవేదనతో బాధపడినది. కన్నీటి ధారలతో వక్షస్థలం తడిసిపోయినది. ముఖం వాడిపోయినది. నిశ్చేష్ట అయి, ఆమెనేలపై ఒరిగిపోయినది.

సద్వంశసంజాత, శోకసంతప్త, సాధ్వీశిరోమణి, సహధర్మచారిణి, అయిన రుక్మిణీదేవిని శ్రీకృష్ణుడు లేవనెత్తాడు. పాన్పుపై పవ్వళింప జేశాడు. మంచిగంధము పూసాడు. పన్నీటితో కన్నులూ ముఖమూ తుడిచాడు: జుట్టు సవరించాడు. వింజామరముతో వీచాడు. మధుర వాక్కులతో బుజ్జగించాడు. మనోహరమైన చిరునవ్వుతో మత్తెకించాడు. కొంటెచూపులతో కవ్వించాడు.

శ్రీకృష్ణుడు తనప్రియపత్నియొక్క ప్రేమావేశానికి సంతసించాడు. తనయొక్క హాస్యాలాపానికి ఆమె నిజంగా చలించిపోయినందుకు జాలిపడ్డాడు ఇలా అన్నాడు: "ప్రియతమా! నీకు కోపం తెప్పించి కోపములో నీముఖం ఎలాగుంటుందో చూచి, ఆనందించాలని అలాగహాస్యమాడానుగాని నీవు ఆ మాటలను నిజంగా తీసుకొని, ఇలాగ

బాధపడతావనుకొనలేదు. పతీపత్నుల మధ్య అప్పుడప్పుడు అలాంటి ప్రణయకలహాలు వస్తుంటేనే, అనురాగం పెరుగుతుంది కదా! మరి నీవు ఇలాగ మనస్సు కష్టపెట్టుకొనడంచేత, నాకుచాలా బాధగా నున్నది." అని స్వామి, అనునయించాడు. రుక్మిణీదేవి కొంత ఊరటజెంది ఇలాగ జవాబు చెప్పినది: "స్వామీ! ఇతరులతో నీకు సామ్యము లేదనే మాట చాలా నిజము. నీ సౌందర్యము, నయనముల సోయగము ఈ ముల్లోకాలలోనూ ఎవ్వరికీ లేవుకదా! ఓ సర్వేశ్వరా! మన ఇద్దరిమధ్యా సమానవియ్యము కుదరలేదని నీవన్నమాట వాస్తమే! అనంతతేజోమూర్తివీ, సచ్చిదానందస్వరూపుడవూ, సర్వలోకేశ్వరుడవూ అయిన నీవెక్కడ, త్రిగుణాలతోకూడి శరీరంలో బంధింపబడి, జ్ఞానహీనవైయున్న నేనెక్కడ? సకలసద్గుణాలూ, సకల ఐశ్వర్యబలసంపదలూ నీలోనే నిక్షిప్తమైయున్నందున మానవమాత్రులు అదికావాలి, ఇదికావాలి అని నిన్ను చికాకు పరుస్తారని ఎవ్వరికీ అందుబాటులో లేకుండా పాలసముద్రంలో శేషతల్పముపై పవ్వళిస్తున్నావు. పరమేశ్వరా! నీవు ధనహీనుడవన్నావు. అవును. జగత్తంతా నీదే అయియుండగా, నీదికానిదేమున్నది, నీకు కావలసియున్నదేమిటి? గుణహీనుడవన్నావు. నిజమేకదా మరి! త్రిగుణాతీతుడవైన నీయందు ఏగుణముంటుంది. లోకాలన్నీ నీనుండే ఉద్భవించడం చేత నీవు లోకులకు భిన్నమైన వాడివేగాని, స్వామీ! సర్వవ్యాపకుడవైన నీనుండి భిన్నమైయున్నదేమున్నది? దీనులూ నిరుపేదలూ నీకు కావలసినవారు అన్నావు. అదికూడా సత్యమే. మరి నీవు దీనబాంధవుడవూ. అనాథనాథుడవూ కదా? బలవంతులు, ధనవంతులు, నీ చెలిమిచెయ్యరు, నిజమే! ధన, జన, బల, ఆభిజాత్య గర్వ మదాంధులైన అజ్ఞానులకు ఇంద్రియతృప్తే ఏకైక లక్ష్యము, కాని వారు సకలపురుషార్థప్రదాతవైన నిన్ను ఆశ్రయించరు. తామే సర్వశక్తిమంతులమనుకొంటారు ఆ అహంకారులు. నీకు రాజరికపు సింహాసనాలు లేవు అన్నావు. నీవు రాజాధిరాజువు. సర్వలోకమహేశ్వరుడవు. ఈక్షణమాత్రముచే రాజులనూ రాజ్యాలనూ సృష్టించగలవు, నశింపజేయగలవు. నీకు సింహాసనాలతో ఏమిపని, భక్తుల హృదయాలే నీ సింహాసనాలు కదా! సర్వమూత్యజించి, నీపాదార విందధ్యానములోనే జీవితమంతా గడిపిన యోగీంద్రులకే నీవు అగోచరుడవు. ఇక సామాన్యుల ఊహకు నీవు అందగలవా? వారు కర్మఫలాలను అనుభవిస్తూ, కర్మలుచేస్తూ, సంసార చక్రంలో పరిభ్రమిస్తుంటారు. ఇక నావిషయం చెపుతాను: చిన్నప్పటి నుండీ నామనస్సు నీయందేలగ్నమైయున్నది. నేను నీకోసమే జన్మించానని నాదృఢవిశ్వాసము. శివుడు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలుకూడ, నాదృష్టిని ఆకర్షించలేకపోయారు. ఇక ఈ దురహంకారులైన మానవాధీశులకు నా హృదయంలో చోటెలాగుంటుంది? నీయొక్క పాదపద్మాల సౌభాగ్యమెట్టిదో నాకు తెలుసు. రాజాధిరాజులూ, రాజర్షులూ తమ సమస్త రాజ్యసంపదలనూ త్యజించి, ఆహారనిద్రలుమాని, సతతమూ ధ్యానించే ఆపాదపద్మాలను నేను స్వయంగా పూజించి, సేవించే భాగ్యాన్ని కాదని క్షుద్రమైన రాజరికపు సుఖసంపదలను కోరుకొంటానా?" అనిచెప్పిన రుక్మిణి వాక్కులకు శ్రీకృష్ణుడు సంతోషించి, ఇలా అన్నాడు:

"దేవీ! రుక్మిణీ! నీకు నాయందున్న ప్రేమగురించి నాకుతెలియదా? నేను పరిహాసానికి అన్న మాటలకు నీవింతగా మనస్సుకష్టపెట్టుకొంటావనుకొనలేదు. వేటలోను, దెబ్బలాటలోను, రతిక్రీడలోను ఇలాంటి చమత్కారపు మాటలు వస్తాయి. వాటిని పట్టించుకొనరాదు. చిన్నచిన్న అలుకలు, హాస్యాలు, మురిపాలు, విదిలింపులు, వలపులు, దాంపత్య జీవితాన్ని ఉత్తేజపరుస్తాయి కదా! నీవు మహాపతివ్రతవు, సుశీలవు, బాల్యమునుండీ అన్యచింతలేకుండా నా సేవలోనే ఉన్నావు. అన్నీతెలిసీ, నిన్ను బాధపెట్టాను. నన్ను మన్నించు. నీమాటలు నాకు శ్రవణానందం కలిగించాయి. నీవు కోరినవన్నీ నాయందేఉన్నవి. అవిఅన్నీ నీకు లభిస్తాయి. నీ పాతివ్రత్యమూ, నీకు నాయందున్న ప్రేమానురాగాలు స్పష్టమయ్యాయి. నా విరసోక్తులకు నీమనస్సు విరక్తిచెందలేదు సరికదా, నీప్రేమ ఇంకా దృఢమవుతుంది. నాగురించి నీవు చెప్పిన వాక్కులన్నీ నిజమే, అయినప్పటికీ నేను మాత్రము, నీ అందరితోనూ, అతిసామాన్యమైన గృహస్థునిలాగ ప్రవర్తిస్తాను. నీపైనాకు ప్రత్యేకమైన అనురాగం ఉన్నది. అది నీ సౌభాగ్యము, మోక్షప్రదాతనైన నన్ను కామవాంఛలతో

పొందాలని కొందరు అల్పబుద్ధులు పూజలు, వ్రతాలు, తపస్సులు చేస్తుంటారు. వారి వాంఛలు తీరవచ్చునేమోగాని వారియొక్క ఇంద్రియలోలత్వము వారిని నానుండి దూరముచేసి, నరకమువైపుకు తీసుకుపోతుంది. ఇంద్రియలోలురు నన్ను పొందలేరు. మానవతీ! నీతో సమానమైన కాంతారత్నము ఎక్కడాలేదు. నీయొక్క సద్గుణాలు నన్ను ముగ్ధుని చేసినవి." అని చెప్పిన శ్రీకాంతుని చూచి, ప్రఫుల్ల వదనంతో ఆమెవందన మాచరించినది. ఆమె జన్మధన్యతగాంచినది.

శ్రీకృష్ణుడు రుక్మిణీ దేవితో ఉద్యానవనాల్లో విహరిస్తూ ఆమెకు సకలసౌఖ్యాలూ చేకూర్చాడు. వారికి ప్రద్యుమ్నుడు మొదలైన పదిమంది పుత్రులు, చారుమతి అనే పుత్రిక కలిగారు. మిగిలిన ఏడుగురు భార్యలకుకూడ ఒక్కొక్కరికీ పదేసిమంది పుత్రులను, ఒక్కొక్క పుత్రికను స్వామి ప్రసాదించాడు. అలాగే పదహారువేలమంది ఇతర భార్యలకుకూడ ఒక్కొక్కరికీ పదేసిమంది పుత్రులను, ఒక్కొక్క పుత్రికను, అనుగ్రహించాడు. ఈ ఒక లక్ష అరవైవేల ఎనభై మంది పుత్రులకూ పుత్రులు కలిగారు. ఈ విధంగా శ్రీకృష్ణుని వంశము, తామరతంపరగా కోట్లసంఖ్యలో అభివృద్ధి చెందినది. వీళ్లందరూ, యాదవ, వృష్ణి, భోజ, అంధక మొదలైన నూట ఒక్క తెగలుగా వర్ధిల్లారు.

అనిరుద్ధుడు

రుక్మి తన ముద్దుల కుమార్తెయైన రుక్మవతియొక్క స్వయంవరం ఏర్పాటు చేశాడు. రుక్మిణి పుత్రుడైన ప్రద్యుమ్నుడు మేనమామ ఇంటికి వెళ్లాడు. స్వయంవరానికి ప్రసిద్ధులైన రాజకుమారులందరూ వచ్చారు. రుక్మవతి మన్మథుడే అయిన ప్రద్యుమ్నుని వరించినది. శ్రీకృష్ణుని యందుండే ద్వేషమువలన రుక్మికి ఇదినచ్చలేదు. అడ్డుపెట్టడానికి ప్రయత్నించాడు. పరిస్థితిని గ్రహించిన ప్రద్యుమ్నుడు రుక్మవతిని తోడుకొని, ఎదిరించిన రాజకుమారులను ఓడించి, ద్వారకా నగరానికి వెళ్లిపోయాడు. అక్కడ వివాహము అతివైభవోపేతముగా జరిపింపబడినది. రుక్మి తన చెల్లెలు అయిన రుక్మిణియందున్న ప్రేమచేత కుమార్తె రుక్మవతి యందున్న మమకారంచేత ఎలాగో సమాధానపడ్డాడు. వారిద్దరి సంతోషమే తన సంతోషంగా భావించాడు. రుక్మిణి కుమార్తెయైన చారుమతిని కృతవర్మ కుమారుడైన విశాలాక్షుడు (బలి) వివాహమాడినాడు.

రుక్మి క్రమంగా శ్రీకృష్ణుని యందున్న ద్వేషాన్ని మరచిపోసాగెను. రుక్మవతీ ప్రద్యుమ్నులకు అనిరుద్ధుడనే పుత్రుడు జన్మించాడు. అతడు తండ్రివలె సుందరరూపుడు. రుక్మియొక్క మనుమరాలు (పుత్రుని పుత్రిక) అయిన రోచన (రుక్మలోచన)ను అనిరుద్ధునకిచ్చి, రుక్మి తన రాజధానియైన భోజకటకములో వివాహము చేశాడు. ఆ వివాహసందర్భంలో రుక్మిణీ కృష్ణులు, బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలైన బంధుజనులు వచ్చియున్నారు. వివాహవేడుకల్లో అందరూ ఆనందంగా పాల్గొన్నారు. వివాహానికి వచ్చిన ఇతర రాజులుకూడ ఆనందించారు. కాని జోరుగా పెరుగుతున్న యాదవుల కీర్తి, శక్తి, ఐశ్వర్యాలను చూచి ఓర్వలేని రాజులు కొందరున్నారు. వారిలో కళింగరాజొకడు. అతడు రుక్మితో ఇలా అన్నాడు:

"రాజా! కొత్తగా ఏర్పడిన ఈ బంధుత్వాల మమకారాల్లోబడి, ఈ యాదవుల చేతిలో నీకు లోగడ జరిగిన అవమానాన్ని దిగమ్రింగివేశావా? ప్రతీకారం చెయ్యాలంటే ఇదే తగిన సమయం. బలరామునకు జూదమంటే ప్రీతి, కాని ఆటలో నేర్పరితనం మాత్రము లేదు. నీకే విజయం తథ్యము." అని పురికొల్పాడు. రుక్మిలో అణగియున్న అహంకారం బుసలుకొడుతూ లేచినది. కక్ష, కుటిలత్వమూ విజృంభించాయి. అతడు వివేకాన్ని కోల్పోయి మూఢుడై, బలరాముని జూదానికి రమ్మన్నాడు. జూదం మొదలైనది. ఆటసాగుతున్న కొద్దీ పట్టుదలలు పెరిగినవి. పందెములు కూడ పెరిగినవి. ప్రతి ఆటలోనూ బలరాముడే ఓడిపోతుంటే, కళింగరాజు రాజాలందరిమధ్యా, ఎగతాళిచేస్తూ పళ్లికిలించడం, అందరూ నవ్వడం, జరుగుతున్నది. బలరామునికి రోషము వచ్చేసి, ఒక లక్ష బంగారు నాణాలకు

పందెము కట్టాడు. ఈ సారి రుక్మిఓడిపోయినా, అతడు ఓటమిని ఒప్పుకొనకుండా తగువుపెట్టాడు. బలరాముడు, ప్రేక్షకులైన రాజులను నిజంచెప్పుడని కోరినాడు. వాళ్లంతా రుక్మికి భయపడి, పక్షపాతబుద్ధితో నిజంచెప్పకుండా ఊరుకొన్నారు. క్రోధావేశపరుడైన బలరాముడు మళ్లీ ఆడుదామన్నాడు. ఈ సారికూడ గెలుపు బలరామునిదే అయినది. "ఇప్పుడు చెప్పండి గెలుపెవ్వరిదో" అని అడిగాడు బలరాముడు. "గెలుపునాదే" అని మొండిగా రుక్మి అన్నాడు. ప్రేక్షకులెవ్వరూ మాట్లాడలేదు. అప్పుడు ఈ అన్యాయానికి స్పందించి, ఆకాశవాణి ఇలాగ వినిపింపజేసినది. "ఈ ఆటలోకూడ గెలుపు బలరామునిదే, రుక్మి రెండుసార్లూ ఓడిపోయాడు" అని వినిపించినా, "అశరీరీవాణిని నేను నమ్మను, గెలుపునాదే" అని మొండికెత్తి దుష్టుల ప్రేరేపణచే ఇలాగ వాగాడు రుక్మి:

"ముమ్మాటికీ గెలుపునాదే. జూదము రాజులు ఆడుకొనే ఆట. గోవులను తోలుకొనే గొల్లలకు ఈ ఆటలో నైపుణ్యం ఎక్కడినుండి వస్తుంది? రాజులతో ఆడి, గొల్లలు గెలిచామని అరిచినా చెల్లదు." అని దర్పముతో వదిరేసరికి అక్కడున్న రాజులందరూ హేళనగా నవ్వగానే బలరామునికి పట్టరాని ఆగ్రహం వచ్చేసినది. అక్కడే చేతికిదొరికిన ఒక ఇనుప గుదియను పట్టుకొని రుక్మిని చావబాదినాడు. తరువాత, పళ్లికిలించి అవహేళనచేసిన కళింగరాజుయొక్క పండ్లూడగొట్టాడు. మిగిలిన రాజులందరూ ప్రాణభయంతో పారిపోయారు. అంతా సాక్షివలె నిర్లిప్తతతో తిలకిస్తున్న శ్రీకృష్ణుడు, మౌనంగా ఉండిపోయాడు. తరువాత నూతనవధూవరులను తీసుకొని, రుక్మిణీ బలరామాదులతోపాటు, ద్వారకానగరము చేరుకొన్నాడు.

ఉషాసుందరి

బలిచక్రవర్తి యొక్క నూర్గురు కుమారులలో పెద్దవాడు బాణుడు. అతడు కీర్తిమంతుడు, ధీమంతుడు, సత్యసంధుడు, ఉదారుడు, దీక్షగలవాడు. దేవతలను వశపరచుకొన్నవాడు. అతనికి వెయ్యిచేతులున్నాయి. వాటితో నతడు ఐదువందల వాయిద్యాలను వాయిస్తూ నటరాజుని మెప్పించేవాడు. పరమశివుడు బాణుని భక్తికిమెచ్చి, వాని రాజధానీనగరమైన శోణితమునకు రక్షకునిగా నుండడానికి సమ్మతించాడు. పార్వతీసమేతుడై భూతగణాలతోసహా శోణపురములో బాణుని కోటగుమ్మం వద్ద కాపలా ఉన్నాడు భోలాశంకరుడు. ఒకనాడు బాణాసురుడు తన భుజబలమదము అతిశయించగా, పరమశివుని ఇలాగ స్తుతించాడు:

సీ॥ దేవ! జగన్నాథ! దేవేంద్ర వందిత విమలచారిత్ర సంతతపవిత్ర
హాలాహలాహార! యహిరాజకేయూర బాలేందుభూష సద్భక్తపోష!
సర్వలోకాతీత! సద్గుణసంఘాత పార్వతీహృదయేశ భవవినాశ!
రజతాచలస్థాన! గజచర్మపరిధాన! సురవైరివిధ్వస్త! శూలహస్త!
తే॥ లోకనాయక! సద్భక్తలోకవరద సురుచిరాకార మునిజనస్తుతవిహార
భక్తజనమందిరాంగణపారిజాత నిన్నునెవ్వడు నుతిచేయ నేర్చునభవ! 320

ఓ దేవదేవా! నీవు జగన్నాథుడవు, దేవేంద్రవందితుడవు, పరిశుద్ధచరిత్రుడవు, పరమపవిత్రుడవు, హాలాహలహారుడవు, నాగభూషణుడవు, చంద్రశేఖరుడవు, భక్తసంరక్షకుడవు, సర్వలోకేశ్వరుడవు, పార్వతీవల్లభుడవు, కైలాసవాసుడవు, గజచర్మధారివి, రాక్షసాంతకుడవు, త్రిశూలధారివి, భక్తజనులవాకిట పారిజాతానివి. అటువంటి నిన్ను ఎవడు స్తుతించగలడు పరమేశ్వరా! ఈ భూమండలంలో నన్ను ఎదిరించగల వీరుడు ఒక్కడైనను కనిపించలేదు స్వామీ! నీవు ప్రసాదించిన ఈ వెయ్యిచేతులూ పనిలేక రణకండూతితో నన్ను చికాకు పఱుస్తున్నవి. భీకరమైన యుద్ధరంగములో తమప్రతాపాన్ని ప్రదర్శింపలేని ఈ చేతులు బరువుచేటేగాని నాకెందుకు? ఈ ప్రపంచంలో

నీవు తప్ప నన్ను ఎదిరించి పోరగల వారెవ్వరూలేరు గనుక నీవే నాతో యుద్ధముచేసి, నా కోర్కెను తీర్చాలి." అని చెప్పిన మాటలకు శంకరుడు అసహ్యించుకొని ఇలా అన్నాడు: "ఓయీ దానవేశ్వరా! తొందరపడకు. నీ కోరికతీరగల సమయం త్వరలోనే రానున్నది. నీ ధ్వజము అకారణంగా నేలపై పడిపోయినప్పుడు నాతో సముడైన ఒక వీరునితో నీకు యుద్ధము జరుగుతుందిలే." అనగా విని, బాణుడు తనకోరిక తీరనున్నదని సంతోషించాడు.

బాణాసురునకు ఉష అనే ఒక ముద్దుల కూతురున్నది. ఆమె అతిలోక సౌందర్యవతి, సద్గుణవతి. ఒకనాడు ఆమె స్వప్నంలో త్రిలోక సుందర విగ్రహుడైన ఒక యువకునితో సుఖించినట్లు కలగన్నది. అతడెవ్వడోగాని, అతని గురించి ఎన్నడూ వినియుండనైనా లేదు. ఆ క్షణంనుండి ఆమె ఆ స్వప్నసుందరునియందే మనస్సు నిలుపుకొని, ఇతర ప్రపంచాన్ని విస్మరించినది. విరహవేదనతో మథనపడేది. ఏకాంతంగా కూర్చొని కన్నీరు కార్చేది. దిక్కులుచూచేది. స్వప్నంలోని అనుభూతులను స్మరించుకొంటూ, పిచ్చివ్వులు నవ్వేది.

బాణాసురుని మంత్రి కుంభాండుడు. అతనికుమార్తె చిత్రలేఖ. ఆమె ఉషాబాలకు అతిప్రియమైన చెలికత్తె. ఆమె ఉషాసుందరియొక్క చేష్టలన్నీ కనిపెట్టి, తప్పకుండా ఆమె ప్రేమరోగపీడిత అయినదని గ్రహించి, ఆమెను ఏకాంతంగా కలుసుకొని, ఆమెయొక్క స్వప్నశృంగారం గురించి తెలుసుకొన్నది. చిత్రలేఖ సౌందర్యవతియే కాకుండా అసమాన ప్రజ్ఞగల చిత్రలేఖిని కూడాను. అనేక యోగశక్తులు గల శక్తిశాలిని కూడాను. తన నెచ్చెలి బాధను నివారించదలచుకొని, ఆమెతో ఇలా అన్నది:

"ప్రియసఖీ! నీ బాధనాకు అర్థమయినది. స్వప్నంలో నిన్ను అంతగా అలరింపజేసిన ఆ మోహనాంగుడెవ్వడో తెలుసుకొనడానికి నాకు ఒక ఉపాయం తట్టినది. నా చిత్రలేఖా నైపుణ్యముతో, శక్తిసామర్థ్యాలతో, ముల్లోకాల్లోనున్న దేవ, మానవ, యక్ష, రాక్షస, కిన్నర మొదలైన జాతులలోని సుందర పురుషులందరి రూపాలను చిత్రించి నీకు చూపుతాను. నీ స్వప్నసుందరుడు వాస్తవంగా ఉండియుంటే, ఆ చిత్రాలనుచూచి నీవు గుర్తించగలవు. నీ మనోహరుడు ఎక్కడున్నా సరే నేను అతనిని నీ చెంతకు తీసుకొనివస్తాను. విచారించకు." అని అభయమిచ్చినది. ముల్లోకాల్లోనూ ప్రసిద్ధిగాంచిన సుందర విగ్రహుల చిత్రపటాలను చిత్రించ నారంభించినది. చిత్రలేఖనం పూర్తిచేసి, అందరి గోత్రనామాలను వ్రాసి, తీసుకొనివచ్చినది. ఒక్కొక్క చిత్రాన్నీ చూపిస్తూ ఆ వ్యక్తియొక్క చరిత్ర, గుణగణాలను వర్ణించిచెప్పినది. భూలోకంలోని అనేకమంది రాజులు, రాజపుత్రుల చిత్రాలను చూపించినది. ప్రద్యుమ్నుని చిత్రంచూస్తుండగా ఆమెచూపు నిలిచిపోయినది. అయినా ఆమె సంశయించినది. ఆ తరువాత చిత్రలేఖ అనిరుద్ధుని పటము చూపించగా, ఆమె సంభ్రమాశ్చర్యాలతో ఇలా అన్నది: "ఆఁ ఆఁ ఇతడే నా మానసచోరుడు. ఇతడెవరో వివరించి చెప్పు" అని ఉషాకన్య తొందరపెట్టినది. చిత్రలేఖ ఇలా చెప్పినది: "ఇతడు అనిరుద్ధుడు. ఇతడు యాదవవంశచంద్రుడైన శ్రీకృష్ణునియొక్క పుత్రుడైన ప్రద్యుమ్నుని కుమారుడు." అనిచెప్పి, మాట ఇచ్చిన ప్రకారం ఆ యువకుని తీసుకొని రావడానికి ఆకాశమార్గాన వెళ్లినది చిత్రలేఖ. వైకుంఠానికి మించిన శోభతో వెలిగిపోతున్న ద్వారకా నగరాన్ని చూచి, ఆమె ఆశ్చర్యపోయినది. అంతఃపురంలో ప్రవేశించి, గాఢనిద్రలో మునిగియున్న అనిరుద్ధుని తన యోగమహిమచే తీసుకొనిపోయి, శోణపురంలో ఉషాసుందరి యొక్కపాన్పుపై పరుండబెట్టి, తన నెచ్చెలితో ఇలా అన్నది: "ప్రాణసఖీ! ఇతడే నీ మనోహరుడు, మన్మథపుత్రుడైన అనిరుద్ధుడు, అసమానశూరుడు. ఇతనితో నీవు సర్వసుఖాలనూ అనుభవించవచ్చు." అని చెప్పిన చిత్రలేఖను చూస్తూ, ఆమె ఆనందం పట్టలేక, నోటమాటరాక, తన ప్రియతమ చెలికత్తెకు ఎలాగ కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియక, ఇలా అన్నది: "చెలీ! నా కలలో కనిపించిన సుందరుని నీ ఊహతో చిత్రించి చూపి, తృటిలో అతనిని నా వద్దకు తీసుకురాగలిగిన శక్తిమంతురాలు ఈ ముల్లోకాల్లో నెక్కడైనా ఉన్నదా? నీ స్నేహాన్ని పొందగలగడం నా యొక్క పూర్వజన్మల సుకృతమేకదా!" అని వేనోళ్ల పొగిడినది.

పురుషుని ఛాయకూడ ప్రవేశించలేని ఆ అంతఃపురములో ఉషా-అనిరుద్ధులు అంతులేని ఆనందంలో తేలియాడుతున్నారు. వారికి పగలూ రాత్రిగాని, రోజులూ వారాలూ నెలలుగా మారుతున్న కాలగమనంగానీ ఏమీతెలియటంలేదు. ఉషాసుందరికి గర్భిణిచిహ్నాలు కనిపించడంతో హడలిపోయిన అంతఃపురపరిచారికలు బాణాసురునికి తెలియజేశారు. అసురేంద్రుడు ఆగ్రహోదగ్రుడై, కళ్లనుండి నిప్పులు కురిపిస్తూ ఖడ్గాన్నిధరించి, అంతఃపురంలో ప్రవేశించాడు. అక్కడ అపరమన్మథునిలాగ మెరిసిపోతూ ఉషాబాలతో ఆడుకొంటున్న అనిరుద్ధుని చూచి మండిపడ్డాడు. "ఈ మానవాధమునిి బంధించండి" అని భటులను ఆజ్ఞాపించాడు. వాళ్లు బంధించడానికి సమీపించగానే ఇనుపగుదియలాంటి (పరిఘ అనబడే) ఆయుధముతో వాళ్లను ఎదుర్కొని, కొందరి కాళ్లూ, కొందరినడుములూ విరగ్గొట్టి, కొందరిని చావగొట్టి, అందరినీ పారద్రోలినాడు అనిరుద్ధుడు. బాణాసురుడు అనిరుద్ధునిపైకి దూకి భీకరయుద్ధంచేసి, అతనిని జయించడం కష్టమనుకొని, నాగపాశంతో బంధించాడు. సరిగ్గా అదే సమయానికి సుడిగాలివీచి, బాణాసురుని కోటపైనున్న జెండా నేలకూలినది. తనతో యుద్ధము చేయగల సమఉజ్జీ అయిన వీరుడు త్వరలో రానున్నాడని గ్రహించిన బాణాసురుడు సంతసించాడు.

ద్వారకానగరంలో అనిరుద్ధుడు అంతర్ధానమైనందుకు అందరూ విచారసాగరంలో మునిగియున్నారు. ఎంత వెదకించినా ఆ చూకీ ఏమీ తెలియలేదు. నాలుగు నెలలు గడిచిపోయాయి. ఒకనాడు నారదుడు ద్వారకకువచ్చి అనిరుద్ధుని వృత్తాంతం తెలియజేశాడు. శ్రీకృష్ణుడు బాణాసురునిపై దండయాత్రకు పన్నెండు అక్షౌహిణుల సైన్యంతో బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నాది యాదవ వీరులతో సహా బయలుదేరాడు. వాళ్లందరూ శోణపురం ప్రవేశించారు. యాదవులు శోణపురంలోని సౌధాలు, ప్రాకారాలు, కోటలూ, అగడ్తలు, యంత్రాలు అన్నీ నాశనంచేశారు. బాణాసురుడు వెయ్యిచేతులలోనూ తళతళమెరిసే ఆయుధాలను ధరించి, మేరుపర్వతంలాంటి ఎత్తైన రథాన్నెక్కి, రెండువైపులా రాక్షససైన్యాలు నడుస్తుండగా యుద్ధరంగానికి బయలుదేరాడు.

భక్తవత్సలుడైన శివుడు బాణుని పక్షములో యుద్ధము చెయ్యడానికి, నందివాహనుడై, ప్రమథగణాలతోసహా వచ్చాడు. ఇరుపక్షాలవాళ్లూ ద్వంద్వయుద్ధాలకు తలపడ్డారు. ఈ యుద్ధాన్ని తిలకించడానికి బ్రహ్మాదిదేవతలూ, మునులూ, సిద్ధులూ మొదలైన వారంతా విమానాలపై ఆకాశంలో గుమిగూడారు. శివ, కేశవులూ, కుమార, ప్రద్యుమ్నులూ, కూపకర్ణ కుంభాండకులతో బలరాముడూ, బలునితో సాంబుడు, బాణునితో సాత్యకీ తలబడ్డారు. అలాగే రథికులతో రథికులు, ఆశ్వికులతో ఆశ్వికులు, పదాతులతో పదాతులూ, ఘోరయుద్ధము చేశారు. శ్రీకృష్ణుడు శార్ఙ్గమును ప్రయోగించి, శివునియొక్క భూతపిశాచ గణాలను తరిమివేశాడు. శివుడు పాశుపతాస్త్రాన్ని ప్రయోగిస్తే, శ్రీకృష్ణుడు నారాయణాస్త్రాన్ని వేసి, దానిని వ్యర్థం చేశాడు. శ్రీకృష్ణుడు, శివునిపై జృంభణాస్త్రం వేసి భ్రమింపజేశాడు. ప్రద్యుమ్నుని బాణాలకు కుమారస్వామి తట్టుకోలేక పారిపోయాడు. బలరాముని దెబ్బలకు భయపడి, కుంభాండ కూపకర్ణులు పారిపోయారు. సాత్యకితో యుద్ధంచేస్తున్న బాణుడు, శ్రీకృష్ణుని ఎదిరింపబూనుకొన్నాడు. తనయొక్క వెయ్యిచేతులతో ఐదువందల బాణాలను ఒక్కసారిగా విడిచిపెట్టగా, వాటిని శ్రీకృష్ణుడు ఖండించి, బాణుని రథాన్నీ సారథిని, గుర్రాలను పడగొట్టాడు. బాణుని తల్లియైన కోటర దిగంబరగా జుట్టువిరబోసుకొని, తన పుత్రుని చంపవద్దని శ్రీకృష్ణుని కోరడానికి వచ్చినది. నగ్నస్త్రీని చూడడానికి ఇష్టపడని శ్రీకృష్ణుడు ముఖము త్రిప్పుకొన్నాడు. ఇదే అదను అనుకొని, బాణుడు కోటలోనికి పారిపోయాడు. భూతగణాలూ పారిపోయాయి. శ్రీకృష్ణుని జృంభణాస్త్రంనుండి తేరుకొన్న శివుడు, "జ్వర" మనే శక్తిని కృష్ణునిపైకి ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు, "వైష్ణవజ్వరం" అనే శక్తిని ప్రయోగించగా శివజ్వరం శ్రీకృష్ణుని శరణుజొచ్చినది. బాణాసురుడు శక్తిపుంజుకొని, ఆయుధాలు ధరించి, మళ్లీ యుద్ధానికి వచ్చాడు. శ్రీకృష్ణునిపై పరిఘమనే అస్త్రాన్ని ప్రయోగించగా శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని ప్రయోగించాడు. తిరుగులేని సుదర్శనము

బాణుని వెయ్యి బాహువులను ఖండింపసాగినది. భక్తవశంకరుడైన శంకరుడు బాణుని రక్షింపదలచి, శ్రీకృష్ణుని స్తుతించాడు: "దేవదేవా! నీవు పరబ్రహ్మవు, జ్యోతిర్మయుడవు, వేదాంతనిగూఢుడవు. నిర్మలుడవు, సర్వసముడవు. సర్వవ్యాపకుడవు, జగద్రక్షణకొరకు అవతరించువాడవు, ఆద్యుడవు, అద్వితీయుడవు, అనంతుడవు, పురాణపురుషుడవు, సకల సృష్టికీ కారణుడవు, ఈశ్వరుడవు, గుణాతీతుడవు, మాయాతీతుడవు, అవ్యయుడవు, అచ్యుతుడవు, విశ్వంభరుడవు, నీకు నా వందనములు." అని స్తుతించిన శివునిపై శ్రీహరి ప్రసన్నుడై ఇలా అంటాడు: "పరమశివా! నీ వాక్కులు నాకు సంతోషం కలిగించినవి. నీ మనోగతం నాకు తెలుసు. ఈ బాణుడు నాచే చంపదగినవాడుకాడు. ఏలనన "నీ వంశస్థులను నేను సంహరించను" అని నేను ప్రహ్లాదునికి వరమిచ్చాను. ఇతడు ఆ వంశస్థుడే గనుక నాచే చంపబడడుగాని ఇతని భుజబల గర్వాన్ని అణచాలిఅని, నాలుగు చేతులను మాత్రమే ఉంచి, మిగిలిన బాహువులను ఖండింపజేశాను. ఇతడు నీ భక్తులలో ప్రముఖుడై, జరామరణ భయాలు లేకుండా జీవిస్తాడు." అని అనుగ్రహించాడు. శివుడు పరమానందభరితుడయ్యాడు. బాణాసురుని భుజబలగర్వం అణిగిపోయినది. అహంకారం తొలగిపోగానే అజ్ఞానం నశించినది. అతడు గోవిందుని పాదారవిందాలకు అభివందనాలు చేశాడు.

తరువాత బాణాసురుడు పరమానందముతో, ఉషా-అనిరుద్ధులకు అనేక కానుకలిచ్చి, దాసదాసీజనాలనిచ్చి, బంగారురథముపైనెక్కించి, మిక్కిలి వైభవోపేతముగా తీసుకొనివచ్చి వారిని శ్రీకృష్ణునకు అప్పగించాడు. యాదవులను సగౌరవముగ ఆదరించాడు. బాణుని యందుకలిగిన పరివర్తనకు, అతని సత్ప్రవర్తనకు శ్రీకృష్ణుడు సంతృప్తిజెందాడు. ఉషా అనిరుద్ధులను చూచి శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు మొదలైన వారందరూ మిక్కిలి సంతోషించారు. పిమ్మట అందరూ ద్వారకా నగరానికి తరలివెళ్లారు. అని శ్రీశుకుడు, పరీక్షిత్తుకు చెప్పాడు.

నృగమహారాజు

ఒకనాడు శ్రీకృష్ణపుత్రులైన ప్రద్యుమ్న, సాంబ, గదాదులూ ఇతర యాదవయువకులూ ఉపవనంలో చాలాసేపు విహరించి, అలసిపోయి, నీటిగురించి వెదకివెదకి ఒకనూతి వద్దకు వచ్చారు. నూతిలోనికి చూడగా, దానినిండుగా పర్వతాకారంలో నున్న ఒక ఊసరవిల్లి (పెద్దతొండ) పడియున్నది. దానిని బైటకుతీసి రక్షించాలని ఈ యువకులందరూ పెద్దపెద్దతాళ్లూ వలలూ తెచ్చి ఎంతప్రయత్నించినా బైటకు లాగలేకపోయారు. ఈ వింతను శ్రీకృష్ణునకు తెలియజేశారు. శ్రీకృష్ణుడు సభలోనున్న సామంతులూ, ప్రజలూవెంటరాగా, ఆపాడుపడిన నూతి వద్దకు వెళ్లిచూచాడు. గడ్డిపరకను తీసిపారవేసినంత సులువుగా, తన ఎడమచేత్తో, పర్వతంలాగ ఉన్న ఆ తొండను తీసి బైటపడవేశాడు. అందరూ చూస్తుండగా, ఆ ఊసరవిల్లి, బంగారు శోభతో ఒక దివ్యపురుషునిగా మారినది. ఆ పురుషునిచూచి శ్రీకృష్ణుడు ఇలా అడిగాడు: "ఓ పుణ్యాత్ముడా! నీవెవరివోగాని మహాత్ముని లాగనున్నావు. మరినీకు ఈ ఊసరవెల్లి రూపమెలాగ వచ్చినదో తెలుసుకోవాలని ఉన్నది. వీలైతే చెప్పు." అని కోరగానే ఆ పురుషుడు, పురుషోత్తముని పాదాలకు తన కిరీటమణులు స్పృశించగా నమస్కరించి, ఇలా చెప్పాడు: "ఓ విశ్వవంద్యా! ఈ విశ్వములో నీకు తెలియని విషయమేదైనా ఉంటుందా? అయినా, అనతిచ్చావు గనుక, ఇతరులు కూడ తెలుసుకోవాలని విన్నవిస్తున్నాను. నేను ఇక్ష్వాకుమహారాజాయొక్క పుత్రుడనైన నృగుడను. అనేకులైన రాజులు నాకు సామంతులైయుండగా రాజ్యము చేశాను. ఇప్పుడు నేను చెప్పబోవు విషయాలు నన్నునేను గొప్పగా పొగడుకొంటున్నట్టుంటాయి, కాని అవి అన్నీ యథార్థాలు. నా చరిత్రకు సంబంధించిన సత్యాలను తెలియజేయాలని చెపుతున్నాను. నేను లెక్కలేనన్ని దానధర్మాలు చేసేవాడను. దీనజనుల సహాయార్థమై అనేకమైన ధార్మికకర్మలు చేయించేవాడను. తారలను లెక్కించవచ్చునేమోగాని, నేను బ్రాహ్మణులకు దానమిచ్చిన గోవులసంఖ్యను లెక్కించడం

పూర్తిగాదు. న్యాయార్జితమైన ధనముతోనే గోదాన, భూదాన, స్వర్ణదాన, గృహదాన, విద్యాదాన, కన్యాదానాది అనేకమైన దానాలుచేశాను. లోకులగురించి నీటి వసతులు ఏర్పరిచాను. ఆ రోజుల్లో దాతలగురించి ప్రస్తావించేటప్పుడు, నాపేరునే మొట్టమొదట చెప్పేవారట.

ఒకరోజు ఒక విశేషం జరిగినది. ఇద్దరు బ్రాహ్మణులు తగువులాడుకొని, ఒక గోవుతో నా వద్దకు వచ్చారు. కశ్యపుడనే విప్రుడు తనగోవును రెండవ బ్రాహ్మణుడు తోలుకొనిపోతున్నట్లు అభియోగంచేశాడు. కాని ఆ రెండవ బ్రాహ్మణుడు ఆగోవు తనకు రాజుగారిచే దానమివ్వబడినది గనుక తనదేనని చెప్పుకొన్నాడు. ఈ విషయాన్ని తరచి పరిశీలించగా, తెలిసినదేమిటంటే - నేను, మొదట కశ్యపునకు దానమిచ్చిన గోవులలో నొకటి తప్పించుకొని వచ్చి మామందలో కలిసిపోయినది. మళ్లీ రెండవ బ్రాహ్మణునికి దానమివ్వబడిన గోవులతో కలిసిపోవడంచేత రెండవసారి దానమివ్వబడినది. తెలియక జరిగిన ఈ పొరపాటువలన కశ్యపుని సొత్తును నేను స్వంతంచేసుకొని, మళ్లీ ఇంకొకనికి దానం ఇచ్చినట్లయినది. తెలియకచేసినా, అది చాలాపాపకృత్యము గనుక, నేను కశ్యపుని అనేక విధాలుగా బ్రతిమాలాను, నా అపరాధం మన్నించి, పరిహారంగా ఒక లక్ష గోవులను స్వీకరింపుమన్నాను గాని, అతడు సమ్మతించలేదు. ఆ గోవే కావాలన్నాడు. ఆ గోవును ఇచ్చివేస్తే, దాని బదులుగా ఎన్ని గోవులు కావాలన్నా ఇస్తాను అని ఆ రెండవ బ్రాహ్మణుని బ్రతిమాలినాను. అతడుకూడ దానికి సమ్మతించకుండా, గోవును తోలుకొని వెళ్లిపోయాడు. కశ్యపుడు అసంతృప్తుడై కోపముతో వెళ్లిపోయాడు. నేనింక చేసేదేమీలేక, విధినిర్ణయం ఎలాగుంటే, అలాగే జరుగుతుందని ఊరుకొన్నాను.

నాకాలము తీరిపోగానే, యముని నిర్ణయంప్రకారం, ముందుగా పాపఫలముననుభవించిన తరువాత పుణ్యఫలం పొందవచ్చునని ఈ విధంగా ఊసరవిల్లిలయి పడియున్నాను. ఇలాగ ఎంతకాలము గడిచినదో నాకు తెలియదు. కృష్ణా! వాసుదేవా, కేశవా, పరమాత్మా, అప్రమేయా, వరదా, శ్రీహరీ, ముకుందా! నీయొక్క అపారకృపచేత, నీయొక్క దివ్యస్పర్శచేత నాపాపశేషము నశించి, నీయొక్క దివ్యదర్శనాన్ని పొందగలిగాను." అని నృగుడు, గోవిందచరణారవిందాలకు నమస్కరించాడు. అతని గురించి ఒక దివ్యవిమానమురాగా శ్రీకృష్ణుని వద్ద సెలవు తీసుకొని, అందరూచూస్తుండగా, విమానములో స్వర్గానికి వెళ్లిపోయాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు అక్కడ ఉన్న రాజులను, ప్రజలను ఉద్దేశించి ఇలా అన్నాడు: "ఈ నృగమహారాజు చరిత్రనుండి అందరూ ఒక విషయం తెలుసుకోవాలి - బ్రాహ్మణులసొత్తును ఎవ్వరూ ఎంతకొంచెమైననూ స్వంతము చేసుకొనరాదు. అది విషముకంటె ప్రమాదకరము. బ్రాహ్మణుని హింసించరాదు. కంటనీరు పెట్టించరాదు. గౌరవించాలి. నమస్కరించాలి. బ్రాహ్మణుడు తప్పుచేస్తే అతని పాపకర్మయే అతన్ని శిక్షిస్తుంది అని తెలుసుకోవాలి." అని శ్రీకృష్ణుడు చెప్పాడు. శ్రీకృష్ణుడు కూడ బ్రాహ్మణులను గౌరవించి, పూజిస్తుండేవాడు. అని శ్రీశుకుడు చెప్పెను.

బలరాముడు

నందవ్రజాగమనము: ఒకనాడు బంధుమిత్రులను చూచిరావాలనే కోరిక కలుగగా, బలరాముడు రథాన్ని తీసుకొని నందవ్రజానికి వెళ్లాడు. నందయశోదలు పరమానందభరితులయ్యారు. బాలకృష్ణుడే వచ్చినంత సంబర పడిపోయారు. అతనిని ఆలింగనం చేసుకొని, ఒడిలో కూర్చుండ బెట్టుకొని, ప్రేమతో శిరస్సుదువ్వి, ఆశీర్వదించి ఆనందించారు. అందరి కుశలం అడిగారు. కన్నయ్య ఎప్పుడు వస్తాడని అడిగారు.

తరువాత బలరాముడు పాతమిత్రులను కలుసుకొనడానికి వెళ్లాడు. అందరూ అతని చుట్టునుమూగారు. నమస్కరించారు. బలరాముడు కొందరికి నమస్కరించాడు, కొందరిని కౌగలించుకొన్నాడు, కొందరితో సరసాలాడాడు. ఈ విధంగా అందరినీ ఆనందింపజేశాడు.

గోపికలు బలరాముని తీసుకొనిపోయి, చుట్టూ కూర్చున్నారు. కృష్ణదర్శన స్పర్శలకు తహతహలాడుతున్న వారియొక్క తనువులకు బలరామదర్శనం కొంత ఊరట నిచ్చినది. వాళ్లంతా, తమ ప్రియతముడైన కృష్ణుని గురించి అనేక ప్రశ్నలు వేశారు. తమ పన్నెండవఏటనే బృందావనము విడిచి, అక్రూరునితో మథురకు వెళ్లిన బలరామకృష్ణులు మళ్లీ నందవ్రజానికి రానేలేదు. మధ్యలోనొకసారి కృష్ణుడు గోపికలనూరడించడానికి ఉద్ధవుని పంపించాడు. మళ్లీ ఇప్పుడు బలరాముడువచ్చాడు. ఈసరికి బలరామకృష్ణులూ, గోపగోపీజనులూ పెద్దవాళ్లయి పెండ్లిండ్లు చేసుకొని, పిల్లల్నికన్నారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా గోపికలకు శ్రీకృష్ణునియందున్న అనన్యప్రేమ సడలలేదు. శ్రీకృష్ణునిగురించి అడిగిన ప్రశ్నల పరంపరలే వారి అమాయకపు ప్రేమను తెలియజేస్తాయి. బలరాముని ఇలా అడిగారు. "రామా! మా కృష్ణయ్య బాగున్నాడా? భార్యలతోను, బిడ్డలతోనూ సుఖంగానున్నాడు కదా! మమ్మల్ని ఎప్పుడైనా తలచుకొంటాడా? కనీసం తలిదండ్రులైన యశోదానందులనైనా తలచుకొంటాడా? పోనీలే, నీవైనా మాయందు దయయుంచి మమ్మల్ని చూడడానికి వచ్చావు, సంతోషమే! గాని ఆ మాయలమారి మేమిక్కడ ఎలాగపడియున్నామో చూడడానికి ఒక్కసారి అయినా వచ్చాడా? అయినా అతనికి మేమెవ్వరములే! పిచ్చివాళ్లమై అతని గురించి మేమే భర్తలను, బిడ్డలను, గృహాలనూ, సర్వమూ, వదలుకొని అతనియందే మా తలపులన్నీ నిలుపుకొన్నాంకదా! మరి అలాంటి మమ్మల్నే విడిచిపెట్టేసి వెళ్లిపోయాడే, మళ్లీ ఒక్కసారైనా వచ్చి మమ్మల్ని చూచాడా ఆ కఠినాత్ముడు? మంచిమాటలాడి మోసగించుతాడు. అవును మేమంటే కల్లాకపటంతెలియని వెర్రిగొల్లలం, సులువుగా మోసగింపబడుతాము, కాని పాపం చతురలైన ఆ నగరకాంతలుకూడ అతని తియ్యని మాటలకు మోసపోతారేమోకదా! అయినా ముల్లోకాలనూ మోహంలో ముంచివేయగల ఆ ముగ్ధమోహనుని చిరునవ్వుబాణాలకు ఎవరు మాత్రము తట్టుకొనగలరులే. మమ్మల్ని నట్టేట విడిచిపెట్టేసి, నగరంలో కులుకుతూ మరచిపోయిన ఆ మోసగాని గురించి మేమెందుకు ఇంతగా ఆరాటపడాలి? మేములేకుండా అతడుహాయిగా కాలక్షేపం చేసేస్తుంటే, అతడు లేకుండా మేము ఇంకాహాయిగా ఉండలేమా ఏమిటి? ఏమనుకొంటున్నాడో మరి! ఆ గోపికాచిత్తచోరుడు!" అంటూ ఈ విధంగా గోపికలు తమ కృష్ణప్రేమను వియోగబాధను, అలుకను వ్యక్తపరచుకొన్నారు. బలరాముడు వారితో అనునయిస్తూమెలగి, కృష్ణుడు వారిని మరచిపోలేదనీ, చిన్ననాటి చేష్టలూ, గోకులంలో తాను వాళ్లతో గడిపిన మధురక్షణాలూ అన్నీ తరచూ తలచుకొంటాడని చెప్పి, వారిని ఊరడించాడు. వారందరూ బలరాముని యందు తమ కృష్ణయ్యనుచూస్తూ కాలంగడిపేవారు.

బలరాముడు ఆగ్రామములో చైత్రవైశాఖమాసాలు గడిపాడు. గోపగోపికలతో అనేక విధాల లీలావినోదాలలో ఆనందించాడు. ఉద్యానవనాలలో, యమునానదిఇసుక తిన్నెలలో అందరూ కాలంతెలియకుండా విహరించి వినోదించారు. చెట్లతొర్రలలో చేరిన వారుణీ రసాన్ని త్రాగిమత్తెక్కి ఆడుకొనేవారు. ఒకనాడు బలరాముడు బాగా మత్తెక్కి జలక్రీడలాడదలచుకొని, యమునా నదినే తనవైపునకు ప్రవహించుమని ఆజ్ఞాపించాడు. మైకంలో ఉండి అన్నాడులే అనుకొని, యమున ఆ మాటను పట్టించుకొనలేదు. బలరాముడు ఆగ్రహావేశములో - " నా ఆజ్ఞను అలక్ష్యం చేసిన నిన్ను వందపాయలుగా చీల్చి, నీ అసలు రూపము లేకుండా చేస్తానుచూడు" - అని, తన నాగలితో, యమున ఒడ్డును పెకలించనారంభించాడు. అప్పుడు, ఆ నదీమతల్లి భయపడి వచ్చి, బలరాముని పాదాలపై బడి, ఇలా విన్నవించుకొన్నది: "ప్రభూ! నీవు సాక్షాత్తు, ఆ సంకర్షణదేవుడవు. నీ అంశతోనే ఆదిశేషుపు ఈ భూభారాన్ని మోస్తున్నాడు అనే విషయాన్ని విస్మరించి, నేను అపచారం చేశాను. నన్ను రక్షించు. నా తప్పిదాన్ని మన్నించి, నా ప్రవాహాన్ని మళ్లించకు." అని వేడుకొని, వస్త్రాలు, ఆభరణాలు, పుష్పమాలలూ కానుకలుగా సమర్పించినది. బలరాముడు సంతృప్తుడై అందరితో యమునలో జలక్రీడలాడి, యమున ఇచ్చిన వస్త్రాలు, ఆభరణాలు ధరించి, మనోహరరూపుడై శోభిల్లాడు. తరువాత బలరాముడు అందరివద్ద సెలవుతీసుకొని ద్వారకకు మరలివెళ్లాడు. బలరాముని నాగలిచే చేయబడిన జాడ ఇప్పటికీ ఉన్నది.

ద్వివిదుని వధించుట : ద్వివిదుడు పదివేల ఏనుగుల శక్తిగల ఒక పొగరుబోతు వానరుడు. అతడు సుగ్రీవుని మంత్రియైన మైందుని తమ్ముడు. ఈ దుష్టవానరుడు నరకాసురుని మిత్రుడు. నరకాసురుడు శ్రీకృష్ణునిచే చంపబడినందున ద్వివిదుడు, కక్షబూని, ఆనర్త దేశములోని యాదవుల పల్లెలను, పట్టణాలను, తగలబెట్టడం, ఆలమందలను బెదిరించి తరిమివేయడం, చెట్లను విరిచివేయడం, ఇళ్లను పడగొట్టడం, స్త్రీ పురుషులను పట్టుకొనిపోయి, గుహలలో దాచివేయడం మొదలైన ఘాతుకచర్యలతో బాధిస్తుండేవాడు.

ఒకనాడు రైవత పర్వతంనుండి మనోహరమైన వాద్యాలతో సంగీతం వినవస్తుంటే, ద్వివిదుడు అక్కడికిపోయి, చెట్టెక్కి చూచాడు. అక్కడ ఆజానుబాహుడు, సుందరవిగ్రహుడూ అయిన బలరాముడు, కొందరు సుందరీమణులతో కూడి చుక్కలమధ్య చంద్రునివలె మెరిసిపోతూ, వారుణీరసాన్ని త్రాగుతూ, పాడుకొంటూ ఆడుకొంటూ విహరించడం చూచాడు. తనజాతి సహజమైన చేష్టలను చెయ్యాలనిపించి, బలరామునికి దగ్గరగానున్న ఒక చెట్టెక్కి, తనతోకతో బలరాముని మెడను తాకుతూ, కొరికినపండ్లను అతనిపైన వేస్తూ, పళ్లికిలిస్తూ, వెక్కిరిస్తూ, కిచకిచలాడసాగాడు. బలరాముడు చిరాకుతో ఒకరాయి విసిరాడు. దానిని తప్పించుకొని, వానరుడు క్రిందికిగెంతి, బలరాముచేతిలోనున్న మద్యపాత్రను లాక్కొని, నేలకేసి కొట్టాడు. స్త్రీల వస్త్రాలను లాగి, చించనారంభించాడు. బలరామునకు పట్టరాని ఆగ్రహం వచ్చేసినది. తన ఆయుధాలైన నాగలిని, రోకలిని సిద్ధంచేసుకొని, వానరుని తరిమికొట్టాలనుకొన్నాడు. అతడు సామాన్యమైన వానరుడుకాడు, మహాబలశాలియైన హనుమంతుని వంటివాడు. ద్వివిదుడు ఒక వృక్షాన్ని పెరికి, దానితో బలరాముని మొత్తాడు. బలరాముడు లక్ష్యపెట్టకుండా, తన ఇనుపరోకలితో వానరుని తలబ్రద్దలు చేసినా, వాడు లక్ష్యపెట్టకుండా ఇంకొకవృక్షాన్ని పెరికి కొట్టబోయాడు. బలరాముడు దానిని ముక్కలు చేసి పారవేశాడు. ఈ విధంగా వానరుడు పెరికి, విసురుతున్న చెట్లనన్నిటినీ బలరాముడు ముక్కలు చేసివేస్తూనే ఉన్నాడు. తరువాత వానరుడు బండరాళ్లను విసరనారంభించాడు. వాటినికూడ, రాముడు ముక్కలు చేశాడు. చివరకు తాటిచెట్లవంటి తన బాహువులతో వానరుడు ముష్టియుద్ధానికి దిగాడు. పిడుగురాళ్లవంటి తనపిడికిళ్లతో, వాడు బలరాముని వక్షస్థలంపై గుద్దగా, రాముడు లక్ష్యపెట్టకుండా, వానరుని కంఠాన్ని పట్టుకొని బిగించసాగాడు. వాడు శక్తిహీనుడై నాలుక వెళ్లబెట్టాడు. నేలమీద చచ్చిపడ్డాడు. ఒక లోకకంటకుని హతమార్చి, బలరాముడు పరివారముతో మరలిపోయాడు.

హస్తినాపురాన్ని పెకిలించుట : దుర్యోధనుని పుత్రికయైన లక్షణ, సకలసద్గుణ శుభలక్షణ సంపన్న. ఆమెను, స్వయంవరములో రాజులందరి సమక్షములో, జాంబవతీశ్రీకృష్ణుల పుత్రుడైన సాంబుడు ఎత్తుకొనిపోయాడు. కౌరవులంతా అతని దుస్సాహసానికి నివ్వెరపోయి, భీష్మాదులైన పెద్దల అనుమతిని పొంది, అతన్ని పట్టుకొని, బంధించాలని నిశ్చయించుకొన్నారు. యాదవులు అతన్ని విడిపించడానికి వచ్చి ఎదిరిస్తే వారికి తగినశాస్తిచేసి పంపిద్దాం అని అనుకొన్నారు. కర్ణ, శల్య, భూరిశ్రవస, యజ్ఞకేతు దుర్యోధనాదులు యుద్ధసన్నద్ధులై రథాలెక్కి, సాంబుని వెంబడించారు. సాంబుడు, మహాయోధునిగా ప్రసిద్ధికెక్కినవాడు. కౌరవముఖ్యులూ, మహావీరులూ అయిన ఈ ఆరుగురినీ, సాంబుడు ఒక్కడే ఎదుర్కొని, తనచుట్టూ మేఘాలవలె క్రమ్మివేసిన శత్రువులబాణాలను, తనయొక్క శరపరంపరలతో ధ్వంసంచేశాడు. మెరుపుతీగలాగ, అందరినీ ఎదుర్కొంటూ, వారి రథాలను, గుర్రాలను, సారథులను, జండాలనూ నేలగూల్చాడు. కౌరవయోధుల కవచాలను ఛేదించి, వారిని గాయపరిచాడు. వాళ్లు అవమానభారంతో, తలలు వంచుకొని, వెనుకకుతగ్గినా, మళ్లీసర్దుకొని, ఉమ్మడిగా ఒంటరివాడైన యాదవకుమారునిపై విరుచుకొనిపడి, అతని రథాన్నీ ధనుస్సునూ భగ్నంచేశారు. గత్యంతరంలేక, వలలో చిక్కుకొన్న సింహంలాగ, సాంబుడు పట్టుపడ్డాడు. కన్యాసహితంగా అతనిని వెనక్కుతీసుకొనివెళ్ళిపోయారు. నారదమహర్షి వలన సాంబుడు కౌరవుల బందీ అయిన

వార్తనువిని, ద్వారకలోని యాదవ వీరులందరూ మండిపడి, యుద్ధానికి సిద్ధపడి, ఉగ్రసేన మహారాజుయొక్క అనుమతిని పొందారు. కౌరవ అభిమాని అయిన బలరాముడు, బంధువులైన కౌరవులతో యుద్ధంచెయ్యడం తగదనీ, తానే స్వయంగా వెళ్లి సాంబుని సగౌరవంగా తీసుకువస్తాననీ చెప్పి, కొందరు యాదవ పెద్దలనూ, బ్రాహ్మణులనూ తీసుకొని రథంపై హస్తినాపురం వెళ్లాడు. ఊరు బయట ఆగి, తనరాకను కౌరవపెద్దలకు తెలియజేయవలసినదిగా ఉద్ధవుని పంపించాడు. దుర్యోధనాదులు మిక్కిలి సంతసించి, సన్నాహాలతో ఎదురు వెళ్లి, బలరామునికి స్వాగతం పలికి నమస్కారాలు చేశారు. బలరాముడు కుశలం అడిగి ఇలా అన్నాడు. "ఓ కురువంశ శ్రేష్ఠులారా! బాలకుడూ, ఒంటరివాడూ అయిన సాంబుని వీరాధివీరులైన మీరందరూ కలిసి బంధించడం ధర్మముకాదు. బంధువులైన మనలోమనకు వైరము తగదని మా ఉగ్రసేన మహారాజు, ఉభయులక్షేమమూ కోరి శాంతియుతంగా, సగౌరవంగా, సాంబుని తీసుకొనిరమ్మని నన్ను పంపించాడు" అనగా విని, దుర్యోధనుడు మండిపడ్డాడు. అహంకార బలగర్వంతో ఇలా అన్నాడు: "చాలుచాలు. ఏమి, ఈ కాలవైపరిత్యము! కాళ్లకు తొడిగేచెప్పులు, తలమోద కిరీటాలు కాదలచుకొన్నట్లున్నదే ఈ యాదవుల వ్యవహారము! కుంతీదేవి మా వంశములోకి రావడం చేత ఈ యాదవులకు మాతో బంధుత్వం ఏర్పడి గుర్తింపువచ్చినది. పోనీలే అనిమేము ఉపేక్షచేయడంచేతనే, అర్హత లేకపోయినా, వారు సింహాసనంపై కూర్చొని రాజులమని విర్రవీగుతున్నారు. మాతో సమానులమనుకొంటున్నారు. వాళ్లతో నిక, ఈ స్నేహ సంబంధాలు చాలు. భీష్మద్రోణ కర్ణాది వీరులనుండి సాంబుని విడిపించడం దేవేంద్రునికైనా సాధ్యంకాదు. ఈ యాదవులు ఎలాగ విడిపిస్తారో నేనూ చూస్తాను." అని, రోషముతో దుర్యోధనుడు అనుచరులను తీసుకొని, విసవిసా వెళ్లిపోయాడు. కౌరవుల పట్ల సద్భావనతో వచ్చిన బలరాముడు ఖిన్నుడైనాడు. దుర్యోధనుని పరుషవాక్కులకు బలరాముని హృదయము తీవ్రముగా గాయపడినది. అవమానం భరించలేకపోయాడు. అక్కడున్న యాదవ పెద్దలతో ఇలా అన్నాడు: "రాజ్యమదాంధుడైన ఈ దుర్యోధనుని మాటలు విన్నారు కదా! కౌరవుల గర్వమణచడానికి, కృష్ణుడూ, ఇతర యాదవులూ సిద్ధపడుతుంటే నేనే వారిని వారించి, మంచిగానే కార్యము సాధించాలనుకొన్నాను కాని, వీళ్లకు మంచి రుచించలేదు. బ్రహ్మాది దేవతలంతా ఎవరిని నిత్యమూ సేవిస్తుంటారో, ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుని అనుగ్రహంతో ఉగ్రసేనుని రాజ్యసంపదలన్నీ విలసిల్లుతుంటే, ఈ వదరుబోతు సుయోధనుడు, తమ చలవవలననే యాదవులు బ్రతుకుతున్నారని అంటున్నాడు, విన్నారా! ఈ దుర్మార్గునీ కౌరవవంశాన్నీ నాశనం చేయవలసిన రోజు వచ్చినట్లున్నది" అని, బలరాముడు, తన నాగలిని పట్టుకొని, హస్తినాపుర చివరిభాగాన్నీ నాగలికొనను గుచ్చి తన బాహుబలంతో, ఆ పట్టణాన్ని పెకలించి, యమునా నదిలోనికి త్రోసివెయ్యాలని ప్రయత్నించాడు. పట్టణం ఒక ప్రక్కకు ఒరిగినది. ఇంకకొద్దిసేపటిలో నగరమంతా నదిలో పడగలదని గ్రహించి, ఇది బలభద్రుని ఆగ్రహఫలితమేనని ఊహించి, దుర్యోధనుడు భీష్మపితామహుని తోడ్కొకొని పరుగెత్తుకొంటూ వచ్చి బలరాముని శరణువేడాడు. లక్షణకన్యను సాంబునకు సమర్పించుకొన్నాడు. అనేకమణిమయభూషణాదులు, ఏనుగులు, రథాలు, గుర్రాలు, పరిచారకులు మొదలైన కానుకలను సమర్పించుకొన్నాడు. ఇలాగ స్తుతించాడు: "బలరామా! జగదభిరామా! మమ్ము రక్షించు. నీ మహిమను తెలిసియుండికూడ అహంకారముచే నీతో అపమానకరంగా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నాము. మమ్ము మన్నించు. నీవు సంకర్షణ దేవుడవు, అనంతుడవు, సర్వశక్తి స్వరూపుడవు. నిన్ను వర్ణింపనెవ్వరికీ శక్యము కాదు." అని స్తుతించగా, బలరాముడు ప్రసన్నుడై, అభయమిచ్చాడు. దుర్యోధనుడు అల్లునీ, కూతురునీ దీవించి, బలరామాదులతో ద్వారకకు పంపించాడు.

పౌండ్రక వాసుదేవుడు

బలరాముడు ప్రేపల్లెలో నున్నప్పుడు కరూశదేశపు రాజైన పౌండ్రక వాసుదేవుడు శ్రీకృష్ణుని వద్దకు ఒక దూతను పంపించాడు. ఆ రాజు మూర్ఖుడే కాకుండా అహంకారి కూడాను. అతనికి వాసుదేవనామము ఉండడంచేత, తానే ఆ వాసుదేవపరమాత్మనని నమ్మసాగాడు. అతని చుట్టూచేరియున్న స్వార్థపరులు, అతని భ్రమను ఇంకా ఎక్కువచేస్తూ,

అతనిచేత విష్ణుమూర్తి వేషాన్ని ధరింపజేసి, పొగడ్తలతో, స్తుతులతో, ముంచెత్తేవారు. అతని పిచ్చి తలకెక్కిపోయి, ఇంకెవ్వరికీ వాసుదేవనామం ఉండరాదనీ ఇంకెవ్వరూ తనలాగ విష్ణుమూర్తి వేషధారణ చెయ్యరాదనీ నమ్మేవాడు. అందుచేత అతడు శ్రీకృష్ణుని వద్దకు ఒక సందేశాన్ని పంపించాడు. శ్రీకృష్ణుడు యాదవ ముఖ్యులతో సభలోనుండగా, దూతవచ్చి, తమ ప్రభువుయొక్క మాటలుగా ఇలాగ చెప్పాడు: "ఓయీ కృష్ణా! యాదవా! భూమిని రక్షించడానికీ, ప్రజలను అనుగ్రహించడానికీ, వాసుదేవుడనై నేను వచ్చియుంటే, నీవు నా నామాన్నీ, చిహ్నాలనూ ధరించి సంచరిస్తున్నావని నాకు తెలిసినది. ఇదినీకుతగదు. అలాగ చెయ్యరాదని నీకు తెలియదేమో! ఇకనైనా నీవు వాటిని విసర్జించి, నా శరణువేడుకొనుము. లేకుంటే నాతో యుద్ధానికి రా, నిన్ను యముని వద్దకు పంపిస్తాను." అని చెప్పిన దూతమాటలు విని, సభాసదులందరూ "పిచ్చివాడు" అని నవ్వుకొన్నారు. "ఇలాంటి మూర్ఖుడుకూడ ఒకడున్నాడా" అని ఆశ్చర్యపోయారు. శ్రీకృష్ణుడు ఆ దూతతో ఇలా చెప్పాడు: "మీరాజుతో చెప్పు: ఏ చిహ్నాలనైతే నన్ను విసర్జింపుమన్నాడో, ఆ చిహ్నాలైన గదా చక్రాలతోనే అతన్నీ అతని అనుచరుల్నీ యుద్ధభూమిపై అంతం చేస్తాను. సిద్ధంగానుండుమని చెప్పు" అని అన్నాడు. దూతవెళ్లి శ్రీకృష్ణుని వాక్కులను తన ప్రభువుతో చెప్పాడు. వాని గుండెలదిరిపోయినవి.

శ్రీకృష్ణుడు పౌండ్రకునితో యుద్ధము చేయడానికి వెళ్లాడు. పౌండ్రకుడు అతిశయించిన రణోత్సాహముతో రెండు అక్షౌహిణుల సైన్యముతో వచ్చాడు. అతని మిత్రుడైన కాశీరాజు, మూడు అక్షౌహిణుల సైన్యముతో వచ్చిచేరాడు. పౌండ్రకుడు ముమ్మూర్తులా శ్రీకృష్ణునివలె వస్త్రాలను, అలంకరణలను, ఆయుధాలను, కిరీటకుండలాలను ధరించి రంగస్థలనటునివలె తయారయివచ్చాడు. ఆ పగటివేషధారిని చూచి, శ్రీకృష్ణుడు నవ్వాడు. ఆ పరిహాసానికి పౌండ్రకుడు మండిపడ్డాడు. శ్రీకృష్ణునిపై పదహారు రకాల ఆయుధాలను ప్రయోగించాడు. వాటినన్నిటినీ శ్రీకృష్ణుడు వమ్ముచేశాడు. పాంచజన్యశంఖాన్ని పూరించగా శత్రుసేనలు దద్దరిల్లిపోయాయి. వాటిని తన శరపరంపరలతో నంతము చేసినాడు శ్రీకృష్ణుడు. పౌండ్రకునితో నిలాగ అన్నాడు: "ఓయీ రాజశేఖరా! ఇప్పుడు చూస్తావు నిజమైన వాసుదేవుడెవరో! నన్ను ధరించకుండా విసర్జించుమన్నానే, ఆ గదా, చక్ర, ఆయుధాలే నీ ప్రాణాన్ని హరిస్తాయి, కాచుకో!" అంటూ, శ్రీకృష్ణుడు తన బాణాలను వేసి పౌండ్రకుని సారథిని చంపి, రథాన్ని కూల్చాడు. అయినా పౌండ్రకుడు పోరు మానలేదు. శ్రీకృష్ణుడు చివరకు చక్రాయుధాన్ని ప్రయోగించి, అతని శిరస్సును ఖండించాడు. కాశీరాజు ఇంకాయుద్ధం కొనసాగిస్తుంటే వాని శిరస్సును కూడ చక్రాయుధంతో ఖండించి, ఆ శిరస్సును కాశీరాజుకోటలో పడేటట్లు బాణముతో కొట్టాడు. విజయంసాధించి ద్వారకానగరమునకు తరలిపోయాడు. నిరంతరమూ శ్రీకృష్ణద్వేషముతో, శ్రీకృష్ణ వేషములోనుంటూ, శ్రీకృష్ణరూపస్మరణలోనే జీవితం గడిపిన పౌండ్రకుడు శ్రీకృష్ణసాయుజ్యాన్ని పొందినాడు.

కాశీరాజు సౌధంలో వచ్చి పడిన ఆ రాజు శిరస్సును చూచి అందరూ దుఃఖించారు. అతనికి అంత్యక్రియలు జరిపించారు. అతని పుత్రుడైన సుదక్షిణుడు శ్రీకృష్ణునిపై కక్ష సాధించాలని పరమేశ్వరుని గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షముకాగా శ్రీకృష్ణుని అంతము చేసే వరమిమ్మంటాడు. పరమశివుడు అలాంటివరమివ్వకుండా అభిచారయాగాన్ని చేసి, ప్రయత్నింపుమని సలహాఇచ్చాడు. సుదక్షిణుడు నిష్ఠతో ఆయాగాన్ని నిర్వహించాడు. హోమకుండమునుండి భయంకరాకారముతో తాటిచెట్లవంటి కాళ్లతో, మూడు శిఖలతో అగ్నిరూపంలో ఒక జ్వాలామూర్తి బైటకువచ్చినది. అది ద్వారక ప్రవేశించి ఒక్కొక్కటిగా అన్నీ దహించివేస్తుంటే, ప్రజలందరూ భయభ్రాంతులై ఆర్తనాదాలు చేసుకొంటూ శ్రీకృష్ణుని వద్దకు వెళ్లారు. శ్రీకృష్ణుడు అభయమిచ్చి, తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ చక్రము సూర్యునివలె ప్రకాశిస్తూ, ప్రళయాగ్నివలె ప్రజ్జ్వరిల్లుతూ "కృత్య" అనబడే హోమాగ్నిని తరిమితరిమి, హోమకుండమువద్ద దానిని అంతము చేసినది. తరువాత సుదక్షిణుని, అతని నగరాన్ని ధ్వంసంచేసి, తిరిగి శ్రీకృష్ణుని చెంతకుచేరినది.

శ్రీకృష్ణుని గృహస్థ జీవనం

నరకాసురునిచెరనుండి విడిపింప బడిన పదహారువేలమంది స్త్రీలను వివాహమాడిన శ్రీకృష్ణుని గృహస్థజీవనం ఎలాగుంటుందో చూడాలని ఒకనాడు నారద మహర్షికి కోరిక కలిగినది. వెంటనే ద్వారకకు చేరుకొన్నాడు.

ఆ నగరము ఉద్యాన వనాలతోనూ, సరస్సులతోనూ, నానావిధ పుష్పఫలవృక్షాలతోనూ, దివ్యభవనాలతోనూ, వైకుంఠాన్ని మించిన శోభతో వెలిగిపోతున్నది. దేవశిల్పి అయిన విశ్వకర్మ తన ప్రతిభనంతా చూపి నిర్మించిన భవనాల్లోని గోడలు, గచ్చులు, ద్వారాలు, బంగారు, వెండిరేకులతో తాపబడి, నవరత్నాలతో పొదగబడి, చీకటిలో కాంతులు వెదజల్లుతున్నాయి. శ్రీకృష్ణుని భార్యలందరూ, ఒక్కొక్కరూ ఒక్కొక్క ప్రత్యేకభవనంలోనున్నారు. ప్రతిభవనంలోనూ మంగళవాద్యాలు, పండితుల వేదఘోషలూ వినిపిస్తున్నాయి వాకిట పన్నీరు జల్లులు, ముత్యాలముగ్గులు, మామిడితోరణాలు శోభిల్లుతున్నాయి. నగరిలో ప్రవేశించిన త్రిలోకసంచారి కన్నులపండువుగా ఆ నగరశోభను తిలకిస్తూ, ఇన్నివేల భవనాల్లో శ్రీకృష్ణుడు ఏ భవనంలోనుంటాడని వెదకాలి అని ఆలోచిస్తూ, ముందుగా రుక్మిణీదేవి గృహంలో ప్రవేశించాడు. తన అదృష్టం కొద్దీ కృష్ణుడు ఆ ఇంట్లోనే ఉన్నట్లుగమనించి, సంతసించి, లోనికి వెళ్లాడు. రుక్మిణీదేవి వింజామరంతో వీచుతుండగా కూర్చున్నస్వామి దేవర్షిని చూచి, ఎదురువెళ్లి, నారదునిపాదాలకు శిరస్సుతో నమస్కరించి, కూర్చుండబెట్టి, పాదాలు కడిగి, ఆ నీటిని శిరస్సుపై జల్లుకొని – "మహాశయా! మీరాకతో మా గృహముపావనమైనది. నావలన జరుగవలసిన సేవ ఏమిటో సెలవివ్వండి." అని అతివినయంగా ప్రశ్నించాడు. పరమాత్ముడైన శ్రీకృష్ణుడు మానవుడై జన్మించి, మానవులు బ్రాహ్మణులనూ, సద్గురువులనూ ఋషులను ఎలాగ సత్కరించాలో స్వయంగా చేస్తూ ఆదర్శంగా ఉన్నాడు. నారదుడు ఇలా అన్నాడు: "స్వామీ! దుష్టశిక్షణ, శిష్టరక్షణకు అవతరించిన నీవు చెయ్యలేనిదీ, ఇవ్వలేనిదీ, ఏదీలేదు. కాని నాకేమీవద్దు. నీపదధ్యాన ధ్యానము నా మదిలో నిరంతరం నిలిచేటట్లు అనుగ్రహించు." అనగా స్వామి తథాస్తు అన్నాడు.

నారదుడు శ్రీకృష్ణుని వద్ద సెలవుతీసుకొని, అతనియొక్క ఇతర భార్యలనుకూడ చూచిపోదామని ఇంకొక భవనంలోనికి ప్రవేశించాడు. ఆశ్చర్యం! రుక్మిణి ఇంట్లో నుండే స్వామి ఈ ఇంట్లో ఎలాగున్నాడు? ఇక్కడ ఉద్ధవునితోను, భార్యతోను పాచికలాట ఆడుతున్నాడు. నారదునిచూచి, ఎదురేగి, కుశలమడిగి, పాదాలుకడిగి, నానుండి ఏమికావాలి అని అడిగేసరికి నారదునికేమీతోచలేదు. సెలవుతీసుకొని వెళ్లిపోయాడు. కుతూహలం ఎక్కువకాగా, ఇంకొక భవనంలో ప్రవేశించాడు. అక్కడ శ్రీకృష్ణుడు కొడుకులతో ఆడుకొంటూ ఆనందిస్తున్నాడు. నారదుని ఆశ్చర్యానికి అంతులేదు. ఇంకా చూద్దామని ఇతర భవనాల్లో కూడ ప్రవేశించాడు. ప్రతిఇంట్లోనూ శ్రీకృష్ణుడు ఏదోఒక కార్యకలాపంలో ఉన్నాడు. స్నానానికి వెళ్తూనో, హోమంచేస్తూనో, సంధ్యావందనం చేస్తూనో, ధ్యానంచేస్తూనో, సామును అభ్యసిస్తూనో, జలక్రీడలాడుతూనో, పురాణశ్రవణం చేస్తూనో, బ్రాహ్మణులకు దానాలిస్తూనో, గురువులసేవ చేస్తూనో, సత్పురుషులతో గోష్ఠిచేస్తూనో, పిల్లలకు వివాహప్రయత్నాలు చేస్తూనో, కుమార్తెలకు అత్తవారింటికి పంపుతూనో, ఇంటికి వస్తున్న బంధువులను ఆహ్వానిస్తూనో, భోజనంచేస్తూనో ఈ విధంగా ప్రతి ఇంట్లోనూ ఏదో ఒక వ్యాపకంలో, అతిసామాన్య గృహస్థునివలె నిమగ్నుడైయుండడం చూచాడు నారదుడు. ఆలీలామానుష విగ్రహుని అద్భుత చేష్టితాలను ఊహించలేక నారదుడు నిశ్చేష్టుడైనాడు. ఒకే కృష్ణుడు పదహారువేలమంది కృష్ణులుగా వేర్వేరు గృహాలలో వేర్వేరు కార్యకలాపాలను ఒకే సమయంలో చేస్తుండే అద్భుతలీలను ప్రత్యక్షంగా తిలకించే అపూర్వభాగ్యము తనకే లభించినదని పరమానందభరితుడయ్యాడు నారదుడు. శ్రీకృష్ణుడు భగవానుడే అనడానికీ, భగవానుడు సర్వవ్యాపి అనడానికీ ఇంతకంటే నిదర్శనమింకేమి కావాలి అనుకొన్నాడు. "చేతనః చేతనానాం, ఏకో బహూనాం యో విదధాతి కామాన్" చైతన్యంగల అశేషజీవరాసులలో, ఏకైక చైతన్యస్వరూపుడే, అనేకములో అనేకుడై, ఆ జ్ఞాన స్వరూపుడొక్కడే,

అందరి కోర్కెలనూ సిద్ధింపజేస్తాడు" అనే ఉపనిషద్వాక్కునకు ప్రత్యక్ష ప్రమాణంగా ఈ శ్రీకృష్ణలీలను దర్శించాడు నారదుడు.

శ్రీకృష్ణుడు అష్టమహిషులతోనూ, పదహారువేలమంది భార్యలతోనూ, అందరినీ సమానంగా ఆనందింపజేస్తూ ఉండేవాడు. బ్రాహ్మీముహూర్తానలేచి, పరమాత్మ అయిన తన్నుతానే ధ్యానము చేసుకొనేవాడు. తానే స్వయంపరబ్రహ్మ అయినప్పటికీ, లోకులకు ఆదర్శంచూపడానికి, సంధ్యావందన, గాయత్రీజప, బ్రాహ్మణ పూజ, హోమాది నిత్య కర్మలను నిష్ఠతో నాచరించే వాడు. ప్రతిదినమూ బ్రాహ్మణులకు దీనులకు గోదాన, హిరణ్యదాన, వస్త్రదాదులను చేసేవాడు. పౌరులకు, పనివారలకు, ఆశ్రితులకు, బంధుజనాలకు విరివిగా కానుకలిచ్చేవాడు. ఉద్ధవసాత్యకులతో సభకు వెళ్లేవాడు. ఆ సుధర్మసభాభవనంలో నుండేవారికి ఆకలిదప్పులు, శోకమోహాలు ఉండేవికావు. సభలో బ్రాహ్మణులు, కవులు, పండితులు, అనేకమైన శాస్త్రాలనూ, ఇతిహాసాలనూ, వేదాంతరహస్యాలను వినిపిస్తుండేవారు. నాట్యాచార్యులు నృత్యకళను ప్రదర్శించేవారు. గానకోవిదులు అనేక రకాలగానమాధుర్యాలను వెదజల్లేవారు. ఈ విధంగా శ్రీకృష్ణుని దినచర్య జరుగుతుండేది.

జరాసంధుని అంతము

బందీలైన రాజుల విన్నపము : ఒకనాడు శ్రీకృష్ణుడు సభలో నుండగా ఒక దూతవచ్చి శ్రీకృష్ణునితో ఇలా చెప్పాడు: "ప్రభూ! జరాసంధుడు చాలామంది రాజులను బందీలుగా తీసుకొనివెళ్లి, వారిని తనరాజధానియైన గిరివ్రజపురములో బంధించియుంచి, నానా బాధలకు గురిచేస్తున్నాడు. వారు నన్ను దూతగా తమ కడకు పంపించి, నీకు ఇలాగ విన్నపింపుమన్నారు: "కృష్ణా! ఆపదలోనున్న మమ్ము రక్షించు. నీశరణు జొచ్చినాము. జరాసంధుడు మమ్మల్ని అకారణంగా బంధించి, శారీరక మానసిక బాధలకు గురిచేస్తున్నాడు. శిష్టరక్షణకు నీవు అవతరించావని అంటారు. నీవేమమ్ము రక్షించాలి ప్రభూ." అని వారు నీకు మనవి చేయుమన్నారు." అని చెప్పిన దూత స్వామి జవాబునకు వేచియున్నాడు.

ఇంతలో నారదమహర్షి అక్కడకువచ్చి శ్రీకృష్ణలీలాగాథలను సుమనోహరంగా గానంచేయగా అందరూ ఆనందంతో మైమరిచారు. శ్రీకృష్ణుడు, సభాసదులు లేచినిల్చొని మహర్షిని సగౌరవంగా ఆహ్వానించారు. శ్రీకృష్ణుడు ఇలా అడిగాడు: "నారదా! విశేషాలేమిటి? త్రిలోకసంచారివైన నీకు తెలియనిదేమీ ఉండదు. అందరూ కుశలమేనా? పాండవులు బాగున్నారా?" అని అడిగిన కృష్ణునితో దేవర్షి ఇలా చెప్పాడు: "స్వామీ! ఈ విశ్వములో నీకు తెలియని విషయమేదైనా ఉంటుందా? అయినా అడిగావు గనుక చెప్తాను చిత్తగించు. యుధిష్ఠిరుడు రాజసూయయాగాన్ని చేయతలపెట్టి, నిన్ను ఆరాధించాలనే తలంపుతోనున్నాడు. నీవు ఆ కోర్కెనుతీర్చి, అనుగ్రహించాలి. ఆ యాగానికి వచ్చినవారందరూ నీయొక్క దివ్యదర్శన భాగ్యాన్ని పొందినవారై పునీతులై తరిస్తారు. నీకీర్తి ఇప్పటికే సర్వలోకాలయందూ వ్యాపించియున్నది. నీ పాదజలము పైలోకాల్లో మందాకినిగను, భూలోకంలో గంగానదిగను, పాతాళంలో భోగావతిగనూ ప్రసిద్ధిజెందినది." అని చెప్పగా శ్రీకృష్ణుడు ఉద్ధవునితో ఇలా అన్నాడు: "ఉద్ధవా! నీ ఆలోచనాశక్తి నిశితమైనట్టిది. మొదట జరాసంధుని జయించి, బందీలైన రాజులను విడిపించాలా? లేదా? యుధిష్ఠిరుని రాజసూయాగానికి మొదటవెళ్లడమా? ఏది శ్రేయస్కరమో బాగా ఆలోచించి చెప్పు" అని కోరినాడు. ఉద్ధవుడు యోచించి, మొదట రాజసూయయాగానికి వెళ్లి, తరువాత జరాసంధుని జయించడం మంచిది, అని చెప్పాడు. మళ్లీ ఇలా అన్నాడు: "అమిత బలపరాక్రమశాలియైన జరాసంధుని చంపడం ఒక్క భీమసేనునికే తప్ప ఇంకెవ్వరికీ సాధ్యపడదు. అతనికి వంద అక్షౌహిణుల సైన్యం ఉన్నది గనుక సేనలతో ఎదిరించి గెలవడం కష్టము. ద్వంద్వయుద్ధములోనే అతన్ని ఓడించాలి. జరాసంధుడు బ్రాహ్మణులు దేనిని అడిగినా ఇచ్చేస్తాడు. భీముడు బ్రాహ్మణ వేషంలో వెళ్ళి, అతనితో

ద్వంద్వయుద్ధం చెయ్యడానికి ఒక్క అవకాశాన్ని ఇమ్మని యాచిస్తే, అతడు తప్పకుండా ఒప్పుకొంటాడు. అప్పుడు మనయొక్క అన్ని ప్రయోజనాలు నెరవేరుతాయి." అని చెప్పిన ఉద్ధవుని ఆలోచనకు అందరూ మెచ్చుకొన్నారు. బందీలైన రాజులయొక్క దూతకు అచిరకాలములోనే వారి యొక్క బాధలు నివారింప బడగలవని అభయమిచ్చి పంపించివేశారు.

మేఘపుష్పము, వలాహకము, శైబ్యము, సుగ్రీవము, అనబడే గుర్రాలనుపూన్చి, దారుకుడు రథాన్ని సిద్ధము చెయ్యగా, శ్రీకృష్ణుడు ఉగ్రసేననకూ, బలరామునకూ, గురువులకూ వందనం చేసి, రథమెక్కి వెళ్లాడు. అతనివెంట చతురంగ బలాలు వెళ్లాయి. బంగారు పల్లకీలలో భార్యలుకూడా వెళ్లారు. నదులూ వనాలూ పట్టణాలూ దాటి, ఆనర్త, సౌవీర, కురుదేశాలనుదాటి, ఇందుమతీ, దృషద్వతీ, సరస్వతీ నదులనుదాటి, పాంచాల, మత్స్యదేశాలను దాటి ఇంద్రప్రస్థ నగరానికి చేరుకొని, ఒక ఉపవనంలో విడిదిచేశారు.

శ్రీకృష్ణుని రాకను తెలుసుకొని, యుధిష్ఠిరుడు తమ్ములతోను, గురువులతోను, బ్రాహ్మణులతోను, మంత్రులతోను వెళ్లి, శ్రీకృష్ణుని గాఢాలింగనం చేసుకొన్నాడు. అతని సకల దుఃఖాలూ తొలగిపోయినవి. భీమార్జున నకులసహదేవులు కూడ తమ ప్రియబాంధవుని గౌరవ పూర్వకంగా కౌగలించుకొన్నారు. శ్రీకృష్ణుడు యుధిష్ఠిరుని, భీముని, పెద్దలను, గురువులను పాదాభి వందనాలతో గౌరవించాడు. బ్రాహ్మణులు పుణ్యశ్లోకాలను వల్లించారు. దారిపొడుగునా తోరణాలు, పుష్పమాలికలు, పూర్ణకుంభాలు, ముగ్గులు, దీపాలు, పూలబాటలు మొదలైన వాటితో కన్నుల పండువుగా అలంకరించారు. ఆ బాలగోపాలమూ బారులు తీర్చి నిల్చొని జయజయ ధ్వానాలు చేశారు. ఆ నీలమేఘశ్యాముని కన్నులార దర్శించి, తమజన్మ ధన్యమయినదని ఆనందించారు. ప్రజలందరినీ కరుణాపూరిత దృక్కులతోనూ, మనోహరమైన మందహాసముతోనూ వీక్షిస్తూ, స్వామి నగరవీధులగుండా రాజప్రాసాదానికి పరివారసహితంగా విచ్చేశాడు.

కుంతీదేవి కృష్ణుని చూచి, కౌగలించుకొని ఆనందబాష్పాలు రాల్చినది. కృష్ణుడు ఆమెకు పాదాభివందనం చేశాడు. ద్రౌపది శ్రీకృష్ణునికివందనముచేసి, రుక్మిణి మొదలైన శ్రీకృష్ణసతులను సాదరంగా గౌరవించి, కానుకలు సమర్పించినది. ధర్మరాజు అందరికీ తగిన వసతులేర్పాటు చేశాడు. శ్రీకృష్ణుడు అర్జునునిచెలిమితో అనేకమైన సరస వినోద కర్యక్రమాల్లోపాల్గొంటూ, కొన్ని నెలలు ఆనందంగా గడిపాడు.

రాజసూయ యాగము

ఒకనాడు యుధిష్ఠిరుడు శ్రీకృష్ణునితో ఇలా విన్నవించాడు: "ప్రభూ! గోవిందా! రాజసూయ యాగము చేసి, దేవతల నారాధించాలని కోరికగా నున్నది. దానికి నీ ఆశీస్సులూ అనుగ్రహమూ కోరుతున్నాను. నిన్నాశ్రయించి, నీ పాదపద్మాలను నిత్యమూ కొలిచే వారి అభీష్టాలు నెరవేరకుండా ఉండవు కదా!" అనగా శ్రీకృష్ణుడిలా అన్నాడు: "ధర్మనందనా! నీ సంకల్పము ప్రశంసింప దగినది. ఈ రాజసూయయాగము దేవతలకు, పితరులకు, ఋషులకు, సర్వభూతములకు శ్రేయోదాయకము, ప్రీతికరము, కనుక తప్పకుండా చేయదగినది. ఇది నీకు కీర్తిని, విజయాన్ని, పుణ్యాన్ని సిద్ధింపజేస్తుంది గనుక నీవు ఈ యాగాన్ని చేపట్టు. సాటిలేని అస్త్రవిద్యావిశారదులైన నీతమ్ములు నీకు అండగానుంటారు. నీ శత్రురాజులను జయించి, భూమండలంలో నీకీర్తినీ, శాసనాన్ని స్థాపించు. నీవు ఏకార్యాన్ని చేయుమన్నా చెయ్యడానికి సిద్ధంగా నున్నాను." అని పలికిన శ్రీకృష్ణునకు ధర్మజుడు కృతజ్ఞతతో ప్రణమిల్లాడు. నలుగురు తమ్ములనూ 'నాలుగు దిక్కులకు వెళ్లి, మిత్రరాజుల సహాయంతో, రాజులను జయించి రండు'- అని పంపించాడు. ఆ ప్రకారమే వెళ్లిన తమ్ములు రాజులను జయించి, వారిచేత కప్పాలు కట్టించుకొని, సువర్ణ

రత్నరాసులను, గజతురగాది సంపదలను ప్రోవుచేసుకొని తెచ్చారు. వారు తమ దిగ్విజయయాత్రా విశేషాలను ధర్మజానకు నివేదిస్తూ, ఒక్క జరాసంధుడు మాత్రము లొంగలేదు, కప్పము కట్టలేదని చెప్పారు. యుధిష్ఠిరుడు ఖిన్నుడైనాడు. అప్పుడు శ్రీకృష్ణుడిలా చెప్పాడు: "ధర్మరాజా! జరాసంధుని జయించడానికి ఉద్ధవుడు చెప్పిన ఉపాయమొకటి ఉన్నది. అతనికి బ్రాహ్మణ భక్తి మెండుగానున్నది. బ్రాహ్మణులు అడిగిన దానిని అతడు లేదనకుండా ఇచ్చేస్తాడు. భీముడూ, అర్జునుడూ, నేనూ, బ్రాహ్మణ వేషాలతో వెళ్లి, అతడు మాతో ద్వంద్వయుద్ధము చెయ్యడానికి అతనిని వరము కోరుతాము. అతడు ఆ కోరికను తీర్చడానికి సిద్ధపడి వస్తాడు. అప్పుడు భీమసేనుడు అతనిని ద్వంద్వయుద్ధంలో ఓడించగలడు." అని చెప్పగా అందరూ బాగుబాగు అన్నారు.

ద్వంద్వయుద్ధము

శ్రీకృష్ణభీమార్జునులు బ్రాహ్మణవేషధారులై గిరివ్రజానికి వెళ్లారు. జరాసంధుడు వారిని ఆహ్వానించి, మిక్కిలి భక్తిశ్రద్ధలతో అతిథి సత్కారాలు చేశాడు. ఆ కపట బ్రాహ్మణులు జరాసంధునితో ఇలా అన్నారు: "ఓ మగధరాజా! బ్రాహ్మణ - అతిథిదేవులను పూజించి, వారి కోర్కెలను వెనుకాడకుండా తీర్చే ఉదారమైన దాతవని తెలిసి, ఒక కోర్కెతో నీవద్దకు వచ్చాము. దానశీలురకు ఇవ్వదగనిదేదీ లేదు. కోరిన వెంటనే బ్రతికియుండగానే తనశరీరాన్ని దానముచేసిన దధీచి, బోయవాని ఆకలితీర్చడానికి తన శరీరాన్ని అర్పించిన కపోతము, తనదేహంలోని మాంసాన్నికోసి ఇచ్చిన శిబిచక్రవర్తి, బలిచక్రవర్తి, రంతిదేవుడు, హరిశ్చంద్రుడు, బ్రాహ్మణుడైన సక్తుప్రస్థుడు మహాదాతలుగా పురాణపురుషులైనారు కదా! ఇప్పటికీ వారు ప్రజలమానసములలో సజీవులైయున్నారు కదా!" అని చెప్పిన వారిమాటలను విన్న జరాసంధుడు వారియొక్క వాగ్ధోరణీ, రీవీ, వారిభుజాలపై ఏర్పడిన వింటినారి గుర్తులు చూచి, వారు యాచకులై వచ్చిన బ్రాహ్మణులు కారనీ, బ్రాహ్మణ వేషధారులైన క్షత్రియులనీ గ్రహించాడు. వాళ్లు ఈ విధంగా తననుండి ఏమికోరడానికి వచ్చారో, వాళ్ల ఆంతర్యమేమిటో అని ఒక్కక్షణం ఆలోచించి, బలి చక్రవర్తి వద్దకు యాచించడానికి బ్రాహ్మణ వేషంలో వెళ్లిన విష్ణువులా వీరు తన వద్దకు వచ్చియుంటారనీ, బలిచక్రవర్తిలాగానే తానుకూడ పిల్లేమడిగినా ఇవ్వాలనీ, అనుకొని, ఇలా అంటాడు: "ధీమంతులారా! మీరేమి కోరినా ఇవ్వడానికి సిద్ధముగా నున్నాను, అడగండి." అనగా, శ్రీకృష్ణుడు జరాసంధునితో ఇలా అంటాడు: " ఓ మగధీశ్వరా! నీ సత్యవాక్పరిపాలన, దానశీలత యందు మాకు విశ్వాసం కలిగినది. మేము సంతోషించాము, మేము నీతో మల్లయుద్ధము చేయగోరి వచ్చాము. మాకు ఆ అవకాశ మిప్పించు. ఇంతే మా కోరిక. మేము బ్రాహ్మణులము కాము. ఇతడు కుంతీపుత్రుడైన భీముడు. ఇతడు అతని తమ్ముడైన అర్జునుడు. నేను వసుదేవ పుత్రుడను, కృష్ణుడను. నీవు మాలో ఎవ్వరితోనైనా మల్లయుద్ధం చెయ్యవచ్చును." అనగానే జరాసంధుడు అట్టహాసంగా నవ్వి, ఇలా అన్నాడు: "ఆహా! ఎంత ఆశ్చర్యము! నన్ను ఎదుర్కొనలేక మధురను విడిచి, సముద్రంలో తలదాచుకున్న పారుబోతుతో ఈ మగధాధీశ్వరుడు యుద్ధము చెయ్యడమా! సిగ్గు సిగ్గు, నీవు ప్రక్కకు తప్పుకొనుము. ఈ అర్జునుడు చురుకైన వాడేగాని చిన్నవాడు. ఈ భీముడే బాహుబలంలో నాకు సమానుడు కాగలడేమో చూద్దాం. వీడితోనే నేను యుద్ధం చేస్తాను." అని చెప్పి, రెండు గదలను తెప్పించి, ఊరిబయట నున్న బయలు ప్రదేశానికి అందరినీ తీసుకొనివెళ్లాడు.

జరాసంధుడూ భీముడూ గదలతో భూమిదద్దరిల్లేటట్టు కొట్టుకొన్నారు. వారి యుద్ధము రెండు పర్వతాలూ, రెండు మదపుటేనుగులూ, రెండు సింహాలూ ఢీకొన్నట్లుగా సాగినది. గదలు విరిగిపోయినవి. మల్లయుద్ధం మొదలుపెట్టారు. ప్రచండమైన బాహుదండాలతో ముష్టియుద్ధం చేశారు. గుద్దుకొన్నారు. ఎత్తిపడవేసుకొన్నారు, తన్నుకొన్నారు. యుద్ధము ఘోరముగా సాగుతున్నది. ఒక్కరూ అలసిపోలేదు. ఇలాగ ఎంతసేపుకొనసాగుతుందో తెలియదు. జరాసంధునకు ఇలాంటి దెబ్బలవలన చావు సంభవించదని శ్రీకృష్ణునకు తెలుసు. అప్పుడప్పుడు

భీమునిపై అతనిదే పైచెయ్యి అనిపించినప్పుడు శ్రీకృష్ణుడు తన దివ్యశక్తిని భీమునియందు ప్రవేశపెట్టేవాడు. ఇక ఈ యుద్ధమును ముగించాలని భావించిన శ్రీకృష్ణుడు భీమునకు ఒక సంకేతాన్నివ్వదలచుకొని, ఒక చెట్టుకొమ్మను పట్టుకొని నిలువునా చీల్చి చూపించాడు. భీముడు ఆ సూచనను గ్రహించి, జరాసంధుని నేలపై పడవేసి వానియొక్క ఒక కాలును తన కాలితో తొక్కిపెట్టి ఉంచి, రెండవకాలిని తన రెండుచేతులతోనూ అరటిబోదెను నిలువునా చీల్చినట్లుగా చీల్చి, ఆ ముక్కలను దూరంగా అటూఇటూ పారవేశాడు. అంతటితో వెయ్యి ఏనుగుల బలం ఉన్న అజేయుడైన జరాసంధుడు శాశ్వతంగా కన్నుమూశాడు. శ్రీకృష్ణుడూ, అర్జునుడూ ఘనవిజయం సాధించిన భీమసేనుని కౌగలించుకొని, అతనిని ప్రస్తుతించారు.

శ్రీకృష్ణుడు జరాసంధుని పుత్రుడైన సహదేవుని మగధరాజ సింహాసనం ఎక్కించి, అతనికి పట్టంగట్టాడు. బందీలైపడియున్న రాజులందరినీ విడుదలచేశాడు. చాలాకాలంగా చెరసాలల్లో క్రుగ్గుతూ, చిక్కిశల్యాలై, జడలు కట్టిన జుట్టులతో, హీనంగా దీనంగా పడియున్న రాజులందరూ తమ బంధవిమోచనుడైన భగవానుని దర్శించి, పరమానందభరితులైనారు. వారి శారీరిక మానసిక బాధలన్నీ తొలగిపోయినవి. ముక్తసంగులైన మునులవలె, తేలికపడిన హృదయాలతో భగవానుని ఇలాగ స్తుతించారు: "ఓ పరమకారుణ్యనిధీ! పాపహరణా! పద్మనాభా! వరదా! వాసుదేవా! సజ్జనార్తిహరణా! వివేకశీలా! ఆశ్రితరక్షకా! శ్రీకృష్ణా! శ్రీహరీ! గోవిందా! దాసదుఃఖనాశా! అవ్యయా, అప్రమేయా! ఇందిరావల్లభా! నీకు నిరంతరం వందనాలర్పిస్తాము. ఓయాదవ వంశచంద్రమా! దుష్టశిక్షణ సజ్జనరక్షణ చేసే ఓ పరమేశ్వరా! నీయొక్క కరుణాకటాక్షముచేత మేము ఈ నరకకూపమునుండి విముక్తులమయ్యాము. స్వామీ! మేము నీ అనుగ్రహంచేత ఈ జరాసంధుని చెరనుండి విడుదలపొందినాముగాని, భయంకరమైన ఈ సంసార బంధములనుండి విముక్తి చెందవలసియున్నది. ఐశ్వర్యమదముచే మేము ఇంతవరకును విచ్చలవిడిగా సంచరించి, నిరంకుశముగ రాజ్యపాలనచేసి, ఐహిక సంపదలే శాశ్వతం అని భ్రమపడి, పరులసొత్తునూ రాజ్యాలనూ అపహరిస్తూ పరమార్థాన్ని విస్మరించి, కాలంగడిపి వేశాము. నీయొక్క లీలావిలాసముచేత ఈ జరాసంధుని చెరలో క్రుంగి, కృశించి, రాజరికపు గర్వ, మద, అహంకారాలను పోగొట్టుకొని, నీవే శరణ్యమని తెలుసుకొన్నాము. ప్రభూ! మా రాజ్యాలను అపహరించి, మమ్మల్ని బంధించిన ఈ జరాసంధునిపైన మాకిప్పుడు కోపమేమీలేదు. అతడు అలాగ చేసినందువల్లనేకదా, మాకు ఇప్పుడు నీ యొక్కదర్శన భాగ్యము, అనుగ్రహము లభించినవి. మాకు ఇప్పుడు ఈ శరీరసౌఖ్యాలూ, రాజ్యభోగాలూ, తృణప్రాయాలుగా కనిపిస్తున్నవి. కోరవలసినవి శాశ్వత సుఖదాయకాలైన నీయొక్క పాదపద్మాలే అని తెలుసుకొన్నాము.

శ్లో॥ కృష్ణాయ వాసుదేవాయ, హరయే పరమాత్మనే ।
ప్రణతక్లేశనాశాయ, గోవిందాయ నమో నమః ॥

దామోదరా! నీపాదపద్మాలు మా హృదయాల్లో ఎల్లప్పుడూ నిలిచియుండేటట్లు అనుగ్రహించు." అని వేడుకొన్న రాజులతో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు: "రాజేంద్రులారా! రాజ్యమదముతో బ్రాహ్మణులను, ప్రజలను, బాధించిన వేనుడు, నహుషుడు, రావణుడు, కార్తవీర్యార్జునుడు మొదలైన రాజులు నశించారు. ధర్మమార్గాన ప్రవర్తించే వారియొక్క కీర్తి, ఔన్నత్యమూ వృద్ధిచెందుతాయి. ఈ శరీరము శాశ్వతం కాదని గుర్తించండి. నీతి, న్యాయము, ధర్మమూ తప్పకుండా ప్రజలను పాలించి, వారిని సుఖపెడుతూ, యజ్ఞయాగాదులను నిర్వహిస్తూ, నాయందు భక్తికలిగియుండండి. మీకు భక్తి కుదురుతుంది. సుఖదుఃఖ, జయాపజయాలవంటి ద్వంద్వాలయందు సమభావముతో, నాయందే బుద్ధినిలిపి మీ స్వధర్మపాలనచేస్తే నన్నుచేరగలరు." అని బోధించి, అందరికీ మంగళస్నానాలు చేయించి, వస్త్రాలు, కానుకలు, రథాలు, గుర్రాలు, ఏనుగులు వారికి ఇప్పించి, అందరినీ ఆనందంతో సాగనంపాడు.

శ్రీకృష్ణుడు భీమార్జునులతోగూడి, ఇంద్రప్రస్థం మరలివచ్చి, యుధిష్ఠిరునికి మగధ విజయవృత్తాంతమంతానివేదించాడు. ధర్మరాజు శ్రీకృష్ణునకు అభివందనములుచేసి, తమ్ముళ్లను కౌగలించుకొని, భీముని ప్రశంసించాడు.

శిశుపాలుడు

శ్రీకృష్ణుని అనుమతితో ధర్మజుడు వేదవిదులైన బ్రాహ్మణులను యజ్ఞకర్మనిర్వహణకు నియోగించాడు. వేదవ్యాసుడు, కశ్యపుడు, భరద్వాజుడు మొదలైన మునీశ్వరులనూ, ద్రోణకృపాది గురువులను, భీష్మ ధృతరాష్ట్ర విదురాది కురువృద్ధులను, దుర్యోధనాది బంధుజనులను, సమస్తరాజులను, బ్రాహ్మణులను, ప్రజలలోని ప్రముఖులనూ ధర్మజుడు ఆహ్వానించాడు. యజ్ఞభూమిని బంగారునాగళ్లతో దున్నించి, బంగారుపాత్రలు, పరికరాలను ఏర్పాటుచేశారు. యుధిష్ఠిరుని యజ్ఞదీక్షితునిగా చేసి, శాస్త్రవిధానం ప్రకారము సకల కార్యకలాపాలనూ నిర్వహిస్తున్నారు.

ధర్మజుడు భూపతులు తెచ్చి ఇచ్చే కానుకలను స్వీకరించడానికి దుర్యోధనుని నియోగించాడు. బీదలకు, యాచకులకు, దానాలిచ్చే పనిని కర్ణునికి అప్పజెప్పాడు. వంటల పర్యవేక్షణను భీమసేనునకు అప్పగించినాడు. శ్రీకృష్ణుని పరిచర్యలనూ, అతిథి సత్కారాల పర్యవేక్షణనూ అర్జునుని చూచుకొనుమన్నాడు. యజ్ఞసామగ్రిని సమకూర్చడానికి నకులుని నియమించాడు. దేవబ్రాహ్మణులనూ, గురువులను, పెద్దలను పూజించడానికి సహదేవుని నియోగించాడు. సమస్తప్రజలకూ మృష్టాన్నభోజనాదులు సంతృప్తికరంగా అందేటట్లు చూడుమని ద్రౌపదిని నియమించాడు. దేవేంద్రుడు, దిక్పాలకులు, బ్రహ్మాదిదేవతలు, సిద్ధసాధ్యాది ఊర్ధ్వలోకవాసులూ ధర్మజుడు చేస్తున్న యాగాన్నిచూచి, అంతవరకూ ఏరాజుకూడ ఇంతగొప్పగా చెయ్యలేదని మెచ్చుకొన్నారు. "స్వయంగా భగవానుడైన శ్రీకృష్ణుని పాదపూజ చేస్తుండే భాగ్యం కలిగినవారికి సాధించలేనిదీ, పొందలేనిదీ ఏదీ ఉండదు," అని బ్రహ్మదేవుడు ప్రశంసించాడు. దేవతా సమానులైన ఋత్విజులు నిర్వహించిన యజ్ఞము చివరిరోజునకు వచ్చినది. ధర్మజుడు ఋత్విజులను, బ్రాహ్మణులను, పెద్దలను, సభాసదులను, ఉచితరీతిని పూజించి సన్మానించాలని సంకల్పించాడు. అగ్రపూజకు అర్హుడెవరు అనే విషయంమీద సభలో అనేకులు అనేకవిధాలుగా అభిప్రాయపడ్డారు. బుద్ధిమంతుడైన సహదేవుడు భగవంతుడైన శ్రీకృష్ణుని చూపిస్తూ ఇలా అన్నాడు: "ఈ మహాత్ముని సంతుష్టునిగాచేస్తే భువనాలన్నీ సంతుష్టిని పొందుతాయి. ఎందుకంటే-ఇతడే,

ఉ॥ కాలము దేశమున్ క్రతువు కర్మము కర్తయు భోక్తయున్ జగ
జ్జ్వాలము దైవమున్ గురువు సాంఖ్యము మంత్రము నగ్ని యూహలుల్
వేళలు విప్రులున్ జనన వృద్ధి లయంబుల హేతుభూతముల్
లీలల తానయై తగవెలింగెడి నెక్కటి తేజమీశుడున్ 774

చ॥ ఇతడె యితండు కన్నులొక యించుక మోడ్చిన నీచరాచర
స్థిత భువనంబు లన్నియు నశించు నితండవి విచ్చిచూచినన్
వితతములై జనించు ప్రభవిష్ణుడు విష్ణుడునైనయట్టి యీ
క్రతుఫలదుండుగాకొరుడొకండెటు లర్హుడు శిష్టపూజకున్ 775

ఉ॥ ఈ పురుషోత్తమున్ జగదధీశు ననంతుని సర్వశక్తు జి
ద్రూపకు నగ్రపూజ బరితోషితు జేయ సమస్తలోకముల్
వేపరితుష్టి పొందు పృథివీవర! కావున నీవు కృష్ణునిన్
శ్రీపతి బూజసేయు మెడసేయక మాటలు వేయునేటికిన్ 776

కాలము, దేశము, యజ్ఞము, కర్మము, కర్తయు, భోక్తయు, విశ్వము, దైవము, గురువు, జ్ఞానము, మంత్రము, అగ్ని, ఆహుతులు, వేళలు, విప్రులు, సృష్టి, స్థితి, లయ, కారణము, సర్వమూ తానెయై ప్రకాశించే ఏకైకదివ్య స్వరూపుడు, ఈశుడు, ఇతడొక్కడే. ఇతడు కొంచెం కన్నులు మూసుకొంటే, ఈ చరాచర భువనాలన్నీ నశిస్తాయి. కన్నులు విచ్చిచూస్తే మళ్ళీ అవి అన్నీ జనిస్తాయి. ప్రభవిష్ణువూ, మహావిష్ణువూ అయినట్టి ఈ యజ్ఞఫలదాత కాకుండా, ఈ అగ్రపూజ నందుకొనడానికి ఇంకెవ్వరికి అర్హత ఉన్నది? ఈ పురుషోత్తముని, జగదీశుని, అనంతుని, సర్వశక్తుని, చిద్రూపిని అగ్రపూజతో సంతోషింపజేస్తే భువనాలన్నీ పరితుష్టిని పొందుతాయి. అందుచేత ఓ మహారాజా! ఆలస్యము చెయ్యకుండా నీవు శ్రీపతి అయిన శ్రీకృష్ణునే పూజించు. ఇంక ఇన్నిమాటలెందుకు." అని చెప్పగా మునులూ, సభాసదులూ, హర్షధ్వానాలుచేసి, బాగుబాగు అని మెచ్చుకొన్నారు. తన ఆంతర్యములోని మాటనే తమ్ముడు చెప్పినందుకూ, సభాసదులందరూ ఆమోదించినందుకూ, ధర్మనందనుడు మిక్కిలి ఆనందించాడు. శ్రీకృష్ణుని పాదాలను భక్తితో కడిగాడు. కుంతీమాత, పాండవులూ, ద్రౌపదీ, ఆ పాదతీర్థాన్ని శిరస్సునపై జల్లుకొన్నారు. బంగారు వస్త్రాలతోను, రత్నకనక రాసుల కానుకలతోను శ్రీకృష్ణుని సన్మానించారు. దేవదేవుని దివ్యశోభను, అక్కడ చేరియున్న మునులూ రాజులూ, పుణ్యాత్ములూ, ప్రజలూ కన్నుల పండువుగా వీక్షించారు. వైకుంఠం ఎలాగుంటుందో ఎవ్వరికీ తెలియనందున, ఇక్కడే వైకుంఠదర్శనాన్ని అనుగ్రహించిన శ్రీకృష్ణపరమాత్మను హృదయంలో నింపుకొని, పూజించి, ధ్యానించి, నాజన్మ ధన్యమైందని ప్రతి ఒక్కరూ బ్రహ్మానందాన్ని అనుభవించారు. దేవతలు ఈ అపూర్వదృశ్యాన్ని తిలకించి జయజయధ్వానాలు చేశారు. గంధర్వులు గానంచేశారు.

ఇంతటి శుభసంతోషనమయంలో ఆ దివ్యవైభవశోభను చూచి, ఓర్వలేక దమఘోషపుత్రుడైన చేదిరాజు, శిశుపాలుడు లేచి సభాసదులందరూ వినేటట్టుగా, ఇలా దురుసుగా మాట్లాడినారు. "ఆహా! ఏమి ఈ వైపరిత్యము! ఇంతమంది జ్ఞానవృద్ధులున్న ఈ సభలో ఏమీ తెలియని పసివాడైన ఈ సహదేవుడేదో చెప్పాడని మహామహులు, లోకపూజ్యులూ, పరమయోగీంద్రులూ, శక్తి సంపన్నులూ, రాజులు ఇందరు ఈ సభలోనుండగా వివేకహీనుడైన ఈ గొల్లవానిని అగ్రపూజకు అర్హుడని ఎలాగ నిర్ణయించారు? ఇతడెలాంటివాడో మీకు తెలియదు గాబోలు. తలిదండ్రులెవ్వరో తెలియనివాడు. వంశమూ, కులమూ, గోత్రమూ, వావివరుసలూ, సంబంధ బాంధవ్యాలూ లేనివాడు. దేవుడూ గురువూలేనివాడు. ఇల్లులేక నీటి మీదనిద్రపోయేవాడు. తుదీ మొదలూ లేనివాడు. రంగస్థల నటునివలె అనేక వేషాలు వేసేవాడు. అనేక రూపాల్లో అనేకరీతులలో ప్రవర్తించేవాడు. గుణహీనుడు. అన్నిచోట్లా చొరబడియుంటాడు. మాయగాడు, పుట్టినప్పటినుంచీచోరుడు, జారుడు. ఇలాంటి దిక్కులేనివాడు, బ్రహ్మర్షులచే పూజింపబడడానికి అర్హుడెలాగ అవుతాడు?" అని సభామర్యాదలన్నిటినీ ధిక్కరించి, దుర్భాషలాడుతున్న శిశుపాలుని మాటలను శ్రీకృష్ణుడు కొంచెమైనా లక్ష్యపెట్టకుండా, చిరునవ్వు విడువకుండా వింటూ కూర్చున్నాడు. దైవదూషణం వినలేక, ఖిన్నులై, మునులూ, కొందరు రాజులూ, శిశుపాలుని నిందిస్తూ, సభను విడిచి వెళ్లిపోయారు. పాండవులకు పట్టలేనంత ఆగ్రహావేశం వచ్చేసినది. కొందరు మిత్రరాజులు ఆయుధాలు ధరించి, శిశుపాలుని అదలించారు. శిశుపాలుడు డాలు, ఖడ్గము పట్టుకొని, అందరినీ తిట్టుకొంటూ యుద్ధానికి సిద్ధపడ్డాడు. సభాస్థలి ఒక రణరంగమయ్యేటట్లున్నది. ఏమీ పట్టించుకొనకుండా, కూర్చొని చూస్తున్న శ్రీకృష్ణునిపైకి శిశుపాలుడు కత్తిదూసి మీదపడబోతుంటే, సమయ మాసన్నమైనదని శ్రీకృష్ణుడు చక్రాయుధాన్ని శిశుపాలుని మీదికి ప్రయోగించగా, వాని శిరస్సుతెగి వాడునేలకూలాడు. వాని స్నేహితులు, సైనికులు, ప్రాణభయంతో పారిపోయారు. సభలో హాహాకారాలు చెలరేగాయి. అందరూ చూస్తుండగా, శిశుపాలుని శరీరంనుండి ఒక దివ్యతేజస్సు వెలువడి శ్రీకృష్ణునియందు

ప్రవేశించినది. దైవనింద పాపముచేత నరక కూపములో పడవలసిన శిశుపాలుడు భగవంతుడైన శ్రీకృష్ణునియందు ఎలాగ ప్రవేశించగలిగాడు అని అడిగిన పరీక్షిత్తునకు శ్రీశుకుడు ఇలా చెప్పాడు: "రాజా! మూడు జన్మలనుండీ ముకుందునిపై ద్వేషముంచుకొని, అహర్నిశలూ ఆయనయొక్క రూప, నామ, గుణాలనే స్మరిస్తుండటం చేత శిశుపాలుడు సమస్త పాపాలనుండి విముక్తుడై బ్రహ్మ రుద్రాదులకు కూడ అందని పదాన్ని పొందాడు" అని చెప్పాడు.

ధర్మరాజు, ఋత్విజులను, సదస్యులను, బ్రాహ్మణులను, దక్షిణలతో, కానుకలతో గౌరవించి, పూజించి, ఆనందింపజేసి, అవబృథ స్నానానికి నదికి బయలుదేరాడు. సోదరులూ, పురోహితులూ, మిత్రులూ, మంగళవాద్యాలతో అనుసరించగా, ధర్మజుడు ద్రౌపదీసమేతుడై వెళ్లి అవభృథస్నానం చేశాడు. అనంతరం అందరూ ఇంద్రప్రస్థం చేరుకొన్నారు. కొన్నాళ్లుండి వెళ్లవలసినదిగా ధర్మరాజు కోరినందున శ్రీకృష్ణుడు అందుకు సమ్మతించాడు. కొంతమంది భార్యలను మాత్రమే ఉంచి, మిగిలిన వారినందరినీ ద్వారకకు పంపించి వేశాడు.

రాజసూయయాగవైభవానికి సమస్తజనులూ సంతోషించగా ఒక్క దుర్యోధనుడు మాత్రము తీవ్రమైన అసూయాజ్వాలలతో దహించుకొనిపోతున్నాడు. అతిలోకసౌందర్యవతులైన శ్రీకృష్ణుని పత్నులమధ్యను మెరుపుతీగవలె మెరిసిపోతూ, అంతటా వెలుగులను వెదజల్లుతున్న ద్రౌపదిని చూచి, రాజసూయయాగ శోభతో వెలిగిపోతున్న యుధిష్ఠిరుని చూచి, అతని ఓర్వలేనితనం హద్దులు మీరినది. ఒకనాడు మయసభలో ధర్మజుడు కొలువు తీరియుండగా, దుర్యోధనుడు ప్రవేశించాడు. నీరులేనిచోట్ల నీరు ఉన్నట్టుగనూ, నీరున్నచోట్ల పొడిగానున్నట్లుగనూ, భ్రమలు కల్పించే ఆ మయసభా భవనంలో దుర్యోధనుడు భ్రమలకులోనై వస్త్రాలను తడుపుకొని తికమకపడ్తుంటే, భీముడూ, ఇతర రాజులూ, ద్రౌపదీ, ఆమెతోనున్న స్త్రీలూ, పకపకా నవ్వడంతో, అతనిలోనిండియున్న అసూయకుతోడుగా, అవమానమూ, ఆగ్రహము పెల్లుబికాయి. పరివారముతో హస్తినాపురం మరలివెళ్లాడు.

తరువాత కొన్నాళ్లకు శ్రీకృష్ణుడు పాండవులయొద్ద సెలవు తీసుకొని, పరివారసహితంగా ద్వారకానగరికి తరలివెళ్లాడు.

సాళ్వదంతవక్త్రులు

సాళ్వుని వధ:

రుక్మిణీ స్వయంవరములో శ్రీకృష్ణుని ఎదిరించి, ఓడిపోయి, పగపట్టి, పట్టుదలతో యాదవులను నాశనం చేస్తానని ప్రతిజ్ఞచేసిన వాడు సాళ్వభూపతి. అతడు ఒక సంవత్సరం ప్రతిదినమూ ఒక్క పిడికెడు ధూళిని మాత్రము ఆహారంగా తీసుకొంటూ, పరమశివుని గురించి ఘోరంగా తపస్సు చేశాడు. శివుడు సంతసించి, వరమిస్తాననగా - "నాకు నివసించడానికి ఒక చిన్న పట్టణాన్నిచ్చి, దానితో సహా ఎక్కడికి వెళ్లదలచుకుంటే అక్కడికి ఎగిరివెళ్లేటట్టు, ఇతరులకు కనిపించకుండునట్లు, ఉండాలని కోరుకొన్నాడు. శివుడు మయునితో అలాంటి పట్టణాన్ని నిర్మించి ఇమ్మన్నాడు. మయుడు పూర్తిగా లోహముతో 'సౌభకం' అనే ఒక పట్టణాన్ని నిర్మించిఇచ్చాడు. సాళ్వుడు మిక్కిలి సంతోషించి, సైన్యసమేతుడై ఆ విమానసహాయంతో శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థంలోనున్న సమయంలో ద్వారకానగరిపై దండెత్తాడు. కోటగోడలూ, గోపురాలు, భవనాలూ పడగొట్టించాడు. సరస్సులూ ఉద్యానవనాలూ పాడుచేశాడు. బంగారు ధనరాసులను కొల్లగొట్టాడు. పెద్దపెద్ద బండరాళ్లనూ, చెట్లనూ తెచ్చి, విమానంనుండి పడవేయించేవాడు. మహావీరుడైన ప్రద్యుమ్నుడు సేనతో వెళ్లి ఎదిరించాడు. అతనికి సహాయముగా, తమ్ములైన గదుడు, భానువిందుడు, సాంబుడు మొదలైనవారు వెళ్లారు. అక్రూరుడూ కృతవర్మాదులైన యాదవవీరులుకూడ వెళ్లారు. రెండుసైన్యాలూ దేవదానవుల వలె ఘోరముగా పోరాడాయి. యాదవులు సాళ్వునిసేనకు బాగా నష్టం కలిగించారు. ఇరవైయేడు అహోరాత్రాలు

యుద్ధము కొనసాగినది. సాళ్వుడు, సౌభక విమానంతో అనేక మాయా ప్రయోగాలు చేసి, యాదవ వీరులను తికమకపెట్టాడు. ఒకే విమానం అనేకచోట్ల కనిపించేది, అసలు కనిపించకుండా దగ్గరకు వచ్చి అస్త్రాలను వర్షించేది. యాదవవీరులు సాటిలేని శౌర్యముతో పోరాడినా, సాళ్వుని మాయలు వారిని చికాకు పెట్టేవి. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థమునుండి తిరిగివస్తూ, పరిస్థితిని గ్రహించాడు. బలరాముని ద్వారకానగర రక్షణకు పంపించి, తాను రంగములోనికి దిగాడు. శ్రీకృష్ణుని చూచిన వెంటనే యాదవ సైన్యాలకు విపరీతమైన శక్తి వచ్చేసినది. సాళ్వుని సైన్యాలు శక్తిహీనమయ్యాయి, సాళ్వునికి రౌద్రావేశం వచ్చేసినది. అతడు భయంకరమైన శక్తి అనే ఆయుధాన్ని శ్రీకృష్ణుని రథసారథిమీద ప్రయోగించగా, దానిని శ్రీకృష్ణుడు మధ్యలోనే ముక్కలు చేశాడు. సాళ్వుడు ఈసారి ఇంకా శక్తివంతమైన అస్త్రాన్ని వెయ్యగా అది శ్రీకృష్ణుని ఎడమచేతిని గాయపరచినది. అతనిచేతినుండి శార్ఙ్గధనుస్సు జారిపడినది. అదిచూచి సాళ్వుడు గర్వోత్సాహంతో ఇలా అరిచాడు: "ఓరీ మూఢుడా! యాదవా! నీతీనియమంలేనివాడవై శిశుపాలునకు కాబోయే భార్యను ఎత్తుకొని పోవడమే కాకుండా నిండు సభలో అతనిని చంపివేశావు. ఇదిగో ఇప్పుడే నిన్ను హతమార్చి, నా మిత్రుని ఆత్మకు ఆనందం కలుగజేస్తాను. నా మిత్రునిఋణం తీర్చుకొంటాను." అని అనగా శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు: ఓరీ మూర్ఖుడా! నీ అంతము సమీపించినదని తెలుసుకొనలేక వదరుతున్నావు" అని తనగదను ప్రయోగించగా, అది సాళ్వుని మెడను గాయపరచినది. సాళ్వుడు సౌభకంతో సహా మాయమైనాడు. అప్పుడొక వ్యక్తి శ్రీకృష్ణుని వద్దకు వచ్చి "ప్రభూ! నీతండ్రిని సాళ్వుడు బంధించాడు ఈ విషయం నీకు తెలియజేసి, తండ్రిని రక్షించుమని దేవకీదేవి నీతో చెప్పుమన్నది." అని చెప్పాడు. శ్రీకృష్ణునికి ఆశ్చర్యంవేసినది. బలరాముని రక్షణలోనున్న ద్వారకనుండి వసుదేవుని అపహరించడం ఎలాగ జరిగినది - అని యోచిస్తుండగా, సాళ్వుడు మాయా వసుదేవుణ్ని కృష్ణునకు చూపుతూ - "ఇదుగో నీతండ్రి నీఎదుటే వీడి శిరస్సును ఖండిస్తాను. శక్తి ఉంటే రక్షించుకొనుము." అంటూ వెంటనే ఆ వసుదేవుని శిరస్సుఖండించి, విమానమెక్కి మాయమయ్యాడు. శ్రీకృష్ణుడు మానవావతారమెత్తినందున మానవసహజమైన మమకారానికి ఒక్క క్షణంపాటు లోనైనవాడై దుఃఖిస్తుండగా, వైనుండి ఋషులు స్వామికి గుర్తుతేవడానికి, ఇలాగ స్తుతించారు: "స్వామీ! నీయొక్క మాయామోహితులై, జీవులు దుఃఖములో చిక్కుకొని, నీ నామస్మరణ చేసి మోహాన్నిపోగొట్టుకొంటారు కదా! అటువంటినిన్నే నీమాయ మోహపెట్టగలదా స్వామీ!" అని వినబడగానే శ్రీకృష్ణుడు సత్యాన్ని గుర్తించి, ఇటూఅటూచూడగా దేవకి పంపిన దూతగాని, వసుదేవుని శరీరముగాని కనపడలేదు. ఇది సాళ్వమాయ యని గ్రహించి, తనగదను సౌభకం మీదికి విసరగా, అది ముక్కలుముక్కలై సముద్రంలో పడినది. సాళ్వుడు నిరాశ్రయుడై శక్తిహీనుడై నేలపడ్డాడు. అయినా, లేచి, వజ్రాయుధంలాంటి తన గదను పైకెత్తి శ్రీకృష్ణుని మీదికి రాబోయాడు. శ్రీకృష్ణుడు వానిచేతిని ఖండించి, చక్రాయుధంతో శిరస్సును ఖండించాడు.

దంతవక్త్రుని వధ : దంతవక్త్రుడు మునిశాపంవలన రాక్షసుడై శ్రుతదేవకు పుట్టాడు. శిశుపాలుడు శ్రుతశ్రవస కుమారుడు. శ్రుతశ్రవస, శ్రుతదేవ, ఇద్దరూ కుంతీదేవి చెల్లెళ్ళూ, శ్రీకృష్ణుని మేనత్తలు. తన బంధువులూ, ప్రియమిత్రులూ అయిన శిశుపాల, పౌండ్రక, సాళ్వులను చంపిన శ్రీకృష్ణునిపై కక్షకట్టి, దంతవక్త్రుడు, కృష్ణుని చంపి, మిత్రునిఋణం తీర్చుకోవాలని తొందరపడుతున్నాడు. ఒకనాడు రథాన్నీ సైన్యాన్నీ తెచ్చుకొనకుండా, తన గదను పట్టుకొని, శ్రీకృష్ణుని ఎదుర్కొని, ఇలా అన్నాడు: "ఒరే కృష్ణా! నీవు నా మేనమామ కొడుకువే అయినా, నాకు పరమశత్రువువు. చిన్ననాటినుండీ నీ దుండగాలను వింటూ, నీకు తగినశాస్తి చెయ్యాలని నేను రోజూ రేయింబవళ్లు నీగురించే ఆలోచిస్తుంటాను. నా బంధుమిత్రులైన శిశుపాలపౌండ్రకసాళ్వులను హతమార్చిన నిన్ను ఇక విడిచిపెట్టరాదని నిశ్చయించుకొని వచ్చాను. నా భాగ్యవశాన నీవు ఒంటరిగా దొరికావు. ఇదిగో నా గదాదండానికి నిన్ను ఆహుతిచేసి, నా మిత్రుల ఆత్మలకు సంతోషం కలిగిస్తాను. కాచుకొనుము!" అని గదను ఎత్తి గట్టిగా కృష్ణుని

కొట్టాడు. కృష్ణుడు దానిని లక్ష్యపెట్టకుండా తన కౌమోదకీ గదతో ఆ రాక్షసుని కొట్టగా, వానిగుండె బ్రద్దలై వాడు రక్తంక్రక్కుకొని చచ్చిపడ్డాడు. వాని శరీరంనుండి ఒక దివ్యజ్యోతి వచ్చి శ్రీకృష్ణునియందు ప్రవేశించినది. శిశుపాలునివలె దంతవక్త్రుడుకూడ భగవంతునియెడల శత్రుత్వముచే మూడు జన్మలు ముగిసి వైకుంఠం చేరినాడు. దంతవక్త్రుని తమ్ముడు, విదూరథుడుకూడ కృష్ణుని ఎదిరించి అంతమయ్యారు. శ్రీకృష్ణుడు ఈ విధంగా దుష్టసంహారం సమాప్తంచేసి, ద్వారకకుచేరి సుఖంగా నున్నాడు.

బలరాముని తీర్థయాత్ర

కౌరవులకు పాండవులకు యుద్ధము జరుగనున్నదని తెలుసుకొన్న బలరాముడు ఉభయుల పట్ల తటస్థునిగా నుండదలచుకొని, తీర్థయాత్రచేయడానికి బయలుదేరాడు. ప్రభాసతీర్థంలో స్నానంచేసి తర్పణములు వదిలాడు. బిందుసరోవరం, సరస్వతీ, వజ్రతీర్థం, విశాలానది, యమున, సరయు, గంగ మొదలైన పుణ్యతీర్థాలలో స్నానాలు చేసి, తర్పణము వదిలాడు. బ్రాహ్మణసంతర్పణలు చేయించాడు. తరువాత లోకప్రసిద్ధమైన నైమిశారణ్యమునకు వెళ్లాడు. అక్కడ మునులు దీర్ఘ సత్రయాగం చేస్తున్నారు. వారు ఎదురేగి బలరాముని సత్కరించి, స్వాగతం పలికారు. ఆ సమయంలో పురాణప్రవచనం చేస్తున్న సూతుడు(రోమహర్షణుడు) అందరిలాగ తన ఆసనం వదిలి, ఎదురేగి ఆహ్వానించలేదని బలరామునికి సూతునిపైన పట్టరాని ఆగ్రహం వచ్చేసినది. అక్కడి ఋషులతో ఇలా అన్నాడు: "ఈ సూతుడు వ్యాసునివద్ద ఏవోకొన్ని పురాణాలు, కథలూ చెప్పడం నేర్చుకొని, తానొక గొప్ప విద్వాంసుడనని అనుకొంటున్నట్టున్నది. ఈ అహంకారమును మేము సహించేదిలేదు. ధర్మరక్షణకోసం పుట్టినమేము ఇతనిని శిక్షించాలి" అంటూ తన చేతిలోనున్న కుశాగ్రమును (దర్భగడ్డికొనను) సూతునిపైకి విసరగా అది బాణమువలె తగిలి సూతుని ప్రాణముపోయినది. మునులంతా హాహాకారాలు చేసి ఇలా అన్నారు: "మహానుభావా! మేము ఇతనికి బ్రహ్మాసనాన్నిచ్చి పురాణప్రవచనంలో నియోగించాము. అతడు తన ఆసనాన్ని విడువరాని నియమంలోనుండి లేవలేదుగాని నీయందు గౌరవంలేకకాదు. నీకు తెలియని ధర్మములేదుకదా! నీ విప్పుడు చేసినది బ్రహ్మహత్య అనబడుతుంది. ఈ పాపానికి నీవు నిష్కృతి చేసుకోవాలి." అని చెప్పగా బలరాముడు తన తొందరపాటు పనికి పశ్చాత్తాపంచెంది, ప్రాయశ్చిత్త విధిని తెలుపుమని ఋషులను వేడుకొని ఇలాగ అన్నాడు: "మహర్షులారా! ఈ సూతుని బ్రతికించి అతడు మళ్లీ అతని ఆయువూ, ఆత్మశక్తీ, ఆరోగ్యమూ, విద్యాదక్షతా అన్నీపొంది ప్రకాశించేటట్లు చేస్తాను. ఇంకా మీరు ఏమిచేయాలంటే అది చేస్తాను." అని చెప్పగా మునులు సంతోషించారు. ప్రాయశ్చిత్తానికి ఏమిచెయ్యాలో ఇలాగ చెప్పారు: "బలదేవా! ఇల్వలుడనే రాక్షసుని కొడుకు పల్వలుడు ప్రతి పర్వమునాడూవచ్చి యజ్ఞశాలలలో రక్తమాంసమలమూత్రాదులను కురిపించి, అపవిత్రంచేస్తున్నాడు. మాకు వాని పీడను వదిలించి, నీవు పన్నెండు నెలలపాటు దేశంలోని పుణ్యతీర్థాలలో స్నానంచేసి సేవిస్తే, నీ పాపప్రక్షాళనం అవుతుంది." అని చెప్పారు. పర్వదినం వచ్చినది. అలవాటు ప్రకారం పల్వలుడు యజ్ఞాన్ని పాడుచేయడానికి పూనుకొన్నాడు. వానిచేతిలో రక్తసిక్తమైన శూలం ఉన్నది. వాడు బలరాముని చూచి, మీద పడబోయాడు. బలరాముడు తన దివ్యాయుధాలైన నాగలిని, ఇనుపరోకలిని స్మరించాడు. అవి చేతిలోనికిరాగానే బలరాముడు నాగలితో పల్వలుని మెడను గ్రుచ్చి క్రిందికి లాగి, రోకలితోవాని శిరస్సును చితుకగొట్టాడు. రాక్షసుడు చచ్చి పర్వతంలాగ నేలకూలాడు. మునులు బలరాముని స్తుతించారు. అభిషేకం చేశారు. కానుకలిచ్చారు. అనంతరం బలరాముడు మునులవద్ద సెలవు తీసుకొని, కొందరు బ్రాహ్మణులతో బయలుదేరాడు.

బలరాముడు కౌశికీ, సరయూ, ప్రయాగ, గోమతీ మొదలైన నదులలోను, గంగాసాగర సంగమంలోనూ స్నానాదుల నాచరించి, మహేంద్రపర్వతం చేరాడు. అక్కడ పరశురాముని దర్శించాడు. సప్తగోదావరిలో స్నానం చేశాడు. కృష్ణవేణి,

పంపా, భీమా, కావేరి నదులలో స్నానం చేశాడు. శ్రీశైలము, తిరుమల, కాంచీపురం, శ్రీరంగం, మధుర, సేతుబంధం, రామేశ్వరం, మలయాచలం, కన్యాకుమారి, గోకర్ణం నిర్వింధ్యము సందర్శించి, ప్రభాసతీర్థం చేరాడు.

కౌరవపాండవ సంగ్రామంలో సమస్త రాజులూ హతులయ్యారనీ, భీమదుర్యోధనులు గదాయుద్ధానికి సన్నద్ధులవుతున్నారనీ తెలుసుకొని కురుక్షేత్రం వెళ్లాడు. ధర్మజుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, బలరాముని సగౌరవంగా ఆరాధించి ఆదరించారు. దుర్యోధనుడూ, భీముడూ గదాయుద్ధం చేయడానికి సిద్ధంగా నుండగా బలరాముడు వారిని సమీపించి, ఇలా అన్నాడు: "మీరిద్దరూ నాకు అత్యంత ప్రీతిపాత్రులు. ఇద్దరూ సమానయోధులు, ఒకరినొకరు ఓడించలేరు. కనుక ఈ యుద్ధానికి పూనుకొనవద్దు." అని హితవు పలికాడు. కాని, కర్మప్రేరితులైన వారిద్దరూ ఆ హితవాక్కులను పాటించలేదు. బలరాముడు ద్వారకకు మరలివెళ్లాడు. యాదవ ముఖ్యులు అతనికి స్వాగతం పలికారు. అక్కడ కొన్నాళ్లుండి బలరాముడు మళ్లీనైమిశారణ్యం వెళ్లాడు. అక్కడ యజ్ఞం చేయించి, దానాలిచ్చి, భార్య అయిన రేవతితో బంధువులతో కలసి అవభృథస్నానం చేశాడు. తరువాత, ద్వారకకు వెళ్లి సుఖంగా కాలం గడిపాడు.

సుదాముడు (కుచేలుడు)

శ్రీహరిగాథలను ఎన్నివిన్నా తనివితీరని పరీక్షిత్తు ఇంకా ఏమైనా చెప్పుమని వేడుకొంటే, శ్రీశుకుడు సంతసించి, ఇలా చెప్తాడు:

శ్రీకృష్ణబలరాములు సాందీపని గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు సుదాముడనే బ్రాహ్మణ బాలుడు వారికి సహాధ్యాయిగా నున్నాడు. శ్రీకృష్ణ సుదాములు మిక్కిలి సన్నిహితులైన మిత్రులుగా మెలగేవారు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత వారు విడిపోయారు. సుదాముడు గృహస్థుడై బహుకుటుంబీకుడై పేదరికంలో రోజులు వెళ్లబుచ్చుతున్నాడు. అతడు బ్రహ్మవేత్త, మానధనుడు, రాగద్వేష రహితుడైన సాత్వికుడు, శాంతుడు, ధర్మతత్పరుడు, జితేంద్రియుడు. ఇంటిలో దారిద్ర్యం తాండవిస్తున్నా ఎవ్వరినీ ఏదీ యాచించనివాడు. ప్రాప్తించినదే పదివేలుగా భావించి సంతుష్టుడైయుండేవాడు. పేదరికంవలన బక్కచిక్కి, సరియైన వస్త్రాలు లేక చినిగిన వస్త్రాలను ధరించే ఈ బ్రాహ్మణోత్తముడు కుచేలుడని పిలువబడేవాడు. కుచేలుని భార్య మిగుల ఉత్తమురాలు, పతివ్రత, సద్వంశజాత. లభించిన కొద్ది పైకముతోనే పిల్లలకు ఆహారము పెట్టగా మిగిలితే ఆమెయు, ఆమెభర్తయు తినేవారు. కొద్దిరోజులుగా ఏమీ లభించనందున బిడ్డలు ఆకలితో అలమటించిపోతుంటే, దారిద్ర్యం దుర్భరమైపోతుంటే, ఆ మహాసాధ్వి భర్తతో ఇలా అన్నది: "స్వామీ! నానాటికీ దుస్సహమైపోతున్న మన పేదరికాన్నుండి బైటపడగల మార్గమాలోచించండి. బిడ్డల ఆకలి బాధను నేను చూడలేకున్నాను. నాకొక ఆలోచన వచ్చినది. మీ బాల్య స్నేహితుడైన శ్రీకృష్ణుని దర్శించితే, ఆయన కృపాకటాక్షవీక్షణం మనపై పడితే మనకు శుభం కలుగుతుంది.

చ॥ వరదుడు సాధుభక్తజనవత్సలుడార్త శరణ్యుడింద్రా
వరుడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు తాగుశక్తి లీ
పురమున యాదవ ప్రకరముల్ భజియింపగ నున్నవాడు నీ
వరిగిన నిన్ను జూచి విభుడప్పుడ యిచ్చు ననూన సంపదల్ 966

కలలోనైనా, ఎన్నడైనా, ఆయనను స్మరించనట్టి కఠినాత్ముడు అయినా ఆపదలో ఆయనను మనసారా స్మరిస్తేచాలు ఆ దయామయుడు అన్నివిధాలా అనుగ్రహిస్తాడు కదా, మరి ఆయననే నిరంతరమూ సేవిస్తున్న నిన్ను అనుగ్రహించకుండా ఉంటాడా?" అని చెప్పిన ఇల్లాలి మాటలకు యోచించినవాడై, శ్రీకృష్ణ సందర్శనమే శ్రేయస్కరమని భావించి, ఆమెతో ఇలా అన్నాడు: "మానవతీ! నీ ఆలోచన ఆచరింపదగ్గదే. ఆయన దర్శనమే కల్యాణప్రదము.

మరి ఆయనకు ఏదైనా ఇవ్వడం బాగుంటుంది కదా!" అనగా ఆమె ఇంట్లో ఏమీలేనందున నాలుగిళ్లకు వెళ్లి నాలుగు పిడికిళ్ల అటుకులను యాచించితెచ్చి, అతని చినిగిన వస్త్రములో కట్టిచ్చినది. శ్రీకృష్ణసందర్శనోత్సాహముతో బయలుదేరిన కుచేలుడు దారిలో ఇలాగ తలపోశాడు: "ద్వారకా నగరిలోనికి ఎలాగ ప్రవేశించగలను? నా బీదరికాన్నిచూచి నన్నులోనికి పోనివ్వరేమో! అంతఃపురంలోనున్న శ్రీకృష్ణుని నేనెలాగ సమీపించగలను! ద్వారపాలకులడ్డగిస్తే ఏమని చెప్పగలను? నా అదృష్టమెలాగున్నదో! ఆ శ్రీకృష్ణుని అనుగ్రహంఉంటే ఏ ఆటంకమూ కలుగదు." అని అనుకొంటూ నగరంలో ప్రవేశించాడు. పదహారువేల మణిమయ సువర్ణసౌధాలను చూచి ఆశ్చర్యపోయాడు. వాటిలో ప్రత్యేక శోభతో ప్రకాశిస్తున్న ఒకపెద్ద సౌధాన్నిచూచి, శ్రీకృష్ణుడు ఇందులో నుండవచ్చునని భావించి, అందు ప్రవేశించాడు. వైకుంఠము స్మరణకురాగా, వైకుంఠం ఇలాగే ఉండవచ్చుననుకొన్నాడు. అతనినెవ్వరూ అడ్డగించలేదు. అతడునేరుగాలోనికి ప్రవేశించాడు. ఆ భవనాంతఃపురంలో, హంసతూలికా తల్పముపై సుందరీమణుల సేవలను పొందుతూ మహితలావణ్యమన్మథమన్మథుడైన స్వామి, రుక్మిణీ సతీమణితో వినోదిస్తుండడం ఆ భూసురోత్తముడు కాంచినాడు.

సీ॥ ఇందీవరశ్యాము వందిత సుత్రాము కరుణాలవాలు భాసురకపోలు
కౌస్తుభాలంకారు కామితమందారు సురుచిర లావణ్యు సురశరణ్యు
హర్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయాను కౌశేయపరిధాను పన్నగశయను నబ్జాతనయను
తే॥ మకరకుండలసద్భూషు మంజుభాషు నిరుపమాకారు దుగ్ధసాగర విహారు
భూరిగుణసాంద్రు యదుకులాంభోధిచంద్రు విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణు. 975

నీలోత్పలశరీరుడూ, దేవేంద్రుని వందనాలు పొందేవాడు, కరుణానిలయుడు, మెరిసేచెక్కిళ్లుగలవాడు, కౌస్తుభమణిని ధరించేవాడు, కోరికలను తీర్చే కల్పవృక్షమువంటివాడు, సుందరరూపుడు, దేవతలకు శరణమిచ్చువాడు, సింహమువంటినడుముగలవాడు, అఖిలలోకారాధ్యుడు, చక్రహస్తుడు, గరుడవాహనుడు, శేషశయనుడు, పీతాంబరధారి, అరవిందాక్షుడు, మృదుమధురభాషణుడు, క్షీరసాగరవిహారి, సకలసద్గుణరాశి, యాదవకుల చంద్రుడు, విష్ణువు, తేజోమయుడు, శాంతసహనశీలి అయిన శ్రీకృష్ణుని ఆ బ్రాహ్మణోత్తముడు దర్శించాడు. అతని జన్మధన్యమయినది. నెమ్మదిగా పురుషోత్తముని వైపునకు సంకోచముతో కాళ్లీడ్చుకొంటూ నడుస్తున్నాడు, నిత్యదారిద్ర్యపీడితుడూ, బక్కచిక్కి చినిగినవస్త్రాలు ధరించినవాడు కుచేలుడు. చిన్ననాటి సహాధ్యాయుని అల్లంత దూరంనుండి చూచినస్వామి వడివడిగా ఎదురు వెళ్లి కౌగలించుకొన్నాడు. ఆప్యాయంగా స్వాగతం పలికాడు. చేతిని పట్టుకొని తోడ్కొనివచ్చి, తన పాన్పుపై కూర్చుండబెట్టి, కాళ్లుకడిగి, ఆ జలాన్ని శిరస్సుపై జల్లుకొని, చందనం ఒంటికిపూసి, విసనకర్రతో వీచాడు. మణిమయదీపంతో నివాళులర్పించి, కర్పూరతాంబూలమిచ్చి, సిగలో పువ్వుతురిమి, ఆనందబాష్పాలు రాల్చి, ముగ్ధమోహనమందహాసముతో సుదాముని మేనుపులకింపజేశాడు. రుక్మిణీదేవి వింజామరంతో వీచినది. కుచేలుని కన్నులనుండి ఆనందబాష్పాలు ఎడతెగక కురిశాయి. గొంతుమూగపోయినది. సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువైన ఈ శ్రీకృష్ణుడెక్కడ, బక్కచిక్కిన బీదబ్రాహ్మణుడైన తానెక్కడ? అనుకొన్నాడు. ఈ విచిత్ర దృశ్యాన్నిచూచి, అంతఃపురకాంతలు విస్మయంచెందారు. "ఓహో! ఈ భూసురోత్తముడు పూర్వజన్మలో నెలాంటి తపస్సు చేసియుండెనో కదా! యోగిజనవంద్యుడైన ఈ జగన్నాథుని పాన్పుపై ఆసీనుడైయున్న ఈ మహనీయమూర్తికి ఎంతటిగొప్ప మునిపుంగవులైననూ సాటిరారుకదా! ఆ స్వామివైనా ఆ తల్పముపైనా అన్నిహక్కులూ తనవే అనుకొంటున్న ఆ రుక్మిణీదేవిని అలక్ష్యముచేసి, ఆమె ఏమనుకొంటుందో అనే సంకోచమైనా లేకుండా

శ్రీకృష్ణుడు ఈ బ్రాహ్మణునకు ఎదురువెళ్లి కౌగలించుకొని, సకల మర్యాదలతో గౌరవించి, తన పాన్పుపైననే కూర్చుండబెట్టి, వినయంగా పూజించాడంటే, ఈతడు ఎంత భాగ్యవంతుడో కదా!" అని అనుకొంటుండగా, శ్రీకృష్ణుడు కుచేలుని చేతిని తన చేతిలోనికి తీసుకొని తాము గురుకుల వాసము చేస్తుండే రోజులలోని విశేషాలను జ్ఞాపకంచేస్తూ ఇలా అన్నాడు: "మిత్రమా! వేదాధ్యయనపండితుల వంశమునుంచి వచ్చిన నీపత్ని సుశీలవతియై నీకు అనుకూలవతియై యుంటున్నదికదా! నీ మనస్సు ఇంతవరకూ దారాపుత్ర గృహక్షేత్రాదుల సంక్షేమమందు ఆసక్తి కలిగియున్నట్లు లేదే! నేను లోక కల్యాణం కోసము కర్మ నాచరిస్తున్నట్లే కొందరు ఉత్తములు దేనియందూ తగుల్కొనకుండా తమ ధర్మాలను నిర్వహిస్తుంటారు. మన గురుకులవాసము జ్ఞాపకమున్నదా? మన గురువు బ్రాహ్మణశ్రేష్ఠుడూ, సత్కర్మపరాయణుడూ, బ్రహ్మజ్ఞానీ కదా! భక్తితో గురువులను సేవించేవారు నాకు ఇష్టులు. ఒకనాడు మనము కట్టెలను తేవడానికి అడవికి వెళ్లాము గుర్తున్నదా? అప్పుడు కుంభవృష్టి కురిసినది. మనం తడుస్తూ అలాగే ఉండిపోయాము. తెల్లవారుతుండగా వర్షంతగ్గితే, మనల్ని వెదుక్కొంటూ గురువుగారైన సాందీపని వచ్చి, మనగురించి చాలా విచారించి ఇలాగ అన్నారుకదా! "నాయనలారా! మాకోసము మీరు అడవికి వచ్చి, ఇంతగా బాధపడ్డారు, మీరు గురుఋణము తీర్చుకొన్నారు. మీకు ధన, దార, పుత్ర సంపదలూ, దీర్ఘాయువూ, ఉన్నతీ, విజయశ్రీ అన్నీచేకూరగలవు" అని దీవించి, ఇంటికి తీసుకొనివెళ్లారుకదా! మనం చదువుకొనే రోజుల్లో అన్యోన్యస్నేహానుబంధాలతో ఎలాగ మెలగేవారమో గుర్తున్నదా?" ఈ విధమైన అరమరికలులేని ప్రియవచనాలకు సుదాముడు ఉప్పొంగిపోయాడు. వినడమేగాని, నోటమాటరానంత సంభ్రమంలో మునిగియున్నాడు. చివరకు ఇలాగ అనగలిగాడు: "ప్రభూ! నీవు దేవదేవుడవు, జగద్గురుడవు. వేదమే నీశరీరము. అటువంటి నీవు గురుకుల వాసము చెయ్యడం లోకానికి ఆదర్శం చూపడానికే కాక నావంటి వారికి నీయొక్కసాంగత్య భాగ్యాన్ని అనుగ్రహించడానికే కదా! లేకుంటే నీవు గురువు వద్ద నేర్చుకోవలసినదేముంటుంది?" అని చెప్పిన మాటలకు సంతసించి శ్రీకృష్ణుడిలా అన్నాడు: "మిత్రమా! నాకోసం నీవు ఏమి తీసుకొనివచ్చావు?" అని మందస్మితముఖార విందము వికసించగా అన్నాడు. కుచేలుడు ఖిన్నుడై ఊరుకొనడంచూచి, మళ్లీ అన్నాడు: "అది ఎంత స్వల్పమైనది అయినా ప్రేమతో ఇవ్వబడినదానిని నేను ప్రీతితో స్వీకరిస్తాను, కాని భక్తిలేని వాడు మేరువును తెచ్చిఇచ్చినా స్వీకరించను.

క॥ దళమైన పుష్పమైనను ఫలమైనను సలిలమైన పాయని భక్తిం
గొలచినజనులర్పించిన నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్ 1010

పత్రమైనా, పుష్పమైనా, ఫలమైనా జలమైనా నిశ్చలభక్తి కలిగియున్నవారు నాకు సమర్పిస్తే, దానిని రుచిగల మధురాన్నముగ భావించి నేను ఆరగిస్తాను." అని చెప్పిన మాధవుని మధురోక్తులకు ముదముజెంది, కుచేలుడు తానుతెచ్చిన అటుకులను బైటపెట్టడానికి సిగ్గుపడి ఊరుకొన్నాడు. సర్వాంతర్యామియైన సర్వేశ్వరునకు తెలియనిదేమున్నది? "ఈ మహాత్ముడు పూర్వజన్మలోనేమో కోరకుండా నన్ను సేవించాడు. ఇప్పుడు కూడ దారిద్ర్యబాధను భరించలేని భార్య ప్రేరణచే వచ్చాడుగాని ఏమీకోరడు. ఇతడు బహువిధాలైన సంపదల నివ్వదగినవాడు" అని భావించాడు ఆ దయామయుడైన స్వామి. కుచేలుడు తన చినిగిన ఉత్తరీయములో కట్టబడిన అటుకుల మూటను తడుముకొంటూ దీనిని సకల దివ్యభోగాలను అనుభవిస్తున్న ఆ లక్ష్మీపతికి ఇవ్వడమెలాగ అని సంకోచిస్తుండగా శ్రీకృష్ణుడే ఆ మూటను విప్పిచూచి: "ఓహో! ఈ అటుకులంటే నాకు ఎంతో ఇష్టమని నీకు తెలుసుకదా!" అంటూ ఒక పిడికెడు అటుకులను తీసుకొని నోటిలో వేసుకొన్నాడు. వాటిని ఆరగించి, "ఈ అటుకులు చాలు, నన్నూ సమస్తలోకాలనూ సంతృప్తి పరచడానికి." అంటూ ఇంకొక పిడికెడు అటుకులు తీసుకొనబోతుంటే, రుక్మిణీదేవి వారించినది. ఆమె చూపులతో "స్వామీ ఈ సుదాముడు, ఇహలోక, పరలోక - ఐశ్వర్యాలన్నిటినీ

పొందడానికి మీరు ఆరగించిన ఆ పిడికెడు అటుకులే చాలును. మీరు ఇంకా తీసుకొని తింటే, ఐశ్వర్యముతోపాటు, మన ఇద్దరమూ కూడ అతనికి సొంతం అయిపోతాము" అని సూచించినది.

ఆనాటి రాత్రి కుచేలుడు వివిధరకాల భోజ్యాలనారగించాడు. మెత్తని పాన్పుపై పవ్వళించాడు. తెల్లవారగనే నిత్యకృత్యాలను ముగించుకొని శ్రీకృష్ణుని వద్ద సెలవు తీసుకొనాలని వెళ్లాడు. పరమాత్ముని సన్నిధిలోతాను అనుభవించిన పరమానందాన్ని విడిచి వెళ్లలేని కుచేలుడు తన లౌకికస్థితిని గుర్తుచేసికొని, స్వామివద్ద సెలవు తీసుకొన్నాడు. స్వామికొంతదూరం వచ్చిసాగనంపాడు. కుచేలుడు కృష్ణుని ఏమీ అడుగలేదు. కృష్ణుడు ఏమీ ఇవ్వలేదు. కుచేలుడు మనస్సునిండా శ్రీకృష్ణుని ఆలోచనలతోనే వచ్చాడు. మళ్లీ శ్రీకృష్ణుని ఆలోచనలనే మనస్సునిండా నింపుకొని ఇంటికి వెళ్లుతున్నాడు. సుదాముడు జ్ఞానవైరాగ్య సంపన్నుడు. గర్భదరిద్రుడైయుండి కూడ సాక్షాత్తూలక్ష్మీపతియైన తనచిన్ననాటి ప్రియమిత్రుడేది కావాలంటే దాని నిస్తాడని తెలిసియుండి కూడ క్షుద్రమైన లౌకిక సంపదలను కోరాలనుకొనలేదు. దారిలో ఇలాగ అనుకొంటూ వెళ్లాడు: "ఆహా! నాపూర్వపుణ్య విశేషముచేత అనంతుడూ, అచ్యుతుడూ, చిన్మయరూపుడూ అయిన శ్రీకృష్ణ పరమాత్మను దర్శించాను. లక్ష్మీపతి, సర్వఐశ్వర్య సంశోభితుడూ అయిన వాసుదేవుడు బక్కచిక్కి చినిగిన వస్త్రాలతో నున్న దరిద్రుడనైన నన్ను ఒకసోదరునివలె ఆలింగనం చేసుకొని, ఆదరించి, పూజించి సత్కరించడం ఆ కరుణాసాగరుని యొక్క లీలావిలాసమే కదా! నా జన్మధన్యమైనది. ఇంతకన్నా నాకు కావలసినది ఇంకేమున్నది. ఓహో! నా భాగ్యమే భాగ్యము కదా! ఇంత అలౌకికమైన బ్రహ్మానందాన్ని నాకు ప్రసాదించిన నా మిత్రుడు నా మేలుకోరియే నాకులౌకిక సంపదలేవీ ఇవ్వలేదు. సర్వజ్ఞుడైన ఆ సర్వేశ్వరునికి నా పరిస్థితి తెలియక కాదు! అపారకృపాసాగరుడూ, ఆశ్రితవత్సలుడు, ఆర్తజన రక్షకుడూ అయిన ఆ స్వామి, తలచుకొంటే ఏమైనా చెయ్యగలడు, కాని దరిద్రుడు ధనవంతుడైతే దైవాన్నే ఉపేక్ష చేస్తాడని, అలాంటిదుర్గతి నాకు పట్టకూడదని, నా ప్రియమితుని శ్రేయోభిలాష. ఆహా! ఎంతటి మహత్తరమైన ప్రేమ!" అని తలపోస్తూ ద్వారకలో తాను అనుభవించిన ఆనందమధురస్మృతులను నెమరువేసుకొంటూ తన గ్రామం చేరుకొన్నాడు.

తన కుటీరం ఉండేచోట ఒక భవనం వెలసియున్నది. ఉద్యానవనంతో, తామరపువ్వుల కొలనుతో పాలరాతి గచ్చు గోడలతో నున్న ఒక మహాసౌధం అది. తానింకా ద్వారకలోనే ఉన్ననా అనే భ్రమకలిగినది కుచేలునకు. కళ్లు నులుముకొని చూచాడు. ఇంటినుండి సర్వాలంకార భూషితలైన అందమైన దాసీస్త్రీలు ఎదురు వచ్చి, "దయ చేయండి" అని ఆహ్వానించారు. సంగీత వాద్యాలతో లోనికి తీసుకొనివెళ్లారు. మానవరూపం ధరించిన మహాలక్ష్మిలాగ నున్న అతని సతీమణి ఆనందబాష్పాలతో ఎదురేగి, భర్త పాదాలకు నమస్కరించినది. సుదాముని సంభ్రమాశ్చర్యాలకు అవధులు లేవు. "ఓహో! ఇదంతా ఆ లీలామానుష విగ్రహుని అద్భుత లీలయేకదా! తానేమీ అడుగకపోయినా, సమస్త ఐశ్వర్యాభోగాలను అనుగ్రహించాడు." అనుకొంటూ భార్యతోగూడి భవనమంతా తిలకించాడు. సతీపతులు ఆ సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుని అనేక విధాల స్తుతించారు, పూజించారు. గర్భదరిద్రుడైన కుచేలుడు విశిష్ట శ్రీమంతుడైనప్పటికీ ఎలాంటి మనోవికారాలకూ లోనుగాలేదు. "ఆహా! శ్రీకృష్ణభగవానుడు ఎంతటి దయామయుడు!" మూర్తీభవించిన దారిద్ర్యమే అయియున్న నన్ను ఏవగించుకొనకుండా, సత్కరించి, పూజించి, పిడికెడు అటుకులను ప్రీతితో ఆరగించి, నాకు అమితమైన సిరి సంపదలను ప్రసాదించాడు కదా! నా వృత్తాంతమే చాలు, గోవిందుని భక్తవత్సలతను చాటి చెప్పడానికి. ప్రభూ! జన్మజన్మలకూ నాకు నీ పాదారవిందాలపైన నిండైన భక్తి నిలిచియుండుగాక!" అని, ఈ విధంగా మననం చేసుకొంటూ, భార్యాబిడ్డలతో నిశ్చింతుడై జీవించాడు. భోగాలపై ఆసక్తిలేకుండా, రాగద్వేషాది ద్వంద్వాలను జయించినవాడై, అరిషడ్వర్గాలను అదుపులో నుంచుకొని, నిరంతర హరిచింతనలో నిమగ్నుడైయుంటూ, హరిస్మరణానందాన్ని అనుభవిస్తూ, భవబంధనాలను వదిలించుకొని, ముక్తుడయ్యాడు మహాత్ముడైన సుదాముడు.

శమంతపంచక తీర్థము

పూర్వము పరశురాముడు క్షత్రియసంహారం చేసినప్పుడు వాళ్ల రక్తమంతా కురుక్షేత్రమువద్ద ఐదుమడుగులుగా ఏర్పడి శమంతపంచకమనబడినది. అది ఒక పుణ్యక్షేత్రముగా వెలసినది. ఒక అపూర్వమైన సూర్యగ్రహణం రానున్నందున దేశములోని అన్ని ప్రాంతాల ప్రజలూ ఆ తీర్థానికి వెళ్లడానికి బయలుదేరారు. ద్వారకనుండి బలరామకృష్ణులు, వసుదేవ, ఉగ్రసేన, అక్రూరాది యాదవ ప్రముఖులు, తమతమ కుటుంబాలతోను, ఇంద్రప్రస్థంనుండి పాండవులు, వ్రేపల్లెనుండి నందాది గోపాలురూ, గోపికలు, హస్తినాపురినుండి భీష్మద్రోణ విదుర ధృతరాష్ట్ర దుర్యోధనాది కౌరవ ముఖ్యులూ కుటుంబ పరివారాలతో వెళ్లారు. పర్ణశాలలవంటి విడుదులను ఏర్పాటు చేసుకొన్నారు. ఇంకా మత్స్య, కోసల, విదర్భాది - అనేక దేశాలనుండి రాజులు, ప్రముఖులూ, పరివారాలూ వెళ్లారు. ద్వారకలో నగర సంరక్షణ గురించి, ప్రద్యుమ్న, గద, సాంబాది వీరులను ఉంచి వచ్చారు, బలరామకృష్ణాది యాదవులు తీర్థంలో స్నానాలు చేసి, ఉపవాసముండి, సువర్ణ రత్నగోదానాది దానాలనిచ్చి, భోజనాదులను ముగించి, చెట్లక్రింద ఆకులను మెత్తగా పరుచుకొని విశ్రమించారు.

భీష్మ ద్రోణ సంజయ విదురాది కౌరవముఖ్యులూ నందగోపాది గోపాలముఖ్యులు యాదవుల బసకువెళ్లి, ఉగ్రసేన వసుదేవాదులకు నమస్కరించారు. స్త్రీలు ద్రౌపదినీ, కృష్ణ పత్నులను కలుసుకొన్నారు. స్త్రీ పురుషులందరూ బలరామకృష్ణులను దర్శించుకొన్నారు. ఆ వచ్చిన వారందరూ, ఉగ్రసేనునితో శ్రీకృష్ణుని గురించి ఇలాగ ముచ్చటించుకొనేవారు: "ఏ మహాత్ముని పాదస్పర్శను పొందిన భూమి పుణ్యక్షేత్రం అవుతుందో, ఏ మహాత్ముని వేదాలూ, యోగులూ, పద్మాసనుడు కూడా సంపూర్ణంగా వర్ణింపలేరో, ఏ మహాత్ముని పాదాలను కడిగిన జలము పవిత్రగంగ అవుతుందో, సనక సనందాదులు సతతమూ ఏ మహాత్ముని దర్శింపగోరి దర్శించలేరో, ఏ మహాత్ముని మంగళమూర్తియైన ఆ శ్రీకృష్ణుని మీరందరూ (ఉగ్రసేనాది యాదవులు) రేయింబవళ్లూ దర్శించగలుగుతున్నారు, ఎంత ధన్యులో! పూర్వజన్మలలో నెంత తపస్సు చేసియుంటిరో, కదా! మీకు శ్రీకృష్ణునితో బంధుత్వ, మిత్రత్వ, భాగ్యము ఎలాగ కలిగినదో!" అని అనేవారు.

నందయశోదలు, గోపాలురూ, గోపికలు కలసి, శ్రీకృష్ణదర్శనకాంక్షతో ఎంతో ఉత్సాహంగా వచ్చారు. యాదవప్రముఖులు వారికి ఎదురుగావెళ్లి ఆదరంతో స్వాగతం పలికారు. వసుదేవుడు మహానందముతో వారిని సత్కరించాడు. బలరామకృష్ణులు నందయశోదలకు నమస్కరించగా, వారి ఆనందబాష్పాలు కట్టలు తెంచుకొని ప్రవహించాయి. యశోదమ్మ బలరామకృష్ణులను తన ఒడిలో కూర్చుండబెట్టుకొని, గుండెలకు హత్తుకొని, ముద్దాడినది. చాలా సంవత్సరాలకు చూచుకొన్నందుకు మురిసిపోయినది. దేవకీదేని, రోహిణి, యశోదాదేవిని ప్రేమతో కౌగిలించుకొన్నారు. యశోదానందులు చూపిన బంధుప్రేమకు, చేసిన సత్కారములకూ వేనోళ్లకొనియాడారు: "సోదరీ! పుట్టినప్పటినుంచి బలరామకృష్ణులను మీరు కంటికి రెప్పలాగ కాపాడుతూ, అపారమైన ప్రేమానురాగాలతో పెంచి పెద్దచేశారు. అందుకే వాళ్లు మిమ్మల్నే జననీ జనకులుగా ప్రేమిస్తున్నారు. మీరెంత అదృష్టవంతులమ్మా!" అని ఆప్యాయంగా ప్రశంసించారు.

గోపవనితలు శ్రీకృష్ణుని రెప్పలార్పకుండా చూస్తూ ఆ జగన్మోహనరూపాన్ని హృదయంలో ముద్రించుకొని, బ్రహ్మసాక్షాత్కారము పొంది పరవశించిపోయిన యోగులవలె సమ్మోహితలైయుండిపోయారు. వారి మనోగతాన్ని గ్రహించిన మాధవుడు వారిని వేరుగానున్న స్థలానికి తీసుకుకొనివెళ్లి, వాళ్లకుశలమడిగి ఇలా అన్నాడు: "సుందరీమణులారా! నేను మీనుండి వెళ్లిపోయి, మళ్లీమీవద్దకు రానందుకు మీరు బాధపడుతుంటారని నాకు తెలుసు. ఉద్ధవుడు, అన్నగారు కూడ మీకు చెప్పే ఉంటారు. నేను మధుర వెళ్లిన నాటినుండి కొందరు దుష్టులను

శిక్షించవలసిన కార్యములోనూ, ద్వారకలో చక్కబెట్టవలసిన కొన్ని రాజరికపు పనులలోనూ ఉండిపోవలసి వచ్చినది. నేనెక్కడనున్నా మీరందరూ నా మనస్సులోనే ఉంటారు. మీహృదయాలు నా మీది ప్రేమచే తహతహ లాడుతుంటాయని నాకు తెలుసు. భగవంతునియందు అలాంటి అనన్య ప్రేమను కలిగియుండడమే భక్తి. శివ, బ్రహ్మ, సనక సనందాదుల హృదయాల్లో కూడ అంకురించని భక్తి మీలో వికసించినది. నాయందు భక్తిగల వారికి ఆనందముతోపాటు మోక్షముగూడ సులభసాధ్యమవుతుంది. మీయొక్క పూర్వ సుకృతాలవలన మీకు ఈ ఉన్నతపదము లభించినది. మీకు ఇక జన్మలుండవు. సర్వావస్థల్లోనూ, సమస్త భూతాల బహిరంతరాల్లోనూ, నేను వ్యాపించియున్నాను. నాకు స్వపర భేదాలు లేవు. నా భక్తులు నన్ను అన్ని వేళలలోనూ, అన్ని దేహాలలోనూ అంతటా చూడగలరు. కనుక వారు ఎల్లప్పుడూ నాయందే ఉంటారు. నా నుండి ఎడబాటును అనుభవించరు." అని పలికి, ఆ పరమేశ్వరుడు గోపికలందరికీ ఒక్కసారి తన ఆలింగన సుఖానుభూతిని కలిగించాడు. అప్పుడు ఆ గోపాంగనలు వివేకవతులై తమదేహాభిమానాన్ని విడిచి పెట్టారు. అచ్యుతుని అనంత గుణగణాలను ప్రస్తుతించారు. "మాకు ఇంకేమీ వద్దు, నీ పాద పద్మచింతన మా మనస్సులలో నిరంతరం నిలిచి యుండేటట్టు వరాన్నివ్వు" అని వేడుకొన్నారు. భక్తవత్సలుడు ఆ భక్తచూడామణుల అభీష్టాన్ని అనుగ్రహించాడు.

తరువాత శ్రీకృష్ణుడు ధర్మజుని సందర్శించి, అతని పాదాలకు నమస్కరించి, కుశల మడుగగా యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "పద్మనాభా! భక్తవత్సలుడవైన నీ పాదాల నాశ్రయించిన వారు నిత్యసౌఖ్యాలతోనుంటారు కదా! సర్వలోకైక నాథా! జాగ్రత్ స్వప్న సుషుప్తి అవస్థలకు అతీతుడవు, సర్వవ్యాపివి. విశ్వమే నీవు, నీవే విశ్వము. ఈ విశ్వము నీయందే నిలిచియున్నది. సృష్టి స్థితిలయాలు నీ యొక్క సంకల్పాధీనాలు. నీవు అఖండ జ్ఞాన స్వరూపుడవు, యోగమాయ నీ అధీనములో నుంటుంది. పాపదూరులూ, నిత్యముక్తులూ అయిన యోగులకు నీవు గోచరిస్తావు. నీకు నేను నమస్కరిస్తున్నాను. నీరజాక్షుడవూ, నిఖిలలోకాధినాథుడవూ, నిర్వికారుడవూ, నిరతిశయ కృపాసాగరుడవూ అయిన నీకు అనేక వందనాలు." అని, ధర్మజుడు చేసిన స్తుతిని విని, అందరూ సంతోషించారు.

శ్రీకృష్ణుని అష్టమహిషులను చూచి, వారి అందచందాలను చూచి ద్రౌపదీదేవి మురిసిపోయినది. వాళ్లందరూ ఆ మహనీయుని ఏ విధంగా పొందగలిగారో తెలుసుకోవాలని అందరూ ఒక చోట కూర్చొనియుండగా, ఆమె తన కోరికను వెలిబుచ్చినది. ద్రౌపదికి ఇంత చక్కని ఆలోచన వచ్చినందుకు అందరూ సంతసించారు. రసవత్తరమైన ఆ సుందరఘట్టాన్ని ఇంకొకసారి మననం చేసుకొని అందరికీ తెలియజేసే అవకాశం వచ్చినందుకు మురిసిపోయారు. వారు ఆనాటి కన్యలుగా మానసికంగా మారిపోయి, ఆ పరమపురుషుని ఎలాగ పొందగలిగారో, ఒక్కొక్కరూ ఆనందపరవశలై వర్ణించి చెప్పారు. రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, భద్ర, మిత్రవింద, నాగ్నజితి(సత్య), లక్షణ తమతమ అనుభవాలను చెప్పారు. పదహారువేలమంది రాజకన్యల తరపున రోహిణి అనే ఆమె చెప్పినది. "మా స్వామి భగవంతుడే గనుక ఈ పదహారు వేల ఎనిమిది మంది భార్యలనందరినీ సమాన ప్రేమాదరాలతో నలరింప జేస్తూ, ఒకే సమయంలో నందరితోనుంటూ, సంసారం సాగించడం సంభవమయినది." అని చెప్పినది.

ఈ విధంగా శ్రీకృష్ణసతులు తమతమ పరిణయగాథలను చెపుతుంటే వింటున్న ద్రౌపది, కుంతి, గాంధారి, ఇతర రాజపత్నులు, గోపికలూ పరవశించిపోయి ఆనందబాష్పాలు రాల్చారు. తమతమ హృదయాల్లో ఆ దివ్యసుందర లీలామానుషరూపుని పాదపద్మాలను స్మరిస్తూ కూర్చున్నారు. పురుష సమూహాల్లో కూడ శ్రీకృష్ణుని అద్భుతలీలా గాథలనే ముచ్చటించుకొనేవారు.

బలరామకృష్ణులు శమంతపంచక క్షేత్రానికి వెళ్లియున్నారని తెలుసుకొని, వారి దర్శనం చేసుకోవాలని, వ్యాసుడు, నారదుడు, వాల్మీకి, వసిష్ఠుడు, కశ్యపుడు, మార్కండేయుడు, యాజ్ఞ్యవల్క్యుడు, ఋష్యశృంగుడు, గౌతముడు,

గార్గ్యుడు, అంగిరసుడు, అగస్త్యుడు మొదలైన అనేకమంది తాపసశ్రేష్ఠులంతా అక్కడికి వచ్చిచేరారు. శ్రీకృష్ణుడు వారికి ఎదురువెళ్లి, నమస్కరించి, యథావిధిగా పూజలుచేసి, ఇలా అన్నాడు: "మహామునీశ్వరులారా! మీ వంటి పరమయోగీంద్రులందరి దర్శనం ఒక్కసారిగా లభించడం మా అదృష్టము. మీ దర్శనమేచాలు, వేరే పుణ్యతీర్థయాత్రల అవసరం లేదు. పుణ్యజలాలతో ఏర్పడిన తీర్థాలకంటే, మృత్తికా శిలలతో చేయబడిన విగ్రహాలకంటే, మీ వంటి మహాత్ముల దర్శనాలే శీఘ్ర ఫలితాలనిస్తాయి. సూర్య చంద్ర - ఇంద్రాది దేవతలనూ, పంచభూతాలనూ పూజించేకంటే, సర్వశాస్త్రవేత్తలూ, విజ్ఞానధనులూ అయిన మీవంటి మహనీయుల సేవచెయ్యడం శ్రేష్ఠతరము." అని ఈ విధంగా చెప్పిన శ్రీకృష్ణుని మాటలకు మహర్షులంతా విస్మయంచెంది, ఒక్క క్షణంలో తేరుకొని ఇలా అన్నారు: "దేవాదిదేవా! బ్రహ్మాది దేవతలతో సహా మేమూ ఈ ముల్లోకవాసులూ, అందరమూ నీ యొక్క మాయకు లోబడి యున్నవారము. నీ లీలా వినోదాలు ఎవ్వరికీ అంతుచిక్కవు. పరమేశ్వరుడవైన నీవు మమ్మల్ని ఇలా స్తుతిస్తున్నావంటే అది మా గొప్పతనమేమీ కాదు. మానవరూపం ధరించిన నీవు మానవాళికి తెలియజెప్పడం అని మా నమ్మకం. నీవు ఒక్కడవే అయినా అనేకంగా రూపొందుతావు. సృష్టి, స్థితి, లయ కార్యాలను రచిస్తావు. దుష్టశిక్షణ శిష్టరక్షణ చేస్తావు. వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తావు. నిగూఢమైన వేదరహస్యాలను స్పష్టపరుచుతావు. దేవజ్ఞానాన్ని తమలో పదిలపరచుకొని, ముందు తరాలవారికి అందించే మునులనూ, బ్రాహ్మణులనూ ప్రత్యేకంగా అభిమానిస్తావు. వేదాలలో నివసించేవాడవు, వేదస్వరూపుడవు. పరబ్రహ్మవు. మాయ అనే అడ్డుతెర చాటున నున్నమేము మా చక్షువులతో నీయొక్క మానవరూపాన్నే తిలకిస్తున్నా, నీ యొక్క పరబ్రహ్మస్వరూపాన్ని మా బుద్ధికి గోచరింపజేసిన మాయొక్క విద్య, సాధన, జన్మమూ సార్థకమైనవి. నీకు మా ప్రణామాలను అర్పిస్తున్నాము." అని, అనేక విధాల స్తుతించి, ఆశీస్సులనుపొంది, నిష్క్రమిస్తున్న ఋషులతో వసుదేవుడిలా అన్నాడు: "మునిశ్రేష్ఠులారా! పూర్వజన్మల కర్మలను ఎలాంటి సత్కర్మల నాచరించి పోగొట్టుకొనవచ్చునో సెలవివ్వవలసినదిగా ప్రార్థిస్తున్నాను." అని కోరగా, ఆ మునీశ్వరులు ఇలాగ అనుకొన్నారు: "ఈ వసుదేవుడు ఎంతటి అవివేకియో కదా! సాక్షాత్తూ పరమేశ్వరుడే తన పుత్రుడై తన ఎదుటనే ఉండగా, ఆయనను సేవించి తరించకుండా, మాయలోపడి ఆయనను తన పుత్రునిగానే భావించి, ఇతరత్రా మోక్షమార్గాలను అన్వేషిస్తున్నాడు పాపం!" అనుకొని, అతనితో ఇలా అన్నారు: "వసుదేవా! మోక్షకామి మొదట మూడు ఋణాలను తీర్చుకోవాలి: యజ్ఞయాగాలుచేసి దేవఋణాన్నీ, వేదశాస్త్రాధ్యయనం ద్వారా ఋషిఋణాన్నీ, శ్రాద్ధతర్పణములు చేసే పుత్రులను కని పితృఋణాన్నీ తీర్చుకోవాలి. నీవు ఇంకా దేవఋణాన్ని తీర్చుకోవలసియున్నది. సర్వయజ్ఞాలకూ అధిదైవమైన శ్రీమన్నారాయణుని గూర్చి యాగముచేసి, దేవఋణము తీర్చుకొనుము. శుద్ధవర్తనముచే ఆర్జించిన ధనమును యజ్ఞదానకర్మలలో వెచ్చించి విత్తేషణను తగ్గించుకోవాలి. భగవదనుగ్రహముచే లభించిన గృహస్థోచిత భోగాలను భగవదర్పితంగా అనుభవించి, దార, సుతేషణలను విడవాలి. స్వర్గలోకముకూడ అశాశ్వతమైనదే అనే ఎరుకలో లోకేషణను విడనాడాలి. లౌకిక వ్యాపారాలయందు నిస్సంగత్వం అలవరచుకోవాలి. శ్రీమన్నారాయణుడే శ్రీకృష్ణుడై అవతరించాడు గనుక ఆయన గురించి నీవు యజ్ఞముచేసి దేవ ఋణాన్ని తీర్చుకొనుము." అని చెప్పగా వసుదేవుడు యజ్ఞంచేయ నిశ్చయించుకొని, ఆ మునీశ్వరులను మీరే ఋత్విజులుగానుండి నిర్వహింపుడని ప్రార్థించాడు.

శమంతపంచక తీర్థంలో వసుదేవుడు భార్యలతో సహాదీక్ష పూనాడు. యాగం చేశాడు. యజ్ఞంశాస్త్రోక్తంగా సమాప్తమయినది. అవభృథ స్నానంచేసి ఋత్విక్కులకు, మునులకు, బ్రాహ్మణులకు, అతిథులకు, బంధువులకు ఘనసత్కారాలుచేసి సంతృప్తిపరచాడు. యాగసందర్శకులంతా వెళ్లిపోయారు.

ఉగ్రసేనుడు, వసుదేవుడు, బలరామకృష్ణులు బలవంతంచేసి, నందయశోదా గోపీగోపకులను, ఇంకకొన్నాళ్లు అక్కడే ఉంచివేశారు. నందాది గోకులవాసులు తమ ప్రియతముడైన కృష్ణయ్యతో ప్రియాలాపాలతో, మధురప్రసంగాలతో,

మనోహరలీలా వినోదాలతో అక్కడ ఆనందంగా మూడునెలలు గడపివేశారు. ఇక విడిపోవలసిన రోజు వచ్చినది. ముకుందచరణారవింద మకరంద పానముతో మత్తిల్లిన చిత్తాలను మరలించలేక, ముందుకుపోలేక, వెనక్కుచూసుకొంటూ ఎలాగో నెమ్మదిగా సాగిపోయారు.

వర్షాకాల సూచనలు కనిపించగానే బలరామకృష్ణాది యాదవులందరూ ద్వారకకు తిరుగు ప్రయాణమయ్యారు.

దేవకిపుత్రులు

ఒకనాడు బలరాకృష్ణులు తమ తలిదండ్రులైన దేవకీవసుదేవులతో ఇష్టాగోష్ఠిలోనుండగా శమంతపంచకంలో శ్రీకృష్ణుని గురించి మునులు చెప్పిన మాటలు గుర్తునకువచ్చి వసుదేవుడిలా అన్నాడు: "నాయనలారా! మీరు మమ్మల్ని తరింపజెయ్యడానికి మా బిడ్డలుగా పుట్టిన సంకర్షణ వాసుదేవులు కదా! ఈ జగత్తుకు కారణమైన వారు. సృష్టి స్థితి లయాలను నియమించే ప్రభువులు. భూభారాన్ని తగ్గించాలనే దివ్యసంకల్పంతో దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించడానికి ఈ భూమిపైన అవతరించిన వారు మీరు. కృష్ణా! నీవు పుట్టిన నాడే నాకు నీ నిజరూపాన్ని చూపించినా, నీ యొక్క మాయచేత అజ్ఞానంలో పడి నీవు నా పుత్రుడవే అనే భ్రమలోనుండేవాడను. ప్రభూ! నన్ను ఈ మాయామోహ రూపమైన సంసారం నుండి ఉద్ధరించు". అని కోరిన తండ్రితో శ్రీకృష్ణుడు తన పరమాత్మ తత్త్వాన్ని గుప్తముగా నుంచదలచుకొని మరుగు పరచుతూ, వినయంగా నమస్కరిస్తూ, ఇలాగ సర్దిచెప్పాడు: "తండ్రీ! సత్య మేమిటంటే మీరూ, అన్నయ్యా, నేనూ, ద్వారకావాసులూ, ఈ చరాచర విశ్వమంతా ఆ పరమాత్మయొక్క అంశయే. పరమాత్మ ఒక్కడే. ఆ పరమాత్మ చేతనే సర్వమూ నడిపింపబడుతున్నది. ఆ పరమాత్మనుండే సర్వమూ ఆవిర్భవించినది. మనకూ పరమాత్మకూ భిన్నత్వంలేదు." అని వేదాంత సూక్ష్మాన్ని చెప్పగా వసుదేవుని భేదభావము తొలగినది.

పూర్వము బలరామకృష్ణులు, తమ గురువైన సాందీపనియొక్క కుమారుని యముని వద్దనుండి తీసుకొనివచ్చి గురుపత్నియొక్కపుత్ర శోకాన్ని బాపిన ఉదంతాన్ని వినియున్న దేవకీదేవిలో మాతృమమకారం పెల్లుబికినది. భగవదంశసంభూతులైన తన బలరామ కృష్ణులు కంసునిచే చంపబడిన తమయొక్క ఆరుగురు సుతులను తప్పకుండా తీసుకొని రాగలరనే ఆశతో ఆమె ఒకనాడు బలరామ కృష్ణులతో ఇలా అన్నది. "నాయనలారా! పాపాత్ములైన కంస, శిశుపాల, పౌండ్రక, నరక, జరాసంధ, కాలయవనాది దుష్టులను తొలగించి భూభారాన్ని బాపిన అసమాన శక్తి సంపన్నులు మీరు. సృష్టి స్థితి లయాలను నియమించే ప్రభువులు మీరు. మృతుడైన గురు పుత్రుని యముని వద్దనుండి తెచ్చి గురుదక్షిణగా సమర్పించిన అద్భుత వ్యక్తులు మీరు. మీరు చేయజాలని దేమీ ఉండదు, కనుక నేనొక కోరికను కోరదలచుకొన్నాను. తప్పకుండా తీర్చగలరని ఆశిస్తున్నాను. కంసునిచే చంపబడిన మీయొక్క ఆరుగురు అన్నలనూ తీసుకొనివచ్చి, నా పుత్రశోకాన్ని నివారించండి." అని చెప్పిన తల్లియొక్క కోర్కెను తీర్చదలచుకొని, రామకృష్ణులు సుతల లోకానికి వెళ్ళారు. సుతల లోకాధిపతి అయిన బలిచక్రవర్తి స్వామిరాకను తెలుసుకొని, పరమానంద భరితుడై తన ఆప్తులతో సహా ఎదురుగావెళ్ళి, స్వాగతం పలికి, పాదాభివందనం చేసి, ఉచిత ఆసనాలపై కూర్చుండబెట్టి, పాదాలు కడిగి, ఆ జలాన్ని శిరస్సుపై జల్లుకొన్నాడు. నైవేద్యాలు ఆరగింపు అయిన తరువాత శ్రీకృష్ణుని పాదాలు ఒత్తుతూ ఆనందబాష్పాలు రాల్చుతూ ఆ దానవేంద్రుడు శ్రీహరిని ఇలా స్తుతించాడు.:

ఉ॥ **ధీయుతుడై 'నమో భగవతే హరయే పరమాత్మనే ముకుం దాయ, సమస్తభక్తవరదాయ, నమఃపురుషోత్తమాయ కృ ష్ణాయ, మునీంద్రవంద్యచరణాయ, సురారిహరాయ సాంఖ్య యో గాయ, వినీలభాస్వదలకాయ రథాంగధరాయవేధసే' 1145**